మంగళవారం
15•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 110
• పేజీలు : 14 + 16

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE






PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD


# చర్చలకు రండి

## ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు

ఆర్టీసీ కార్మికులకు టీఆర్ఎస్ నేత కే కేశవరావు విజ్ఞప్తి • సీఎం ఆదేశిస్తే కార్మికులతో చర్చిస్తానని వెల్లడి


సోమవారం మంచిర్యాల బస్‌స్టేషన్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

### ఆహ్వానిస్తే చర్చలకు సిద్ధమే

- కేకే మధ్యవర్తిత్వం వహిస్తే మంచిదే
- ఉద్యమనేతగా కేసీఆర్ అంటే అపూర్వ గౌరవం
- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

### పరిష్కారానికి పూనుకొంటాం

- ప్రభుత్వానికీ విజ్ఞప్తి చేస్తాం
- ఉద్యోగ జేఏసీ నేతలు రవీందర్‌రెడ్డి, మమత

### 55% తిరిగిన ఆర్టీసీ బస్సులు

ప్రత్యామ్నాయాలతో ఇబ్బందుల్లేని ప్రయాణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిస్థితి చేయిదాటిపోకముందే సమ్మె విరమించి, ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంకావాలని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, పార్టీ సెక్రటరీ జనరల్ కే కేశవరావు ఆర్టీసీ కార్మికులకు సూచించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం మినహా ఇతర సమస్యలపై చర్చించాలని విజ్ఞప్తిచేశారు. ప్రభుత్వం కూడా వీటిని పరిశీలించాలని కోరారు. కేకే సూచనపై ఆర్టీసీ జేఏసీ సానుకూలంగా స్పందించింది. ఆహ్వానిస్తే ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి చెప్పారు. కేశవరావు మధ్యవర్తిత్వం వహించి చర్చలకు ఆహ్వానం పలుకాలని అన్నారు. ఒక్కసారి చర్చలు మొదలైతే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అంటే ఉద్యమనాయకుడిగా అపూర్వ నమ్మకం, గౌరవం ఉన్నదని వ్యాఖ్యానించారు. మరోవైపు ఉద్యోగ జేఏసీ కూడా ఆర్టీసీ జేఏసీతో చర్చిస్తామని ప్రకటించింది. ఆర్టీసీ సమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తామని తెలిపింది.

**కలచివేసిన ఆత్మహత్యలు: కేకే**

పరిస్థితులు చేయిదాటకముందే ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించి ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంకావాలని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు అన్నారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు తనను ఎంతగానో కలచివేశాయని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సోమవారం ఒక ప్రకటన విడుదల చేసిన కేశవరావు.. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు వెంటనే తమ సమ్మెను విరమించాలని కోరారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం మినహా ఇతర సమస్యలపై ప్రభుత్వంతో చర్చించాలని లేఖలో సూచించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నదని తెలిపారు. దీనిలో భాగంగానే కార్మికులకు 44% ఫిట్‌మెంట్, 16% ఐఆర్ ఇచ్చిందన్నారు. ఆర్టీసీ విలీనం మినహా మిగిలిన సమస్యలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయబోమని చెప్పిన సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని కేకే తెలిపారు. అద్దె బస్సులు, ప్రైవేటు స్టేజ్ క్యారేజ్‌ల విషయంలో

మిగతా 2వ పేజీలో

# అభిజిత్‌కు ఆర్థిక నోబెల్


భార్య ఎస్తేర్ డ్యుఫ్లోతో అభిజిత్ బెనర్జీ




మైఖేల్ క్రేమర్

### భార్య డ్యుఫ్లోతో కలిసి పురస్కారానికి ఎంపికైన భారతీయ అమెరికన్

- మరో ఆర్థికవేత్త మైఖెల్ క్రేమర్‌నూ వరించిన అవార్డు
- పేదరికంపై పోరుకు విశిష్ట పరిశోధనలు
- దుర్బలంగా భారత ఆర్థిక వ్యవస్థ • అభిజిత్ ఆందోళన

**ఆర్థికశాస్త్రానికి** సంబంధించి ఈ ఏడాది ముగ్గురిని నోబెల్ బహుమతి వరించింది. భారతీయ అమెరికన్ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ (58), ఆయన భార్య ఎస్తేర్ డ్యుఫ్లో, హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మైఖెల్ క్రేమర్ నోబెల్‌కు ఎంపికైనట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ముంబైలో జన్మించిన అభిజిత్ ప్రస్తుతం మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పనిచేస్తున్నారు. భారత ఆర్థిక పరిస్థితి దుర్బలంగా ఉన్నదని, సమీప భవిష్యత్తులో కోలుకునే పరిస్థితులు కనిపించడంలేదని అభిజిత్ వ్యాఖ్యానించారు. 5



## బీసీసీఐ బాస్‌గా దాదా

అధ్యక్ష పదవికి గంగూలీ ఏకగ్రీవ ఎన్నిక

కార్యదర్శిగా అమిత్‌షా తనయుడు

వివరాలు ఆటలో

## సఫాయి కర్మచారీలకు 8,500 వేతనం

- సీఎం హామీ మేరకు పెరిగిన జీతాలు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- గ్రామపంచాయతీ గ్రాంట్ల నుంచి చెల్లింపు
- మల్టీపర్పస్ వర్కర్ల నియామకానికి మార్గదర్శకాలు
- ప్రతి పంచాయతీలో కనీసం ఇద్దరు వర్కర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రూ.4 వేల వేతనంతో పనిచేస్తున్న పార్ట్‌టైం వర్కర్లు, రూ.5 వేల వేతనంతో పనిచేస్తున్న ఫుల్‌టైం వర్కర్ల వేతనం రూ.8,500కు పెంచుతూ ఆదేశాలిచ్చారు. గ్రామపంచాయతీలకు ప్రభుత్వం విడుదలచేసే గ్రాంట్ల నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పంచాయతీల్లో పార్ట్‌టైం, ఫుల్‌టైం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో

మిగతా 6వ పేజీలో






| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 76.00 | రిటైల్ లైవ్ | 98.00 |
| డ్రెస్డ్ | 142.00 | స్కిన్‌లెస్ | 162.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 411.00 | రంగారెడ్డి | 411.00 |
| మెదక్ | 411.00 | కరీంనగర్ | 414.00 |
| వరంగల్ | 414.00 | చిల్లర ధర | 4.70 |

## హుజూర్‌నగర్‌లో 17న సీఎం సభ

- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి
- ఉత్తమ్ నిర్లక్ష్యంతోనే హుజూర్‌నగర్ వెనుకబాటు: జగదీశ్‌రెడ్డి
- కాంగ్రెస్‌ది శవ రాజకీయాల సంస్కృతి
- టీఆర్ఎస్ ఉపఎన్నిక ఇంచార్జి పల్లా వ్యాఖ్య

**హుజూర్‌నగర్, నమస్తేతెలంగాణ :** హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా ఈ నెల 17న టీఆర్ఎస్ నిర్వహించనున్న భారీ బహిరంగసభకు ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు హాజరవుతారని ఆ పార్టీ ఉపఎన్నిక ఇంచార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయిబాబా థియేటర్‌రోడ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సభను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు నియోజకవర్గ

మిగతా 2వ పేజీలో






ఢిల్లీలో కేంద్రమంత్రి గడ్కరీని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీపాటిల్

# పంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుల నియామకం



పీ గోవర్ధన్‌రెడ్డి



బండారు భాస్కర్



అజయ్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ ట్రిబ్యునల్‌లో మొత్తం ముగ్గురు సభ్యులను ప్రభుత్వం నియమించింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో పంచాయతీరాజ్ శాఖ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. సీనియర్ న్యాయవాది పీ గోవర్ధన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు బండారు భాస్కర్, వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్‌ను సభ్యులుగా నియమించారు. రాష్ట్ర నూతన పంచాయతీరాజ్ చట్టం మేరకు ఇటీవల ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లాకు చెందిన పీ గోవర్ధన్‌రెడ్డికి పలు న్యాయస్థానాల్లో పనిచేసిన అనుభవం ఉన్నది. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా ఆయన పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. గద్వాల జిల్లా గద్వాల మండలం కాకులారం గ్రామానికి చెందిన బండారు భాస్కర్ 2014 నుంచి 2019 వరకు మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్మన్‌గా ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నెక్కొండకు చెందిన గటిక అజయ్‌కుమార్ 2014 నుంచి 2019 వరకు నెక్కొండ ఎంపీపీగా పనిచేశారు. రాష్ట్ర ఎంపీపీల ఫోరం కన్వీనర్‌గా వ్యవహరించారు. అంతకుముందు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్‌గా, కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా పనిచేశారు. హైకోర్టు న్యాయవాదిగా అనుభవం కలిగిన అజయ్‌కుమార్.. తెలంగాణ ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

## సందేశాత్మక కార్యక్రమాలకు మద్దతు

ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సందేశాత్మక కార్యక్రమాలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. 'మిషన్ నేను సైతం సమాజం కోసం' సంస్థ వ్యవస్థాపకుడు షఫీ సోమవారం కూకట్‌పల్లిలో వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను షఫీ వివరించారు. వినోద్‌కుమార్‌ను కలిసిన వారిలో అనుహ్యారెడ్డి, శ్రీరాం, ఇబ్రహీం ఖురేషి, షకీనా, సిద్ధ, సాహెబ్, అశోక్, ఖిజరుల్లా తదితరులున్నారు.



# ఏడింటిని జాతీయ రహదారులుగా నోటిఫైచేయాలి

రీజినల్ రింగ్‌రోడ్డుకు అనుమతి ఇవ్వాలి

వన్ నేషన్ – వన్ ట్యాగ్ – ఫాస్ట్ ట్యాగ్ సదస్సులో మంత్రి వేముల

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో 907 కిలోమీటర్ల పొడవైన ఏడు రహదారులను జాతీయ రహదారులుగా నోటిఫైచేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఢిల్లీలోని అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో 'వన్ నేషన్ – వన్ ట్యాగ్ – ఫాస్ట్ ట్యాగ్' అంశంపై కేంద్రం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ ఎలక్ట్రానిక్ టోల్ సేకరణను సీఎం కేసీఆర్ సూత్రప్రాయంగా అంగీకరించారని పేర్కొన్నారు. ఫాస్ట్‌ట్యాగ్‌గా పేరొందిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ డివైజ్ (ఆర్ఎఫ్ఐడీ)ని ఉపయోగించడం ద్వారా దేశంలోని అన్ని రహదారులకు అసంపూర్తిగా ఉన్న టోల్ సేకరణ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, ప్రయాణికుల సమయం, ఇంధనం ఆదా అవుతుందని పేర్కొన్నారు. జాతీయ రహదారుల టోల్‌ప్లాజాల వద్ద ఇప్పటికే ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థను కేంద్రం తీసుకొచ్చిందని, రాష్ట్రాల ఆధ్వర్యంలోని హైవేలపై ఉన్న టోల్‌ప్లాజాలను ఎలక్ట్రానిక్ టోల్‌ప్లాజాలుగా మార్చాలని కోరారు. ఫాస్ట్‌ట్యాగ్ విధానంతో టోల్ వసూళ్లలో పారదర్శకత వస్తుందన్నారు.

**లక్ష కోట్లకు చేరనున్న టోల్ ఆదాయం: గడ్కరీ**

ఇదే సమావేశంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. దేశంలో ఎలక్ట్రానిక్ టోల్‌ప్లాజాల వల్ల వచ్చే ఐదేండ్లలో టోల్‌గేట్ల ద్వారా లభించే వార్షికాదాయం రూ.లక్ష కోట్లకు చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం ఈ ఆదాయం రూ.30వేల కోట్లుగా ఉన్నదని చెప్పారు.

**కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో వేముల భేటీ**

కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి.. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, రోడ్లు, భవనాలశాఖ ఈఎన్సీ గణపతిరెడ్డితో కలిసి భేటీ అయ్యారు. రాష్ట్రం తరపున పలు ప్రతిపాదనలు అందజేశారు. రాష్ట్రానికి రావాల్సిన జాతీయ రహదారులతోపాటు రోడ్లు భవనాలశాఖకు సంబంధించిన ఇతర పనులకు నిధులు మంజూరుచేయాలని, హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు అవతల రీజినల్ రింగ్‌రోడ్డుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అనంతరం మంత్రి వేముల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌లపై ఉన్న ఇబ్బందులు, పెండింగ్ అంశాలను కేంద్రందృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటివరకు 1,380 కిలోమీటర్లకు నంబరింగ్ ఇచ్చారని, డీపీఆర్ సిద్ధమైన రోడ్లకు నంబరింగ్ ఇవ్వాలని కోరామని తెలిపారు.

**కొత్త జాతీయ రహదారుల నిర్మాణంపై రాష్ట్రం చేసిన ప్రతిపాదనల వివరాలు:**

1) హైదరాబాద్ ఓఆర్ఆర్ జంక్షన్ గౌరెల్లి – వలిగొండ– తొర్రూర్– మహబూబాబాద్– ఇల్లందు
2) మెదక్ – ఎల్లారెడ్డి – రుద్రూర్
3) బోధన్ – బాసర – భైంసా
4) మెదక్ – సిద్దిపేట – ఎల్కతుర్తి
5) చౌటపల్లి – షాద్‌నగర్ – కంది
6) కరీంనగర్ – సిరిసిల్ల – కామారెడ్డి – ఎల్లారెడ్డి –పిట్లం
7 జహీరాబాద్ – బీదర్ – దేగ్లూర్ నిజాంపేట – నారాయణఖేడ్ – బీదర్ (50 కిలోమీటర్లు)

రోడ్లకు అవసరమయ్యే భూసేకరణ ఖర్చులో 50 శాతం రాష్ట్రం భరిస్తుందని చెప్పామని, హైవేల నిర్వహణకు బడ్జెట్‌లో రూ.రెండువేల కోట్లు కేటాయించాలని కోరినట్టు వెల్లడించారు. అన్ని సమస్యలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

**ప్రమాదాల నివారణకు ప్రతిపాదించిన ప్రాజెక్టులు**

1) ఎన్‌హెచ్ నాగపూర్ – హైదరాబాద్ సెక్షన్‌లోని 454 కి.మీ. నుంచి 471కి.మీ. వరకు రూ.706 కోట్లతో జియోమెట్రిక్స్ వంటి పనులు చేపట్టాలి. గుండ్లపోచంపల్లి నుంచి బోయిన్‌పల్లి వరకు రూ.447 కోట్లతో నాలుగులేన్ల రోడ్డును ఆరులేన్ల రోడ్డుగా పూర్తిచేయాలి.
2) హైదరాబాద్ – బెంగళూరు సెక్షన్‌లోని 22.30 కి.మీ. 34.14 కి.మీ. వరకు రూ.309 కోట్లతో జియోమెట్రిక్స్ అభివృద్ధి పనులు చేపట్టాలి.

**భారత్‌మాల పథకం కింద చేసిన ప్రతిపాదనలు**

- ఔటర్‌రింగ్ రోడ్డు అప్పాజంక్షన్ నుంచి మన్నేగూడ వరకు 46.391 కి.మీ. రోడ్డును నాలుగులేన్లుగా అభివృద్ధిచేయాలి.
- కోదాడ నుంచి ఖమ్మం వరకు 31.8 కి.మీ. రోడ్డును నాలుగులేన్లుగా మార్చాలి.
- భారత్‌మాల కింద జాతీయ రహదారి 161బీబీకి చెందిన మిస్సింగ్‌లింక్ బోధన్ – రుద్రూర్ – మద్నూర్ సెక్షన్‌ను ప్రాధాన్యాల లిస్ట్‌లో చేర్చి, అభివృద్ధిచేయాలి.
- ఎన్‌హెచ్ 161 ఏఏ కింద నోటిఫైచేసిన సంగారెడ్డి – నర్సాపూర్ – తూప్రాన్ – చౌటుప్పల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఉత్తరభాగం నిర్వహణకు నిధులు ఇవ్వాలి.
- హైదరాబాద్ యాన్యుల్‌మోడ్ కింద రీజినల్ రింగ్‌రోడ్డుకు అనుమతి ఇవ్వాలి.

# ఉత్తమ్ చేసింది శూన్యం

గిరిజనులకిచ్చిన మాటనిలబెట్టుకున్న మహామనిషి కేసీఆర్

గిరిజన సంక్షేమశాఖమంత్రి సత్యవతి రాథోడ్

**హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ/ గరిడేపల్లి :**

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటలు నీటి మీద రాతలని, మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన చేసిందేమీ లేదని గిరిజన, మహిళా, శిశుసంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఎన్నికలప్పుడే వచ్చి ఓట్లు అడుగుతారని, తర్వాత మళ్లీ కన్పించరని విమర్శించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఇచ్చినమాట నిలబెట్టుకుని గిరిజనులందరి జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. సోమవారం గరిడేపల్లి మండలం గారకుంటతండా, శీత్లాతండా, చిన్న గారకుంటతండాల్లో శాసనమండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె ఉపఎన్నికల ప్రచారం నిర్వహించారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగాచేసి, వాటి రూపురేఖలను మార్చిన మహామనిషి సీఎం కేసీఆర్ అని ప్రశంసించారు. చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సైదిరెడ్డి స్థానికుడు, యువకుడని ఆయనకు ఏ గ్రామంలో ఏ పనులు చేయాలో పూర్తి అవగాహన ఉన్నదని చెప్పారు. టీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాములునాయక్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శులు రూప్‌సింగ్, ఇంతియాజ్ ఇసాక్, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**టీఆర్ఎస్‌ను గెలిపించండి.. హుజూర్‌నగర్ చరిత్ర మారుస్తాం: ఎంపీ నామా**

ఉపఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపిస్తే హుజూర్‌నగర్ చరిత్రనే మారుస్తామని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. సోమవారం హుజూర్‌నగర్ నియోజకవర్గ కమ్మ నేతలతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఉత్తమ్‌కు పదేండ్లు అవకాశమిచ్చినా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని, ఈసారి టీఆర్ఎస్‌కు గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామని చెప్పారు. ఉత్తమ్ మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉంటూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎలాంటి పనులూ చేయలేదని, పరిశ్రమలున్న ఈ ప్రాంతంలో ఈఎస్ఐ దవాఖానను నిర్మించలేదని ఆరోపించారు. ప్రజలు మరోసారి మోసపోవద్దని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, మాగంటి గోపీనాథ్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండి రమేశ్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు ఉన్నారు.

**హోరెత్తిన టీఆర్ఎస్ ప్రచారం**

హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మద్దతుగా ప్రచారం జోరుగా సాగుతున్నది. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా టీఆర్ఎస్ శ్రేణులకు మహిళలు హారతులతో ఘనస్వాగతం పలుకుతున్నారు. సోమవారం గరిడేపల్లి మండలం గారకుంటతండా, సీత్లాతండా, చిన్నగారకుంటతండాల్లో గిరిజన, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, శాసనమండలి చీఫ్‌విఫ్ బోడకుంటి వెంకటేశ్వర్లు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, ఎమ్మెల్యే రాములునాయక్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, తాళ్లమల్కాపురం, మంగాపురం గ్రామాల్లో టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ ఇసాక్ ప్రచారం నిర్వహించారు. ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అప్పన్నపేట, కీతవారిగూడెంలో, ఎమ్మెల్సీ గంగాధర్ గరిడేపల్లిలో ప్రచారం చేయగా.. రామచంద్రాపురం, మల్లయ్యగూడెం, కోదండరామాపురంలో సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్, శానంపూడి రజిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో మహ్మద్ యూసుఫ్, తక్కెళ్లపల్లి రవీందర్ ప్రచారంచేశారు. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి, సోమవరంలో ఎంపీ బండ ప్రకాశ్, ఫత్తేపురం, వైకుంఠాపురం, జానలదిన్నె, దిర్శించర్ల గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఎమ్మెల్సీ పీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎన్ నరేందర్, టీ రాజయ్య ప్రచారాన్ని నిర్వహించారు. చింతలపాలెంలో శానంపూడి రజిత ప్రచారం చేశారు. మేళ్లచెర్వు మండలం కందిబండ, నల్లబోయినగూడెంలో వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్, రామపురం, రేవూరులో మైనార్టీ రాష్ట్ర నాయకుడు హనీఫ్ ముక్తదర్ ప్రచారం చేశారు. మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం, గుర్రంపోడుతండా, చౌటపల్లిలో ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, నోముల నర్సింహయ్య, ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, ఖమ్మం డిప్యూటీ మేయర్ మురళి ప్రచారం చేశారు. పాలకీడు మండలం మీగడంపాడుతండా, దేవ్లాతండాల్లో ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే హరిప్రియ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సజ్జాపురం, మూసిఒడ్డు సింగారం, ఎల్లాపురం, రాఘవపురం, గుండ్లపహాడ్‌లో జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, గుడుగుంట్లపాలెంలో మైనార్టీ నాయకులతో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ సమావేశమయ్యారు. దేవ్లాతండాలో టీఆర్ఎస్ నాయకురాలు శంకరమ్మ ప్రచారం చేశారు. ఆయా గ్రామా ల్లో టీఆర్ఎస్ నేతలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.



నేరేడుచర్ల మండలం వైకుంఠాపురంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ నేత శంకరమ్మ తదితరులు



నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని నర్సయ్యగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, తాటికొండ రాజయ్య

## 17న సీఎం సభ

మొదటిపేజీ తరువాయి...

ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ బహిరంగసభ ఏర్పాట్లను సోమవారం విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పరిశీలించారు. గిరిజన, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ, పార్టీ ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, వినయ్ భాస్కర్, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపికా యుగంధర్‌తో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. హుజూర్‌నగర్‌కు ఇప్పటివరకు చేసిన, తర్వాత చేయబోయే పనులను సీఎం కేసీఆర్ వివరించనున్నారని తెలిపారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్లక్ష్యం వల్లే హుజూర్‌నగర్ అభివృద్ధిలో వెనుకబడిందని, ఈసారి ఎలాగైనా టీఆర్ఎస్‌ను గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఉత్తమ్ గతంలో రెండుసార్లు ప్రజలను మాయమాటలతో మోసంచేశారని, మరోసారి వారిని మోసగించడానికి ఆయన వద్ద ఇంకేమీ లేవని ఎద్దేవాచేశారు. అందువల్లే పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ప్రచారానికి గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, మహిళలు హారతులు ఇచ్చి స్వాగతిస్తున్నారని తెలిపారు.

**ఓటమి భయంతో కార్యకర్తలను బెదిరిస్తున్న ఉత్తమ్: పల్లా**

కాంగ్రెస్ నాయకులది శవాల మీద రాజకీయాలు చేసే సంస్కృతి అని, ఆర్టీసీ సమ్మెపై వారికి మాట్లాడే అర్హత లేదని టీఆర్ఎస్ ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్, సోమ భరత్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీని విలీనం చేయాలని కోరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు చేయడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పార్టీల నాయకుల వైఖరిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, వారికి తగిన సమయంలో బుద్ధి చెప్తారన్నారు. ఈసీ కి ఏదో ఒక తప్పుడు ఫిర్యాదు చేస్తూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీతిమాలిన రాజకీయాలను చేస్తున్నారని చెప్పారు. రాత్రివేళల్లో టీఆర్ఎస్ కార్యకర్తల ఇండ్లకు వెళ్లి వారిని బతిమాలుతున్నారని, మాటవినకుంటే భయపెడుతున్నారని ఆరోపించారు. హుజూర్‌నగర్‌లో అరాచకానికి, అభివృద్ధికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, నియోజకవర్గ అభివృద్ధిని కోరుకునేవారు టీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ బహిరంగసభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపికా యుగంధర్‌రావు తదితరులు

**ముహూర్తం**



సూర్యోదయం: 6:10 గంటలకు



సూర్యాస్తమయం: 5:50 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, విదియ (బుధవారం ఉదయం 5.44 వరకు), తదుపరి తదియ, నక్షత్రం: అశ్విని మధ్యాహ్నం 12.29 వరకు, తదుపరి భరణి, అమృతఘడియలు: తె.జా. 4.38 నుంచి 6.23 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 2.55 నుంచి సాయంత్రం 4.23 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.30 నుంచి 9.16 వరకు, తిరిగి రాత్రి 10.54 నుంచి 11.41 వరకు, వర్జ్యం: ఉదయం 8.08 నుంచి 9.52 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.13 నుంచి 3.56 వరకు.

**లోకం పోకడ**




మీ వెయిట్ ఇంకా తగ్గాలి ఇంకొన్ని కేసులు పడాలి!!

# చర్చలకు రండి

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ చేసిన ప్రకటనను సమ్మె నేపథ్యంలో తీసుకున్న నిర్ణయంగా భావించాలని ఆర్టీసీ నాయకులకు సూచించారు. టీఆర్ఎస్ మ్యానిఫెస్టో కమిటీకి తానే నేతృత్వం వహించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని టీఆర్ఎస్ తన మ్యానిఫెస్టోలో ఎక్కడా పెట్టలేదని స్పష్టంచేశారు. ఆర్టీసీనే కాదు ఏ ప్రభుత్వరంగ సంస్థనూ ప్రభుత్వంలో విలీనం చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొనలేదని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వంలో విలీనంచేయాలని డిమాండ్ చేయడమంటే తమ విధానాన్ని మార్చుకోవాలని కోరడమేనని ఆయన పేర్కొన్నారు. ఇది ఆర్టీసీ యూనియన్లకు సంబంధంలేని అంశమని పేర్కొన్నారు.

**సీఎం ఆదేశిస్తే ఆర్టీసీ కార్మికులతో చర్చిస్తా**

ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నడుచుకుంటామని కే కేశవరావు చెప్పారు. సీఎం ఆదేశిస్తే కార్మికులతో చర్చలు జరుపుతామన్నారు. సోమవారం రాత్రి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కేకే.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అదే సమయంలో కార్మికులు సమ్మె విరమించాలని సూచించినట్లు చెప్పారు. దీనిపై చర్చలు జరిపేందుకు సీఎం కేసీఆర్ చెప్పాలని, ఆయన ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించి చర్చలకు రావాలన్నారు. ఈ విషయంలో అంతిమ నిర్ణయం సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు.

**కేకే మధ్యవర్తిత్వం మంచిదే: అశ్వత్థామరెడ్డి**

ప్రభుత్వంతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి చెప్పారు. కే కేశవరావు మధ్యవర్తిత్వం వహించి చర్చలకు ఆహ్వానం పలుకాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి చర్చల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. చర్చలు మొదలైతే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ అంటే ఉద్యమనాయకుడిగా అపూర్వ నమ్మకం, గౌరవం ఉన్నదని వ్యాఖ్యానించారు. సోమవారం జేఏసీ నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిసి సమ్మె గురించి వివరించారు. అనంతరం అశ్వత్థామరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ నాయకులు తమను సంప్రదించకుండానే సమ్మెకు వెళ్లారని ఉద్యోగ సంఘాలు అనటం సరికాదన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసమే సమ్మె చేస్తున్నామన్న ఆయన.. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. కార్మికులు ఎవరూ సహనం కోల్పోవద్దని పిలుపునిచ్చారు.

**కార్మికులు అధైర్యపడవద్దు: ఉద్యోగ జేఏసీ**

సాధించే విజయంలో కార్మికవర్గం మొత్తం భాగస్వాములు కావాలని, అంతేకానీ అధైర్యంతో అఘాయిత్యాలకు పాల్పడవద్దని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత విజ్ఞప్తిచేశారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వానికి ఇప్పటికే జేఏసీ తరపున విజ్ఞప్తి చేశామని, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నామని సోమవారం విడుదలచేసిన ప్రకటనలో తెలిపారు. త్వరలోనే ఆర్టీసీ జేఏసీ నాయకులతో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకత్వం మాట్లాడి సమస్యల పరిష్కారానికి పూనుకొంటుందని పేర్కొన్నారు. దీనిలో అపోహలకు అవకాశం లేదని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారమై, సమ్మె విరమించి, రవాణాసంస్థ సాధారణ స్థితికి చేరుకోవాలని కోరుతున్నామన్నారు. సమ్మెలో పాల్గొంటూ అసువులు బాసిన కార్మికులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌గౌడ్ కుటుంబాలకు ఉద్యోగ జేఏసీ ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఉద్యోగ జేఏసీ వ్యతిరేకం కాదని, ఈ సమ్మెతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలని ప్రతి ఒక్కరం కోరుకుంటున్నామని రవీందర్‌రెడ్డి, మమత ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఉద్యోగుల జేఏసీ ముందు వరుసలో నిలుస్తుందని తెలిపారు. అయితే ఈ సమ్మెను సాకుగా తీసుకుంటూ పేరు ప్రఖ్యాతులు పెంచుకునేందుకు కొందరు నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తూ, ఉద్యోగుల జేఏసీ మీద దుష్ప్రచారం చేస్తున్నారని రవీందర్‌రెడ్డి, మమత ఆవేదన వ్యక్తంచేశారు. సమ్మెకు కేవలం మద్దతు ఇవ్వడంతోనే బాధ్యత తీరదని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడమే నిజమైన మద్దతు ఇచ్చినట్టని అన్నారు. దీనికోసం ఉద్యోగుల జేఏసీ బాధ్యతాయుతంగా కృషిచేస్తుందని, ఈ విషయాన్ని ఆర్టీసీ కార్మికులు అర్థంచేసుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు. ఎనిమిది లక్షలమంది ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చిస్తున్నామని, దీనిలో ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టంచేశారు. ఈ చర్చలు సఫలమవుతాయనే విశ్వాసం ఉన్నదని, ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కూడా చర్చిస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది నాయకులు టీఎన్జీవో, టీజీవో సంఘం నేతలను టార్గెట్‌చేస్తూ సోషల్‌మీడియాతోపాటు పలుప్రాంతాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలుచేస్తున్నారని, వాటిని వెంటనే మానుకోవాలని జేఏసీ ప్రతినిధులు హితవు పలికారు. ఆర్టీసీ సమ్మెపై సానుకూల స్పందన వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఉద్యోగసంఘాల జేఏసీ కచ్చితంగా ఉద్యోగులు, కార్మికవర్గాల పక్షాన ఉంటుందని స్పష్టంచేశారు. సమస్యలు పరిష్కారం చేసుకునేందుకు ప్రభుత్వం విషయంలో సంయమనం పాటించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగుల జేఏసీ కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తుందని, సమస్యల పరిష్కారం కోసం పూనుకొంటామని రవీందర్‌రెడ్డి, మమత ప్రకటించారు.



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న టీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావు

**55% తిరిగిన ఆర్టీసీ బస్సులు**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలు ప్రయాణికులకు ఇబ్బందులను తొలగిస్తున్నాయి. సమ్మె ప్రారంభమై సోమవారంతో పదిరోజులు అవుతున్నా.. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన డ్రైవర్లు, కండక్టర్లతో ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కుతున్నాయి. అవసరం మేరకు మరింతమందిని నియమించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో ఆ ప్రక్రియ కూడా అన్ని జిల్లాల్లో కొనసాగుతున్నది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 55% ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. మరో ఆరు వేలకు పైగా ప్రైవేటు వాహనాలు సేవలందించాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో సమస్యలన్నీ తొలగిపోతాయని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా బస్సులను అందుబాటులో ఉంచుతున్నామని, అన్ని రీజియన్లలో పరిస్థితి క్రమంగా మెరుగుపడుతున్నదని తెలిపారు. రవాణా, ఆర్టీసీ, పోలీసుల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎలాంటి సమస్య రాకుండా పలు డిపోల ముందు పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

## సీఎంవోపై దుష్ప్రచారం

ఫేక్‌వాయిస్‌కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోండి

పోలీస్ కమిషనర్‌కు సీఎం కార్యాలయ అధికారుల ఫిర్యాదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఓ వ్యక్తి తెలంగాణ సీఎం కార్యాలయ సిబ్బందికి ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినట్టు ఫేక్‌వాయిస్ సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులు సోమవారం నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేశారు. సీఎం కార్యాలయ హెల్ప్‌లైన్‌కు ఎవరో ఫోన్‌చేసి ఆర్టీసీ సమ్మెపై తమ అభిప్రాయాలు చెప్పినట్టు రెండ్రోజులుగా పత్రికల్లో, చానళ్లల్లో, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం జరుగుతున్నదని సీఎంవో అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని.. తప్పుడు ప్రచారాన్ని ఆపాలని పోలీస్ కమిషనర్‌ను వారు కోరారు. ఈ ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదుచేయాలని సీసీఎస్ జాయింట్ సీపీ అవినాశ్ మహంతిని ఆదేశించామని సైబర్‌క్రైమ్ పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతారని సీపీ అంజనీకుమార్ తెలిపారు.



సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ సర్పంచ్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు చక్కటి వెంకటేశ్ యాదవ్. చిత్రంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, అధికార ప్రతినిధి జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సర్పంచ్‌ల సంఘం మద్దతు

తెలంగాణ సర్పంచ్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్

సైదిరెడ్డి గెలుపే లక్ష్యంగా 17, 18 తేదీలలో విస్తృత ప్రచారం

**బషీర్‌బాగ్ నమస్తే తెలంగాణ/గరిడేపల్లి :**

హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ సర్పంచ్‌ల సంఘం ప్రకటించింది. టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయం కోసం హుజూర్‌నగర్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్టు వెల్లడించింది. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం గౌరవాధ్యక్షుడు చక్కటి వెంకటేశ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, అధికార ప్రతినిధి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ గతంలో స్పష్టమైన హామీఇచ్చారని తెలిపారు. ఇటీవల గ్రామాల అభివృద్ధికి రూ.330 కోట్లు కేటాయించిందుకు హర్షం ప్రకటిస్తూ ఉపఎన్నికల్లో తమ సంఘం సంపూర్ణ మద్దతును ఇస్తున్నదని తెలిపారు. ఈ నెల 17, 18 తేదీలలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ తరపున ప్రచారం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలోని సర్పంచ్‌లందరూ సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషిచేస్తున్న బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తమ సంఘం ముందుకు సాగుతున్నదన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరమని, కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు మధులతా మోహన్, యాదమ్మయాదయ్య, లలితశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో సరికొత్త రికార్డు

ఒకేరోజు 3.80 లక్షల మంది ప్రయాణం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ మెట్రో సరికొత్త చరిత్ర లిఖించింది. సోమవారం ఒక్కరోజే వివిధ రూట్లలో 3.80 లక్షల మంది ప్రయాణించారు. హైదరాబాద్‌లో మెట్రో ప్రారంభమైనాక ఇది కొత్త రికార్డని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 3.65 లక్షల మంది ప్రయాణించడం రికార్డుకాగా, దానిని తాజాగా అధిగమించామని పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మె కారణంగా మెట్రోరైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగిన సంగతి తెలిసిందే. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో రైళ్లను 100 ట్రిప్పులు అదనంగా.. అంటే రోజుకు 810 ట్రిప్పులు నడుపుతున్నట్టు అధికారులు వెల్లడించారు.




బ్రహ్మోత్సవ మండప నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వైటీడీఏ ప్రధాన స్థపతి డాక్టర్ ఆనందాచార్యుల వేలు

## యాదాద్రిలో బ్రహ్మోత్సవ మండపం పనులు ప్రారంభం

**యాదాద్రిభువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ విస్తరణలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను నిర్వహించే బ్రహ్మోత్సవ మండప నిర్మాణ పనులను వైటీడీఏ ప్రధాన స్థపతి డాక్టర్ ఆనందాచార్యుల వేలు సోమవారం ప్రారంభించారు. కొత్తగా ఆలయం నిర్మిస్తున్నందున బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో బ్రహ్మోత్సవ మండపాన్ని ఉపయోగించుకొనేలా సీఎం కేసీఆర్ సూచనల మేరకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఉపయోగించుకొనేందుకు భారీ మండపం పనులు పూర్తి చేసుకొనేలా కార్యాచరణను రూపొందించినట్టు ఆనందాచార్యుల వేలు వివరించారు.

## మంచు దుప్పటి

**నైరుతి రుతుపవనాలు తిరోగమిస్తుండటంతో వానకాలం ముగిసి చలికాలం ప్రవేశిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలాన్ని మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 8గంటల వరకు మంచు కమ్ముకున్నది. ముంబై-బెంగళూరు లింక్ జాతీయ రహదారిపై మంచు కమ్ముకోవడంతో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు.**

**- షాబాద్, నమస్తే తెలంగాణ**






ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు భూపాలపల్లికి ఎడ్లబండ్లలో వెళ్తున్న జూబ్లీనగర్ రైతులు

## ఎడ్లబండ్లపై ప్రజావాణికి..

- భూములు పట్టాచేయాలంటూ రైతుల నిరసన ర్యాలీ
- ఆర్డీవో, తాసిల్దార్ హామీతో వెనుదిరిగిన బాధితులు


కుందయ్యపల్లి గ్రామంలో తమ గోడును అధికారులతో వెళ్ల బోసుకుంటున్న రైతులు

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం జూబ్లీనగర్‌కు చెందిన రైతులు ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. జూబ్లీనగర్‌కు చెందిన 400 మంది రైతుకూలీలు 70 ఏండ్లుగా గ్రామశివారులోని 399 సర్వేనంబర్‌లో 520 ఎకరాల ప్రభుత్వభూమిని సాగు చేసుకొంటున్నారు. రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లోకూడా నమోదుచేశారు. భూరికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ అధికారులు ఈ రైతులకు సంబంధించిన పేర్లను తొలగించారు. మూడునెలల క్రితం రైతులు గ్రామ, మండల రెవెన్యూ అధికారులను సంప్రదించగా.. అది అటవీశాఖకు చెందిన భూమి అని చెప్పారు. ఈ భూమిపై రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా సర్వేచేయాలని రైతులు డిమాండ్‌చేయడంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి ఆ భూమి తమశాఖది కాదని తేల్చిచెప్పారు. అప్పటినుంచి రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా.. అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో సోమవారం తెల్లవారుజామున 400 మంది నిరసన వ్యక్తం చేసేందుకు ఎడ్లబండ్లపై జిల్లాకేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి బయల్దేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన భూపాలపల్లి సమీపంలోని కుందయ్యపల్లి తాటివనం వద్దకు ఎడ్ల బండ్ల ర్యాలీ చేరుకోగానే వాటిని తాటివనంలోకి మళ్లించారు. పోలీసుల ప్రమేయంతో రేగొండ తాసిల్దార్ శ్రీనివాసాచార్యులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఆర్డీవోతో కూడా రైతులతో ఫోన్‌లో మాట్లాడించారు. పదిహేను రోజుల్లో పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.

# ఆసరాకు కాల్ సెంటర్

- ప్రస్తుతం పది జిల్లాల్లో ఏర్పాటుచేశాం
- పింఛన్లకు కేంద్రం ఇచ్చేది రూ.206 కోట్లే
- రాష్ట్రమే రూ.600 కోట్లకుపైగా వెచ్చిస్తున్నది
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో ఆసరా పెన్షన్లతో పేదలను ఆదుకుంటున్నామని, లబ్ధిదారులకు రూ.864 కోట్లను ప్రతినెలా అందజేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. ఆసరా పెన్షన్‌దారులకు సంబంధించిన సమస్యలు, సలహాలు, ఫిర్యాదుల కోసం వెబ్‌సైట్, కాల్‌సెంటర్‌ను హైదరాబాద్‌లో సోమవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఆసరా లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తున్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రెట్టింపు చేసి పంపిణీ చేస్తున్నామని, దీంతో లబ్ధిదారులు సీఎం కేసీఆర్‌ను పెద్ద కొడుకుగా భావిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు సరైన సమయంలో పెన్షన్ అందడంలేదనే ఆరోపణలున్నాయని, మారుమూల ప్రాంతాల్లో ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. వీటికి చెక్ పెట్టేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కాల్‌సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. పెన్షన్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులున్నా ఈ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ప్రస్తుతం పది జిల్లాల్లో వీటిని ఏర్పాటుచేసినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో ఏర్పాటుచేస్తామని వెల్లడించారు.

**మూడు రోజుల్లో పరిష్కారం**

పెన్షన్లు అందకపోవడంతోపాటు ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి బదిలీ చేయించుకోవడం వరకు ఈ కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదులను స్వీకరించిన రెండు, మూడు రోజుల్లోనే పరిష్కారం చూపుతారని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. కాల్‌సెంటర్‌కు ఇప్పటివరకు 26 రకాల ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నింటినీ పరిష్కరిస్తున్నామన్నారు. కాల్ సెంటర్‌ను మరింత ఆధునికంగా తయారుచేశామని చెప్పారు. రెండు, మూడ్రోజుల్లో ఈ ఫిర్యాదులు పరిష్కారం కాకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. పింఛన్ల స్కీంపై విపక్ష నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇది కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్కీం కాదని, రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్ల భారాన్ని భరిస్తూ ఇస్తున్న పథకమని స్పష్టంచేశారు. కేంద్రం నుంచి ఆయా రకాల పింఛన్లకు రాష్ట్రానికి కేవలం రూ.206 కోట్లు మాత్రమే వస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లకుపైగా వెచ్చిస్తున్నదని వివరించారు. త్వరలోనే 57 ఏండ్లకే పింఛన్ ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాల్లో జాబితాను సిద్ధంచేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, సెర్ప్ సీఈవో పౌసమీ బసు తదితరులు పాల్గొన్నారు.


ఆసరా పింఛన్లపై సలహాలు, ఫిర్యాదుల కోసం వెబ్‌సైట్, కాల్ సెంటర్లను ప్రారంభిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, అధికారులు ఉన్నారు.

**ఫిర్యాదులు చేయాల్సిన నంబర్లు**

| జిల్లా | ఫోన్ నంబర్ |
|---|---|
| నల్లగొండ | 9542445393 |
| మహబూబ్‌నగర్ | 08542-241165 |
| నిజామాబాద్ | 7032812777 |
| వరంగల్ అర్బన్ | 7901010466 |
| వరంగల్ రూరల్ | 8008202262 |
| ఆదిలాబాద్ | 08732-223522 |
| కరీంనగర్ | 0878-2263099 |
| రంగారెడ్డి | 040-23238822 |
| ఖమ్మం | 08742-255805 |
| మెదక్ | 08452-222858 |

# పర్యాటక ప్రాంతంగా బస్వాపూర్ రిజర్వాయర్

- పర్యాటకశాఖకు 90 ఎకరాలు అప్పగింత
- అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా శామీర్‌పేట చెరువు
- ప్రణాళికలు సిద్ధంచేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆలోచన మేరకు బస్వాపూర్ రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో బస్వాపూర్ రిజర్వాయర్ నిత్యం నీటితో కళకళలాడనున్నదని, ఈ క్రమంలో దేశ, విదేశీ పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం బేగంపేటలోని పర్యాటక భవన్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ కమిషనర్ సునీతా భగవత్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, పర్యాటక సంస్థ ఎండీ మనోహర్, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, టూరిజం ఈడీ శంకర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలో బస్వాపూర్ రిజర్వాయర్ వద్ద గల 90 ఎకరాలను ఆ జిల్లా కలెక్టర్ పర్యాటకశాఖకు అప్పగించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట చెరువు, దాని పరిసరాలను ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు మంత్రి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పర్యాటక శోభను పెంపొందించేందుకు హుస్సేన్‌సాగర్ జలాశయం, గండిపేట జలాశయంతోపాటు నగరానికి ఆనుకొని ఉన్న బద్వేలు వద్ద నూతన ప్రాజెక్టులను చేపట్టాలని అధికారులను కోరారు. ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యంలో నడుపుతున్న పలు పర్యాటక ప్రాజెక్టులపై మంత్రి సమీక్షించారు.


సోమవారం బేగంపేటలోని పర్యాటక భవన్‌లో టూరిజం అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## రవిప్రకాశ్ కస్టడీపై నేడు తీర్పు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిధుల దుర్వినియోగం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ కస్టడీ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. టీవీ9 యాజమాన్యానికి తెలియకుండా రూ.18కోట్లు సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలపై పోలీసులు ఆయనను ఇటీవల అరెస్ట్‌చేశారు. ఈ కేసులో రవిప్రకాశ్‌ను పదిరోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసుల తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. వాదనలు నమోదుచేసుకున్న న్యాయస్థానం.. తీర్పును మంగళవారానికి వాయిదా వేసింది.

## సెలవుల పొడిగింపుతో పరీక్షల తేదీల్లో మార్పు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దసరా సెలవులు ఈ నెల 19 వరకు పొడిగించినందున సంగ్రహణాత్మక మూల్యాంకనం-1 పరీక్షల తేదీలను మారుస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించాల్సిన పరీక్షలను 23 నుంచి ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.

## ఏసీబీ కస్టడీకి మధుసూదన్‌రెడ్డి

- ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించి ఆరాతీస్తున్న ఏసీబీ
- నేడు మరోమారు ప్రశ్నించనున్న అధికారులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై అరెస్టయిన తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడు, సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ పెరికిటి మధుసూదన్‌రెడ్డిని ఏసీబీ అధికారులు సోమవారం కస్టడీకి తీసుకున్నారు. ఈ మేరకు ఆయనను ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్టు అందిన ఫిర్యాదు మేరకు 13 (1), (బీ) రెడ్‌విత్ 13 (2) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. హైదరాబాద్, కొడంగల్, కర్నూలులో ఈ నెల 4న సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. మధుసూదన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యులు, బినామీలుగా అనుమానిస్తున్నవారి ఇండ్లల్లోనూ నిర్వహించిన సోదాల్లో పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని పరిశీలించిన అధికారులు అందులోని అంశాలకు సంబంధించిన విషయాలను మరోమారు నిర్ధారించుకుంటున్నట్టు తెలిసింది. మధుసూదన్‌రెడ్డి ఇచ్చే సమాధానాల ఆధారంగా మరికొన్ని కొత్త అంశాలు తెలిసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. మధుసూదన్‌రెడ్డిని మంగళవారం కూడా ఏసీబీ అధికారులు ప్రశ్నించనున్నారు.

# మూసీ గేటు బిగింపు పూర్తి

- కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- ఒక్క రోజులోనే ఆరు ఫీట్లు పెరిగిన నీటిమట్టం

**సూర్యాపేట రూరల్:** ఇటీవల ఊడిపోయిన మూసీ గేటు స్థానంలో కొత్త గేటు బిగింపు పనులను అధికారులు సోమవారం పూర్తిచేశారు. నీటి ఒత్తిడికి ధ్వంసమైన మూసీ గేటు స్థానంలో కొత్త గేటును యుద్ధప్రాతిపదికన బిగించడంతో ఒక్కరోజులోనే ఆరు అడుగుల నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం కొంతమేర నీరు లీకవుతుండగా, మంగళవారం మధ్యాహ్నం వరకు సరిచేస్తామని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి గేటుకు చెందిన ఐదు స్టాప్ లాగ్ ఎలిమెంట్స్‌ను బిగించగా, సోమవారం మరో మూడింటిని బిగించారు. ఆదివారం వరకు ప్రాజెక్టు నీటిమట్టం 617 అడుగులకు (0.35 టీఎంసీలకు) పడిపోగా, గేటు ఏర్పాటు పనులు పూర్తయిన తర్వాత ఎగువ నుంచి 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 623 అడుగులకు (0.65 టీఎంసీలు) చేరుకున్నది. ఈ సీజన్‌లో ప్రాజెక్టు నిండుకుండను సంతరించుకోగా గేటు ధ్వంసం కావడంతో పది రోజుల్లో దాదాపు డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. ఎగువన కురిసిన వర్షాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మళ్లీ మూసీ ప్రాజెక్టు నిండే అవకాశం ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.


సోమవారం మూసీ గేట్ చివరి ఎలిమెంట్ బిగింపు పనులు చేపడుతున్న సిబ్బంది






## మంచిర్యాల మాజీ టీపీఎస్‌కు జైలుశిక్ష

అవినీతి కేసులో తీర్పు ప్రకటించిన ఏసీబీ కోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన మంచిర్యాల టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) ఎన్ రాజేంద్రప్రసాద్‌కు ఏసీబీ కోర్టు మూడేండ్ల జైలుశిక్ష విధించింది. జైలుశిక్షతోపాటు రూ.10 వేల జరిమానా కూడా విధిస్తూ హైదరాబాద్ ఏసీబీ న్యాయస్థానం ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి సాంబశివరావు నాయుడు సోమవారం తీర్పునిచ్చారు. నిందితుడు జరిమానా చెల్లించనిపక్షంలో మరో ఆరునెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నది. అలాగే ఆదాయానికి మించి రాజేంద్రప్రసాద్ వద్ద గుర్తించిన రూ.38.73 లక్షల విలువైన ఆస్తులను ప్రభుత్వానికి జప్తు చేస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు 2003 డిసెంబర్ 15న ఏసీబీ అధికారులు రాజేంద్రప్రసాద్ నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. విలువైన పత్రాలు స్వాధీనంచేసుకొన్న అధికారులు.. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. 2005 డిసెంబర్ 16వ తేదీన ఏసీబీ అధికారులు ఛార్జిషీట్ దాఖలుచేశారు. వాదోపవాదనల అనంతరం నేరం నిరూపణ కావడంతో రాజేంద్రప్రసాద్‌కు మూడేండ్ల జైలుశిక్ష విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. ఇదిలా ఉండగా, నిందితుడిగా కోర్టు తేల్చిన రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం పదవీవిరమణ చేసి ఇంటి వద్ద ఉంటున్నట్టు సమాచారం.

## ఫార్మాసిస్ట్ ఆరాధనాదేవికి చుక్కెదురు

ఐఎంఎస్ మందుల స్కాంలో క్రమశిక్షణ చర్యలను సమర్థించిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఎంఎస్ మందుల స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డైరెక్టరేట్ ఆఫ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ ఫార్మాసిస్ట్ హెచ్‌ఆర్ ఆరాధనాదేవికి హైకోర్టులో చుక్కెదురైంది. ఇటీవల వెలుగు చూసిన ఈ స్కాంలో విజిలెన్స్ అధికారాలు ఆమెకు వ్యతిరేకంగా క్రమశిక్షణ చర్యలు చేపట్టగా.. దాన్ని వ్యతిరేకిస్తూ ఆరాధనాదేవి హైకోర్టును ఆశ్రయించారు. విచారించిన ఏకసభ్య ధర్మాసనం పిటిషన్‌ను తోసిపుచ్చుతూ.. క్రమశిక్షణ చర్యల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. దీంతో ఆమె అప్పీల్ పిటిషన్ దాఖలు చేయగా.. దానిపై విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం సింగిల్ జడ్జి తీర్పునే సమర్థించింది. క్రమశిక్షణ చర్యల విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఏ ఉద్యోగిపైనైనా చర్యలు చేపట్టడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుందని సర్కారు తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఇప్పటికే విజిలెన్స్ నివేదిక ఆధారంగా పలువురు అధికారులపై చర్యలు చేపట్టినట్టు గుర్తుచేశారు. ఈ వాదనను సమర్థించిన ధర్మాసనం ఆమె అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేసింది.




MOTORLINE AUTO PVT. LTD.: KARIMNAGAR, JAGITYAL, PEDDAPALLY, SRICILLA. PH: 77997 39121.



నేను ప్రతిసారి ఓ కొత్త మెడల్‌తో గ్రామంలో అడుగుపెట్టేదాన్ని. ఇప్పుడు నేను రాజకీయ యుద్ధంలోకి అడుగుపెట్టాను. నాకు మీ ప్రేమ మద్దతు కావాలి. రాజకీయాలు ప్రజలకు సేవ చేయటానికి ఓ మార్గం. నేను ప్రజల మద్దతుతో ఆశించినస్థాయిలో సేవలందిస్తాను.

**బబితా ఫోగట్, హర్యానా, దాద్రి-బీజేపీ అభ్యర్థి**

మహారాష్ట్ర కాంగ్రెస్‌లో కుమ్ములాటలేమీ లేవు. నేను ముఖ్యమైన సొంతపనుల కారణంగా రాహుల్‌గాంధీ ప్రచారంలో భాగస్వామ్యం కాలేకపోయాను. ఆ విషయం రాహుల్‌గాంధీకి ముందే తెలిపాను. నేను గైర్హాజరు కావటం వెనుక రాజకీయ కారణమేమీ లేదు. నేనెప్పుడూ కాంగ్రెస్ వెంటే ఉంటా.

**సంజయ్ నిరుపమ్, కాంగ్రెస్ సీనియర్ నేత, మహారాష్ట్ర**



**చరిత్రలో నేడు**



**1932**

భారతదేశంలో మొదటిసారి విమాన సర్వీసులు ప్రారంభించిన టాటా ఏర్‌లైన్స్ సంస్థ. ఇదే తర్వాత కాలంలో ఎయిర్ ఇండియాగా మారింది.

**1937**

ఎర్నెస్ట్ హెమింగ్వే ప్రసిద్ధ నవల 'టు హ్యావ్ అండ్ హ్యావ్ నాట్' ప్రచురణ.





**1940**

చార్లీచాప్లిన్ నటించిన 'ది గ్రేట్ డిక్టేటర్' సినిమా విడుదల.

బెంగాల్‌లో హింస వికృతరూపం దాల్చుతున్నది. ముర్షిదాబాద్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడిని, అతని భార్య, కుమారుని దారుణంగా హత్యచేసిన ఘటన తీవ్రమైనది. దానికి కొందరు రాజకీయరంగు పులుమటానికి ప్రయత్నిస్తున్నా, అలాంటి ఎవరూ సమర్థించలేరు. అతను ఆరెస్సెస్ కార్యకర్త అయినందునే హత్యచేశారన్న ఆరోపణలకు ఆధారాలు లేవు. ప్రధాని మోదీకి నిరసన లేఖ రాసి దేశద్రోహ కేసు ఎదుర్కొంటున్న అపర్ణసేన్ కూడా బెంగాల్ హింసను తీవ్రంగా ఖండించారు. శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన బాధ్య రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని అపర్ణసేన్ అనటం గమనార్హం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

ఇథియోపియా ప్రధాని అబి అహ్మద్‌కు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించిన నోబెల్ న్యాయనిర్ణేతలు, ఆ ప్రాంతంలో శాంతి, సుస్థిరతల ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. ఇథియోపియాలో తీవ్ర హింస, అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లో అబిఅహ్మద్ పాలనాపగ్గాలు చేపట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో సాగుతున్న అంతర్యుద్ధం, సరిహద్దుల వెంట సాగుతున్న యుద్ధాన్ని నివారించటం కోసం తీవ్రంగా కృషి చేశారు. ఇథియోపియా, దాని పొరుగు దేశాల్లో శాంతి సుస్థిరతల స్థాపనకు అబి అహ్మద్ కృషికి గుర్తింపు దక్కటం ముదావహం.

**ది హిందూ**



# చైనా- ఇండియా ప్లస్

ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ వూహాన్ శిఖరాగ్ర సదస్సుకు కొనసాగింపుగా తమిళనాడు తీరంలో జరిపిన సమావేశం ద్వైపాక్షిక సంబంధాలను మలుపు తిప్పడమే కాదు, అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితంచేసే కీలకఘట్టంగా నిలిచిపోతుంది. విభేదాలు వివాదాలుగా మారకుండా, సహకారాన్ని నీరు గార్చకుండా జాగ్రత్తపడాలనే పరిణతిని రెండుదేశాలు ప్రదర్శించడం అభినందనీయం. తమిళనాడు తీరం మీదుగా చైనాతో సాగిన వాణిజ్య సంబంధాలను ప్రధాని మోదీ గుర్తు చేశారు. రెండు వేల ఏండ్లుగా భారత చైనా దేశాలు ఆర్థిక శక్తులని ఆయన వివరించారు. తాము స్నేహితులుగా హృదయపూర్వకంగా చర్చించుకున్నామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ భేటీ పర్యవసానంగా ఇరుదేశాల ఆర్థికమంత్రుల సారథ్యంలో ఉన్నతస్థాయి ఆర్థిక వాణిజ్య చర్చా వ్యవస్థ ఏర్పాటు కావడం స్నేహ సహకారాల పట్ల రెండు దేశాల దృఢ నిశ్చయాన్ని వెల్లడిస్తున్నది. రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని విస్తృత పరచడానికి అంగీకారం కుదిరింది. ఇందుకు భిన్నరంగాలను ఎంపిక చేస్తున్నారు. 53 బిలియన్ డాలర్ల మేర వాణిజ్య లోటు పట్ల భారత్ ఆందోళన చెందుతున్నది. ఈ అసమతౌల్యాన్ని సరి చేయాలనే భారత్ వాదనను చైనా గుర్తించినట్టు తెలుస్తున్నది. జిన్‌పింగ్ పర్యటనకు ముందు పరిణామాల మూలంగా ఈ భేటీ సత్ఫలితాలను ఇస్తుందా అనే ఆందోళన వ్యక్తమైంది. కానీ ఆశించినదాని కన్నా ఈ భేటీ ఫలప్రదం కావడం విశేషం.

21వ శతాబ్దంలో ప్రముఖ ఆర్థికశక్తులుగా ఆవిర్భవించాలనుకున్నప్పుడు ఈ రెండు దేశాలు పరస్పరం సహకరించుకోవడం తప్పనిసరి. కలహించుకోవడం కన్నా కలిసిసాగడమే ఉత్తమమైన మార్గమని రెండుదేశాలు గ్రహించాయి. 'చైనా–ఇండియా ప్లస్' అనే ఈ ప్రతిపాదన భారత్‌కు కూడా అంగీకారయోగ్యంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. చైనా ఇప్పటికే నేపాల్, మయాన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక మొదలైన దేశాలతో సంబంధాలను పటిష్టం చేసుకున్నది. ఆఫ్రికాలో చైనా వాణిజ్యం భారీగా పెరిగింది. ఆర్థికంగా, సైనికంగా చైనా భారత్‌ను మించిపోయింది. సాంకేతిక రంగంలో అమెరికాను అందుకుంటున్నది. అమెరికా తరువాత అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగింది. దాదాపు మూడు ట్రిలియన్ డాలర్ల విదేశీ మారక నిలువలున్నాయి. ఆసియా, ఆఫ్రికా దేశాలలో చైనాతో పోటీ పడటం కన్నా ఉమ్మడిగా వ్యవహరించడం శ్రేయస్కరమా అనేది ఒక వాదన. పొరుగునే ఉన్న బలమైన దేశంతో కయ్యం కన్నా నెయ్యమే మంచిదనే అభిప్రాయం విదేశాంగ నిపుణుల్లో కూడా వ్యక్తమవుతున్నది. అమెరికాతో కన్నా చైనాతోనే భారత్‌కు ఉమ్మడి ప్రయోజనాలున్నాయి. రెండుదేశాలు బహుళపక్ష వాణిజ్యాన్ని కోరుకుంటున్నాయి. ప్రపంచవాణిజ్య సంస్థ వంటి వేదికల పైన, పర్యావరణ పరిరక్షణ విషయంలో రెండు దేశాలు పాశ్చాత్యదేశాల ఎత్తుగడలను తిప్పికొట్టడానికి ఉమ్మడిగా వ్యవహరిస్తున్నాయి. జి20, బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ, రష్యా– ఇండియా– చైనా (రిక్) కూటమి మొదలైన బహుళపక్ష వేదికలపై సమన్వయంతో పోవాలని జిన్‌పింగ్ సూచిస్తున్నారు. ఆఫ్ఘనిస్థాన్ వంటి పలు అంశాలపైనా ఉమ్మడి వైఖరిని ప్రదర్శించాలనే ప్రతిపాదన ఉన్నది. మౌలికవసతుల రంగాల్లో కూడా చైనా కొన్ని ఆకర్షణీయమైన ప్రతిపాదనలను ముందుకు తెస్తున్నది. వాణిజ్య, దౌత్య సంబంధాలు పటిష్టమైతే ఇరుదేశాలకు ప్రయోజనకరం. అందుకే జిన్‌పింగ్ రెండుదేశాల మధ్య వంద ఏండ్ల భవిష్యత్ ప్రణాళిక రచించుకోవాలని అంటున్నారు.

**చైనాతో సంబంధాలను పటిష్ట పరుచుకోవడంలో కొన్ని అవరోధాలు ఉన్నాయి. సరిహద్దు సమ స్య ఇందులో ప్రధానమైనది. మోదీ- జిన్‌పింగ్ భేటీ నేపథ్యంలో ఇరు పక్షాలకు ఆమోదయోగ్యంగా సరిహద్దు సమస్య పరిష్కారానికి కృషి సాగుతున్నది. ఇందుకు 2005లో ఏర్పాటు చేసుకున్న ప్రాతిపదికలపై చర్చ సాగిస్తున్నారు. రెండు దేశాల అంతర్జాతీయ వ్యూహంలో పాకిస్థాన్ చిన్న అంశంగా మారిపోతుంది. భారత్‌ను పణంగా పెట్టి పాకిస్థాన్ పక్షం వహించడం అమెరికాకే కాదు, చైనాకూ సాధ్యం కాదు.**

చైనాతో సంబంధాలను పటిష్ట పరుచుకోవడంలో కొన్ని అవరోధాలు ఉన్నాయి. సరిహద్దు సమస్య ఇందులో ప్రధానమైనది. మోదీ– జిన్‌పింగ్ భేటీ నేపథ్యంలో ఇరు పక్షాలకు ఆమోదయోగ్యంగా సరిహద్దు సమస్య పరిష్కారానికి కృషి సాగుతున్నది. ఇందుకు 2005లో ఏర్పాటు చేసుకున్న ప్రాతిపదికలపై చర్చ సాగిస్తున్నారు. రెండు దేశాల అంతర్జాతీయ వ్యూహంలో పాకిస్థాన్ చిన్న అంశంగా మారిపోతుంది. భారత్‌ను పణంగా పెట్టి పాకిస్థాన్ పక్షం వహించడం అమెరికాకే కాదు, చైనాకూ సాధ్యం కాదు. చైనాతో సత్సంబంధాలను నెలకొల్పుకోకుండా, ఇండో పసిఫిక్ ప్రాంతంలో తమ అజెండాను భారత్ అమలు పరచాలనేది అమెరికా వ్యూహం. భారత్ అమెరికా ఉపగ్రహంగా మారకూడదు. అలాగని అమెరికాతో గొడవ పడే పరిస్థితి రానీయకూడదు. ఒక దేశాలతో ప్రయోజనకర సంబంధాలను మరో దేశం కోసం పణంగా పెట్టబోమని రెండు దేశాలకు స్పష్టం చేయాలె. సోవియెట్ యూనియన్‌తో విభేదాలు తలెత్తిన తరువాత చైనా అమెరికాతో సంబంధాలను మెరుగుపరుచుకున్నది. కానీ అమెరికా ఉపగ్రహంగా మారకుండా సోవియెట్ యూనియన్ ప్రాబల్యాన్ని సమతౌల్యం చేయడానికి వాడుకున్నది. ఈ క్రమంలో అన్నిరంగాలలో కృషి సాగించి తానే అమెరికాతో పోటీ పడే బలమైన రాజ్యంగా ఎదుగగలిగింది. భారత్ కూడా ఇదే రీతిలో వివిధ ప్రాబల్య శక్తుల మధ్య సమతుల్యం సాధిస్తూ, తానే ఒక ప్రబల శక్తిగా ఎదుగాలె.

**సందర్భం**

## కలాం జీవితం ఆదర్శం

'కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి' అంటూ భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విద్యార్థులకు ఎప్పుడూ చెపుతూ ఉండేవారు. 'శాస్త్రవేత్తగా విద్యావేత్తగా, అధ్యాపకునిగా, రాష్ట్రపతిగాఆయన దేశానికి చేసిన సేవలు అమూల్యమైనవి. కలాం 1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. కలాం చదువులో సాధారణ విద్యార్థిగా ఉన్నా కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఆసక్తి కనబర్చేవారు. రామనాథపురంలో సెకండరీ విద్యను పూర్తిచేసుకొన్న ఆయన భౌతిక శాస్త్రంలో 1954లో డిగ్రీ పట్టా పొందారు. ఇంజినీరింగ్‌ను చదువాలనే తాపత్రయంతో 1955లో ఆయన మద్రాసు వెళ్ళారు. 1960లో 'ది మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' నుంచి ఇంజినీరింగ్ పట్టా పొంది డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా చేరారు. ఆ తర్వాత ఇస్రోలో సేవలందించారు. 60వ దశకంలో భారత్ పాకిస్థాన్, చైనా వంటి దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చింది. అప్పుడే భారత రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం వున్నదని కలాం గుర్తించారు. ఆయన ఇస్రోలో పనిచేసినప్పు డు పీఎస్‌ఎల్‌వీ, ఎస్‌ఎల్‌వీ–3 వంటి ప్రాజెక్టుల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. 1970వ దశకంలో బాలిస్టిక్ క్షిపణులు తయారీలలలో ప్రముఖపాత్ర పోషించారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అగ్ని, పృథ్వీ వంటి క్షిపణుల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. 1998లో భారత్ రెండవ దఫా నిర్వహించిన అణు పరీక్షల్లో చురుకైన పాత్ర పోషించారు. రాష్ట్రపతిగా దేశానికి సేవలందించారు. బ్రహ్మోస్ వంటి సూపర్‌సోనిక్ మిసైల్‌ను భారత్ తయారు చేయగలిగిందంటే క్షిపణి రంగంలో కలాం వేసిన గట్టి పునాదులే కారణం. అందుకే ఆయనను 'భారత క్షిపణి పితామహుడి'గా పిలుస్తారు.



**–యం. రాంప్రదీప్**

**(నేడు అబ్దుల్ కలాం జయంతి)**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ఆర్టీసీ**

**గోపాల బాలరాజు**

# సమ్మెపై వాస్తవాలు, వక్రీకరణలు

ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెను రాజకీయంగా వాడుకోవాలని కొన్ని రాజకీయపార్టీలు కుయుక్తులు పన్నుతున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కాంగ్రెస్, బీజేపీ డిమాండ్ చేస్తున్నాయి. తెలంగాణలో ఆర్టీసీ విషయంలో ఇలా డిమాండ్ చేస్తున్న రాజకీయపక్షాలవారు, వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విలీనం చేశారా? అనే విషయం ప్రజలు ఆలోచించాలి.

ఏదైనా ఒక సమస్య లేదా సంక్షోభం తలెత్తినప్పుడు ఆయా రాజకీయపార్టీలు, వ్యక్తులు, సంస్థలు రాగద్వేషాలకు అతీతంగా, వాస్తవాల ఆధారంగా ఆలోచించి ప్రతిస్పందించాలి. దాని ఆధారంగానే సమస్యకు చక్కని, శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ, దేశంలో మరీ ముఖ్యంగా మన రాష్ట్రంలో అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొన్నది. ప్రతిపక్షంలో ఉన్న వారు ప్రతీ విషయంలో ప్రభుత్వానిదే తప్పు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వాన్ని సమర్థించే వారు సైతం వాస్తవాలను బేరీజు వేసుకోకుండా మాట్లాడుతున్నారు. అసలు ప్రభుత్వం విధానమేమిటో కూడా తెలుసుకోకుండానే, సమస్యకు అసలు మూలమెక్కడో, దానికి అంతం ఎక్కడో తెలియకుండానే తీర్పులు ఇచ్చేస్తున్నారు. దీనివల్లనే సమస్య తీవ్రతపెరిగి, భావోద్వేగాలు కూడాఎక్కువవుతున్నాయి. విపరీత పరిణామాలకు ఈ అసంబద్ధ వైఖరే కారణమవుతున్నది.

రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులు కొన్ని డిమాండ్లతో సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మె నేపథ్యంలో ప్రభుత్వానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. కొందరు ఆర్టీసీని ప్రభుత్వం పట్టించుకోవట్లేదు అనే విధంగా మాట్లాడుతున్నారు.

పేద ప్రజలకు తక్కువ చార్జీలతో, సురక్షితమైన ప్రయాణ సౌకర్యం అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించిన విషయం ఎవరూ కాదనలేని వాస్తవం. నష్టాల ఊబిలో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించడానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది. మూడేండ్ల కిందటే (2016 జూన్ 17న) ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఎన్నడూలేని విధంగా ఎం.డి. నుంచి డిపో మేనేజర్ల వరకు అందరు ఉద్యోగులను, అన్ని యూనియన్ల నాయకులను పిలిచి, హైదరాబాద్ మారియట్ హోటల్లో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకున్నది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 3,303.35 కోట్ల రూపాయల ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి అందించింది. 850 కోట్ల రూపాయల మేర ఆర్టీసీ రుణాలు సేకరించుకోవడానికి ప్రభుత్వం పూచీకత్తు ఇచ్చింది. గడిచిన ఐదేండ్లలో రికార్డుస్థాయిలో ఆర్టీసీలో కొత్తగా 2,101 బస్సులను కొనుగోలు చేసింది. 4,760 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించింది. రాష్ట్రం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఒక శాతం ఎక్కువగా 44శాతం ఫిట్‌మెంట్‌తో ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల జీతాలు పెంచింది. గత ఏడాది ఆర్టీసీ కార్మికులకు మరో 16 శాతం ఫిట్‌మెంట్‌తో మధ్యంతర భృతి(ఐఆర్) కూడా ఇచ్చింది. ఆర్టీసీని కాపాడుకోవడానికి ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ, సరికొత్త వ్యూహాలను అమలుచేస్తున్నది.

అయినప్పటికీ కొన్ని డిమాండ్లను ప్రభుత్వం ముందుంచుతూ ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. దీనిపై రాష్ట్ర మంత్రివర్గం నాలుగు గంటల పాటు విస్తృతంగా చర్చించింది. కార్మికుల డిమాండ్లను సానుభూతితో పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ముగ్గురు సీనియర్ ఐఎఎస్ అధికారులతో ప్రభుత్వం కమిటీని నియమించి, చర్చల ప్రక్రియ ప్రారంభించింది. అటు కార్మికశాఖ కూడా కార్మికులతో చర్చలకు రంగం సిద్ధం చేసింది. కార్మికుల డిమాండ్లన్నింటినీ పరిశీలించిన తర్వాత కమిటీ ఇచ్చిన నివేదికను అనుసరించి, తగు చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. ఈ ప్రక్రియ అంతా జరుగడానికి కొద్దిరోజుల సమయం పడుతుంది. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను సానుభూతితో పరిశీలించి, పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే కార్మిక సంఘాలు సమ్మెకు దిగుతామని ప్రకటించటం దురదృష్టకరం.

ఇప్పటికే ఆర్టీసీ నష్టాల్లో ఉన్నది. బతుకమ్మ, దసరా పండుగ సీజన్లో సమ్మె వల్ల ఆర్టీసీ తన బాధ్యతను పూర్తిగా నెరవేర్చలేకపోయింది. దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగాయి. సంస్థకు కూడా నష్టం వాటిల్లింది. సమ్మెకు దిగి, ఆర్టీసీని మరింత నష్టపరుచడం, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కల్పించడం ఏ మాత్రం భావ్యం కాదని ప్రభుత్వం అనేకసార్లు విజ్ఞప్తి చేసింది. ప్రజల అవసరాలను అర్థం చేసుకోకుండా, ప్రభుత్వ చిత్తశుద్ధిని గుర్తించకుండా, ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా పండుగ సమయంలో సమ్మెకు దిగడం అనైతికం. డిమాండ్లను పరిశీలించి, పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకొచ్చినా సమ్మెకు దిగడం సమంజసం కాదు.

సంస్థలను ప్రభుత్వంలో విలీనం చేసుకోవడం అంత తేలిక కాదు. సాధ్యమయ్యే పనికాదు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం విలీనం చేసింది కదా? అనే ప్రశ్న వస్తున్నది. అక్కడ విలీన ప్రకటన చేశారే తప్ప.. దాని పర్యవసానాలు ఇంకా పూర్తిగా అనుభవంలోకి రాలేదు. కొంతకాలం గడిస్తే తప్ప అక్కడ విలీనం ఎలా జరిగింది? మంచి జరిగిందా.. చెడు జరిగిందా? అనేది తెలుస్తుంది. విలీనం అంత తేలికే అయితే, అంత మంచిదే అయితే కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టులు పాలిస్తున్న ఏ రాష్ట్రంలో కూడా ఇప్పటివరకు ఎందుకు విలీనం చేయలేదో ఆలోచించుకోవాలి.

**ఆర్టీసీ విలీనం టీఆర్‌ఎస్ పార్టీ విధానం కాదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తప్ప, మిగతా డిమాండ్లు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. విలీనం ప్రభుత్వ విధానం కాదు. టీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో కాని, ఎన్నికల ప్రచారంలో గానీ ఈ విషయం చెప్పలేదు. ఎన్నికల్లో ఇవ్వని హామీని అమలుచేయమని కోరడం, దానికోసం సమ్మె చేయడం న్యాయం కాదు. ఎన్నటికీ పరిష్కారం కాని ఒక సమస్యను ముందేసుకుని ఆందోళనలు చేయడం, అశాంతికి, అలజడికి ఉపయోపడుతుందే కానీ, ఆర్టీసీ సంస్థ మంచికి ఏ మాత్రం ఉపయోగపడదు.**

ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెను రాజకీయంగా వాడుకోవాలని కొన్ని రాజకీయ పార్టీలు కుయుక్తులు పన్నుతున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కాంగ్రెస్, బీజేపీ డిమాండ్ చేస్తున్నాయి. తెలంగాణలో ఆర్టీసీ విషయంలో ఇలా డిమాండ్ చేస్తున్న రాజకీయపక్షాల వారు, వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విలీనం చేశారా? అనే విషయం ప్రజలు ఆలోచించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీజేపీ అధికారంలో ఉన్న జార్ఖండ్, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో అస్సలు ఆర్టీసీ లేనే లేదు. బీజేపీ, కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయలేదు. దేశాన్ని ఏండ్లకు ఏండ్లు పాలించిన ఈ రెండుపార్టీలు ఒక్క రాష్ట్రంలో కూడా నెరవేర్చని డిమాండ్లను తెలంగాణలో అమలుచేయాలని కోరడం వెనుక రాజకీయ దురుద్దేశమే తప్ప మరొకటి లేదు.

కార్మికులు కూడా ఈ సమయంలో సంయమనంతో ఆలోచించాలి. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ శకం నడుస్తున్నది. కేంద్ర ప్రభుత్వంలో ఏకంగా పెట్టుబడుల ఉపసంహరణ శాఖనే ఏర్పాటు చేశారు. 2019–20 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించుకోవడం వల్ల రూ.1.05 లక్షల కోట్లు సమకూర్చుకుంటామని ప్రకటించింది. రైల్వేలలో ప్రైవేటీకరణను అమలు చేస్తున్నది. ఎయిర్‌లైన్స్‌ను ప్రైవేటీకరించింది. అనేక సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నది.

ప్రభుత్వాల ధోరణి ప్రైవేటీకరణకే మొగ్గు చూపుతున్న తరుణంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ మనుగడ కాపాడటానికే త్రికరణశుద్ధితో ప్రయత్నాలు చేస్తున్నది. ఆర్టీసీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించేది లేదని ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టం చేశారు. పూర్తి క్రమశిక్షణతో, మరింత సమర్థవంతంగా ప్రజలకు రవాణా సౌకర్యం అందించే అత్యుత్తమ సంస్థగా ఆర్టీసీని మరింత బలపడేలా చేస్తామనే ముఖ్యమంత్రి ప్రకటనలో ప్రభుత్వ దృఢ సంకల్పం ప్రస్ఫుటమవుతున్నది.

ఆర్టీసీ ఆస్తుల విలువ 50వేల కోట్ల రూపాయలని మరో అబద్ధాన్ని కొందరు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయానికి ఆర్టీసీ ఆస్తుల విలువ రూ.4416 కోట్లు మాత్రమే. ఈ ఐదేండ్లల్లో వాటి విలువ కొంత పెరిగివుండవచ్చు. కానీ ప్రతిపక్షాలు తమ నోటికి వచ్చినట్టు అంకెలు చెప్తూ 50 వేల కోట్లని, లక్ష కోట్లని అసంబద్ధ ప్రకటనలు చేయడం పూర్తిగా బాధ్యతా రాహిత్యం. ఆర్టీసీ ఆస్తులు అమ్మడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే ప్రచారం కూడా పూర్తిగా అబద్ధం.

లక్షలాదిమంది విద్యార్థులు ఆర్టీసీ బస్సులపై ఆధారపడి తమ చదువులు కొనసాగిస్తున్నారు. వికలాంగులు, వృద్ధులు, వివిధవర్గాలవారు తక్కువ రేట్లతో ప్రయాణం సాగిస్తున్నారు. నేటికీ మారుమూల ప్రాంతాలకు పోవడానికి ఆర్టీసీ బస్సులే దిక్కు. తక్కువ ధరలతో, ఎలాంటి ప్రమాదాలు లేకుండా ప్రయాణించడం ఆర్టీసీ బస్సులతోనే సాధ్యం. రోజుకు కోటి మంది ప్రజలు ప్రయాణించే ఆర్టీసీ బస్సు ఆగిపోవద్దు. అందుకే.. కార్మికులు సమ్మె చేస్తున్నందున, ప్రజల కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నది.

సకల జనుల సమ్మె సందర్భంగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడానికి, నేటి సమ్మెకు తేడా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రజా డిమాండు. ప్రజాస్వామ్య డిమాండు. అన్ని రాజకీయపార్టీలు అంగీకరించిన విషయం. అన్నిపార్టీలు తమ మ్యానిఫెస్టోలో చెప్పిన విషయం. చెప్పిన విషయం అమలుచేయండని అడుగడానికి ఆనాడు సమ్మె జరిగింది. కానీ ఆర్టీసీ విలీనం టీఆర్‌ఎస్ పార్టీ విధానం కాదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం తప్ప, మిగతా డిమాండ్లు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. టీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో కాని, ఎన్నికల ప్రచారంలో గానీ ఈ విషయం చెప్పలేదు. ఎన్నికల్లో ఇవ్వని హామీని అమలుచేయమని కోరడం, దానికోసం సమ్మె చేయడం న్యాయం కాదు. ఎన్నటికీ పరిష్కారం కాని ఒక సమస్యను ముందేసుకుని ఆందోళనలు చేయడం, అశాంతికి, అలజడికి ఉపయోపడుతుందే కానీ, ఆర్టీసీ సంస్థ మంచికి ఏ మాత్రం ఉపయోగపడదు.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

**విశ్లేషణ**



**సీహెచ్‌వీ ప్రభాకర్ రావు**

# ప్రతిపక్షాల ద్వంద్వ విధానాలు

దేశంలో జరిగే ప్రతి పనిని తమ ప్రమేయంతోనే జరుగాలని కేంద్రం భావిస్తున్నది. రాష్ట్రాలు చేస్తున్న అభివృద్ధి పనులను, ఇతర మార్పులను అడ్డుకొని తమపార్టీ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా విమర్శలు చేయడం నేటి దేశ రాజకీయ చిత్రపటంలో కనిపించే విచిత్రమైన పరిస్థితి. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య స్పష్టమైన పని విభజనను రాజ్యాంగంలో పొందుపరిచారు. గత మూడు దశాబ్దాలలో రాష్ట్రాలపై ఆధిపత్యం చలాయించాలనే ఆలోచనలతో కేంద్రం రాష్ట్రాల అధికారాలను కైవసం చేసుకోవడానికి అనేకసార్లు రాజ్యాంగ సవరణలు చేసింది.

విద్య, స్థానిక పరిపాలనలను కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలోనే కేంద్రం చేతిల్లోకి తీసుకున్నది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం మోటారు వాహనాల చట్టాలను, జీఎస్టీ పేర వివిధ రకాల పన్నులను రాష్ట్రాల చేతిలోనుంచి తీసుకొని ఏకీకృత పన్నుల విధానం పేర రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను నిర్ణయించే స్థితికి చేరింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తాను దేశస్థాయిలో అవలంబిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక, సామాజిక విధివిధానాలను తాము పాలిస్తున్న రాష్ట్రాలలో కూడా పాటించడం లేదు.

అలాగే ఇతరపార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో, అవే కేంద్ర విధానాలను అధికారంలో ఉన్న పార్టీలు అవలంబిస్తున్నాయి. కానీ బీజేపీ స్థానిక నాయకులు వ్యతిరేకించడం ఆ పార్టీ విధాన లోపాన్ని, పార్టీ నాయకుల సమన్వయ లోపాన్ని, రాజకీయ సిద్ధాంత లొసుగులను బయటపెడుతున్నది. ప్రపంచమంతా ఆర్థిక సరళీకరణ జరిగి, మార్కెట్ ప్రభుత్వం చేతిలో కాకుండా ప్రైవేట్ వ్యాపారవర్గాల చేతిలో ఉన్నది.

అవినీతి మయమైన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దెదించిన బీజేపీ ఆర్థిక విధానాలూ స్వేచ్ఛా విపణి, పెట్టుబడి ఆర్థిక విధానాలే అవలంబిస్తున్నది. అందుకు అనుగుణంగా దేశంలోని అనేక ప్రభుత్వాధీన సంస్థలను, వ్యాపార సంస్థలను కేంద్రం ప్రైవేట్ పరం చేయడానికి, సంక్షేమ పథకాలకు కావల్సిన నిధులను రాబట్టుకోవడానికి యత్నిస్తున్నది.

బీజేపీ అధికారంలో ఉన్న ఎన్నో రాష్ట్రాలలో ప్రజారవాణా వ్యవస్థ, విద్యా, వైద్యరంగాల్లో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నది. ప్రజారవాణా వ్యవస్థలో ప్రపంచంలో అతి పెద్ద వ్యవస్థ అయిన రైల్వేలను పూర్తిగా ప్రైవేట్ రంగానికి అప్పగించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2012లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వేలో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ చట్టాలలో మార్పులు తెచ్చింది. దానికి అనుగుణంగానే లోకోమోటివ్ రంగంలో జపాన్ పెట్టుబడులు పెట్టింది. అలాగే మొన్ననే పూర్తిస్థాయి ప్రైవేట్ రైలు లక్నో నుంచి కొత్త ఢిల్లీకి ప్రారంభమైంది. నమూనాగా ప్రారంభించిన 53 రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణలో భాగంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పనులన్నీ ప్రైవేట్ రంగానికి అప్పజెప్పటం గమనార్హం. అందులో భాగంగానే మొన్నటి పండగ సీజన్లో ప్లాట్‌ఫాం టికెట్‌ను 10 నుంచి 30 రూపాయలకు పెంచిన సంగతి విదితమే.

విద్యా, ఆరోగ్యంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థ ప్రభుత్వ అధీనంలో ఉండాలని కోరుకోవడంలో తప్పులేదు. కానీ మారుతున్న ఆర్థిక సామాజిక పరిస్థితులలో ఈ మూడురంగాలు పూర్తి స్థాయిలో ప్రభుత్వాధీనంలో నిర్వహించడం సాధ్యం కాదనే విషయం అనేక కమిటీల నివేదికల్లో తేలింది. అంతెందుకు కేంద్రంలో 'మహా రత్న' అవార్డు పొందిన ఎన్నో ప్రభుత్వ సంస్థలలో అధిక మొత్తం వాటాలను ప్రైవేట్ రంగానికి అమ్మివేయటానికి గత 20 ఏండ్లలో జరిగిన ప్రయత్నాలను ఎవరైనా అడ్డుకొన్నారా అని ప్రశ్నించుకోవాలి. అందుకే వేల కోట్ల లాభాలను ఆర్జిస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్లో 53 శాతం వాటాను ప్రభుత్వం ప్రైవేట్ రంగానికి అమ్మి ఈ ఏడాది ఏర్పడే ద్రవ్యలోటులో దాదాపు 63 శాతం పైగా పూడ్చుకోవాలని చూస్తున్నది. ఒక్క భారత పెట్రోలియం కార్పొరేషన్‌నే కాదు, అలాంటి మరెన్నో సంస్థలను ప్రైవేట్‌రంగానికి అప్పజెప్పడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నది. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపుతున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించడం, తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడం జరిగిపోయాయి.

**ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వాన్ని నిందించడం సరి కాదు. దానికి ముందు ఆ సమస్య పుట్టుపూర్వోత్తరాలే కాకుండా, దేశంలో మిగతా రాష్ట్రాలలో ఉన్న పరిస్థితులను, అక్కడి ప్రభుత్వ విధానాలను పరిశీలిం చాలి. ఇలా పరిపూర్ణ అవగాహనతో విమర్శిస్తే హుందాగా ఉంటుంది. సమస్యను పరిష్కరించే దిశలో నడిపించడానికి బదులు ఆవేశాలను రెచ్చగొడుతూ, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాజకీయ నాయకుల స్వప్రయోజనాలను గుర్తించలేనంత అమాయకులేమీ ఆర్టీసీ కార్మికులు కాదు.**

కానీ అలా ప్రభుత్వంలో కలుపడంలో ఉన్న సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకోని ప్రతిపక్షాలు సమ్మెకు మద్దతు ప్రకటించడం వింతగా ఉన్నది. గురివింద తన కింద ఉండే నలుపును గుర్తించదన్నట్టు కాంగ్రెస్, బీజేపీలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గత మూడు దశాబ్దాలుగా అమలుచేసిన విధానాలకు వ్యతిరేకంగా ఇక్కడ ప్రజలను, కార్మికులను రెచ్చగొట్టడం విచిత్రంగా ఉన్నది. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం విద్యను పూర్తిస్థాయిలో ప్రభుత్వమే నిర్వహించాలని చూస్తున్నా అది సాధ్యం కావడం లేదనే విషయం అర్థం అవుతున్నది. అలాగే బీహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, అస్సాం లాంటి రాష్ట్రాలలో విద్యా, వైద్య, ప్రజారవాణా వ్యవస్థల తీరు చూస్తే దేశం ఇంకా క్రీస్తు పూర్వ కాలంలో ఉన్నట్లు అర్థం అవుతుంది. ఈ రాష్ట్రాలను పాలిస్తున్నది, ఎక్కువ కాలం పాలించింది కాంగ్రెస్, బీజేపీ పార్టీలు. లేదా వాటి సహాయంతో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలే.

రాజకీయాలకు అతీతంగా ఆలోచిస్తే.. విద్యా, వైద్యం, ప్రజా రవాణా వ్యవస్థలు ప్రభుత్వ అధీనంలో పూర్తిగా ఉండాలని అందరూ ఆశిస్తారు. కానీ మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులలో దేశ సంపదలో సగానికిపైగా ప్రజల సంక్షేమ పథకాలకే సరిపోగా మిగిలిన సగంలో కనీస మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలదే అని గ్రహించాలి. ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వాన్ని నిందించడం సరి కాదు. దానికి ముందు ఆ సమస్య పుట్టుపూర్వోత్తరాలే కాకుండా, దేశంలో మిగతా రాష్ట్రాలలో ఉన్న పరిస్థితులను, అక్కడి ప్రభుత్వ విధానాలను పరిశీలించాలి. ఇలా పరిపూర్ణ అవగాహనతో విమర్శిస్తే హుందాగా ఉంటుంది. సమస్యను పరిష్కరించే దిశలో నడిపించడానికి బదులు ఆవేశాలను రెచ్చగొడుతూ, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాజకీయ నాయకుల స్వప్రయోజనాలను గుర్తించలేనంత అమాయకులేమీ ఆర్టీసీ కార్మికులు కాదు. ప్రతిపక్షాల ఉద్యమాలు రేపటి హుజూర్‌నగర్ ఉప ఎన్నికే ధ్యేయంగా కార్మికుల సమ్మెను వాడుకోవాలని చూడటం విచారకరం. అట్లనే కార్మికులు నెల రోజులు ముందే ప్రభుతానికి నోటీసు ఇస్తే, ఇన్నాళ్ళు ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఈ నెల రోజులలో ఎలాంటి కార్యాచరణకు పూనుకొన్నాయి? ప్రభుతానికి– కార్మికులకు మధ్య ఎలాంటి సయోధ్య చర్యలు చేపట్టాయో ప్రజలకు తెలుపాల్సిన బాధ్యత వారిపై ఉన్నది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# అభిజిత్‌కు అభినందల వెల్లువ

'**అర్థశాస్త్రంలో** నోబెల్‌కు ఎంపికైన అభిజిత్ బెనర్జీకి అభినందనలు. పేదరికం నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎనలేనిది. అభిజిత్‌తోపాటు నోబెల్‌కు ఎంపికైన ఎస్తేర్ డఫ్లో, మైఖేల్ క్రెమెర్‌లకు అభినందనలు'

**- నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

'**అద్భుతమైన** విజయంతో బెనర్జీ దేశాన్ని గర్వపడేలా చేయడమేగాక, ప్రయోగాత్మక విధానం ద్వారా పేదరిక నిర్మూలనలో భారత్‌తో సహా ప్రపంచంలోని లక్షలాది మంది ప్రజలకు సహాయపడ్డారు. ఆయనకు నోబెల్ పురస్కారం లభించడం భారతీయులందరికీ సంతోషదాయకం'

**- సోనియా గాంధీ, కాంగ్రెస్ అధినేత్రి**

'**నోబెల్‌ను** సొంతం చేసుకున్న అభిజిత్‌కు అభినందనలు. పేదరికాన్ని తొలగించి భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిచ్చే విధంగా కాంగ్రెస్ ప్రతిపాదించిన 'న్యాయ్' కార్యక్రమానికి కన్సల్టెంట్‌గా ఆయన సహకారం అందించారు'

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత**

**భారత్** వంటి వర్ధమాన దేశాల్లో విధానాల రూపకల్పనకు ఎంతగానో ఉపయోగపడేలా ఆర్థికశాస్త్ర రంగంలో చేసిన వినూత్న ఆవిష్కరణలకు ఈ ఏడాది నోబెల్‌ను ప్రకటించటం హర్షణీయం.

**-మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్**

(2012లో తాను ప్రధానిగా ఉన్న సమయంలో తన ఆర్థిక విధాన కీలక బృందంలోకి అభిజిత్‌ను తీసుకోవాలని మన్మోహన్ భావించారు)

'**అభిజిత్** వినాయక్ బెనర్జీకి నోబెల్ రావడం నాకు చాలా సంతోషంగా ఉన్నది. మేమిద్దరం ప్రెసిడెన్సీ కాలేజీ పూర్వ విద్యార్థులం. అభిజిత్ పీహెచ్‌డీ పట్టా పొందిన హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రస్తుతం నేను ఎకనామిక్స్, ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా ఉన్నాను'

**- అమర్త్యసేన్, నోబెల్ గ్రహీత (1998)**

## వారి కృషి ఎనలేనిది



నోబెల్ గ్రహీతలకు సీఎం కేసీఆర్ అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అర్థశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ పురస్కారం పొందిన ప్రముఖ ఆర్థిక వేత్త అభిజిత్ బెనర్జీకి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. అభిజిత్ భార్య ఎస్తేర్ డ్యుఫ్లో, మరో ప్రముఖ ఆర్థిక వేత్త మైఖేల్ క్రేమెర్ సంయుక్తంగా ఈ నోబెల్ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని నిర్మూలించేందుకు వారు చేసిన పరిశోధనల కృషి ఎనలేనిదని ప్రశంసించారు.

## సరికొత్తగా క్షేత్రస్థాయి అధ్యయనం

**స్టాక్‌హోమ్:** అభిజిత్ బెనర్జీ, ఆయన భార్య ఎస్తేర్ డ్యుఫ్లో భారత్‌లో సాగించిన విస్తృత క్షేత్ర స్థాయి అధ్యయనాలు, వినూత్న పరిశోధనలు.. డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌లో మార్పులకు నాంది పలుకడమే కాకుండా, నోబెల్ పురస్కారం లభించడంలో కీలకంగా నిలిచాయి. విద్యారంగ సమస్యలకు పరిష్కారాలపై వారు తొలుత అధ్యయనం చేశారు. విద్యార్థులకు అధిక సంఖ్యలో పుస్తకాలు ఇవ్వడం, ఉచిత భోజనం అందించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండడం లేదని, వెనుకబడిన విద్యార్థులకు 'లక్షిత' సాయం అందించడం వల్ల ఉత్తమ ఫలితాలు వస్తున్నట్లు గుర్తించారు. ముంబై, వడోదరల్లోని పాఠశాలల్లో రిమెడియల్ ట్యూటరింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా టీచింగ్ అసిస్టెంట్లను నియమించారు. ఫలితంగా ఆ విద్యార్థుల్లో గణనీయ పురోగతి కనిపించినట్లు గుర్తించారు. భారత్‌తోపాటు కెన్యాలోనూ ఈ పరిశోధనలు సాగించారు. హైదరాబాద్‌లో పేద కుటుంబాలకు ఉద్దేశించిన మైక్రో క్రెడిట్ ప్రోగ్రామ్‌పైనా వీరు అధ్యయనం చేశారు.



## భారత్‌తో 'నోబెల్' అనుబంధం

**న్యూఢిల్లీ:** భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, శాంతి, ఆర్థిక శాస్త్రం, వైద్య శాస్త్రం, సాహిత్యం తదితర విభాగాల్లో ఇప్పటికే పలువురు భారతీయులు, భారత సంతతికి చెందిన ప్రముఖులు నోబెల్ పురస్కారాన్ని అందుకున్నారు. తాజాగా భారతీయ అమెరికన్ అభిజిత్ బెనర్జీని ఆర్థికశాస్త్రంలో నోబెల్ వరించింది. ఈ నేపథ్యంలో 'నోబెల్' పురస్కారం అందుకున్న భారతీయులు, భారత సంతతికి చెందిన ప్రముఖుల వివరాలు

### నోబెల్ అందుకున్న భారతీయులు

**రవీంద్రనాథ్ ఠాగూర్**



నోబెల్ పురస్కారం అందుకున్న తొలి భారతీయుడిగా రవీంద్రనాథ్ ఠాగూర్ నిలిచారు. ఆయన రచించిన గీతాంజలి కావ్యానికి సాహిత్య విభాగంలో 1913లో ఈ పురస్కారం లభించింది. పాఠకులను మంత్రముగ్ధులను చేస్తూ మృదువైన శైలిలో ఠాగూర్ ఈ కావ్యాన్ని రాశారు.

**సీవీ రామన్**



కాంతి పరిక్షేపణంపై పరిశోధనలు చేసినందుకుగానూ రామన్‌కి 1930లో నోబెల్ పురస్కారం లభించింది. భౌతిక శాస్త్రంలో ఆయనకు ఈ అవార్డును ఇచ్చారు.

**మదర్ థెరెసా**



సమాజంలో వివక్షకు గురైన వాళ్లు, కుష్టువ్యాధిగ్రస్థుల కోసం మిషనరీలు స్థాపించి సమాజ సేవ చేసినందుకుగానూ శాంతి విభాగంలో మదర్ థెరెసాకు 1979లో ఈ పురస్కారం లభించింది.

**అమర్త్యసేన్**



ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు, ప్రజల సంక్షేమం కోసం 1998లో అమర్త్యసేన్ ప్రతిపాదించిన సూత్రాలను పరిగణలోకి తీసుకున్న నోబెల్ ఫౌండేషన్ ఆయనకు ఈ పురస్కారాన్ని(ఆర్థిక విభాగంలో) ప్రకటించింది. కరువు, మానవ అభివృద్ధి సిద్ధాంతం, సంక్షేమ ఆర్థిక శాస్త్రం, పేదరికానికి గల కారణాలను ఆయన వివరించారు.

**కైలాశ్ సత్యార్థి**



ఈయన బాలలహక్కుల ఉద్యమకారుడు. 1980లో బచ్‌పన్ బచావో ఆందోళన్ స్థాపించి, ఇప్పటివరకూ 80వేల మందికి పైగా పిల్లల హక్కులు కాపాడేందుకు ఉద్యమాలు నడిపారు. శాంతి విభాగంలో 2014లో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. మరో బాలలహక్కుల ఉద్యమకారిణి, పాకిస్థానీ యువతి మలాలా యూసఫ్‌జాయ్‌తో ఉమ్మడిగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

### భారత సంతతికి చెందిన నోబెల్ గ్రహీతలు

**హరగోవింద్ ఖొరానా**

జెనెటిక్ కోడ్, ప్రొటీన్ సింథసిస్‌లో చేసిన పరిశోధనలు, ప్రయోగశాలలో కృతిమ జన్యువు సృష్టి.. వంటి పరిశోధనలకుగానూ 1968లో వైద్య శాస్త్రంలో ఖొరానాకు నోబెల్ బహుమతి వరించింది. ఈయన అప్పటి బ్రిటిష్ ఇండియాలోని రాయ్‌పూర్‌లో జన్మించారు. అమెరికాలో స్థిరపడ్డారు.

**సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్**

ఈయన భారతీయ సంతతికి చెందిన అమెరికన్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. నక్షత్రాలపై ఈయన చేసిన పరిశోధనకుగానూ 1983లో నోబెల్ బహుమతిని అందుకున్నారు. బ్రిటిష్ ఇండియాలోని లాహోర్‌లో ఈయన జన్మించారు.

**వెంకట్రామన్ రామకృష్ణన్**

రైబోజోమ్ నిర్మాణం, ప్రక్రియల గురించి చేసిన పరిశోధనలకుగానూ ఈయనకు 2009లో రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. తమిళనాడులోని చిదంబరంలో రామకృష్ణన్ జన్మించారు.

### భారత్‌తో సంబంధాలున్న నోబెల్ గ్రహీతలు

**రుడ్యార్డ్ కిప్లింగ్**

రుడ్యార్డ్ కిప్లింగ్ ప్రసిద్ధ ఆంగ్ల రచయిత, కవి. బొంబాయిలో జన్మించారు.1894లో ఆయన రాసిన ది జంగిల్ బుక్ అనే కథా సంకలనంతో ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు చేరువయ్యారు. కథా సాహిత్యంలో ఆయన తీసుకొచ్చిన నూతన ఒరవడికి 1907లో సాహిత్యంలో ఆయనకు నోబెల్ బహుమతి వచ్చింది.

**14వ దలైలామా**

14వ దలైలామాకు 1989లో నోబెల్ శాంతి పురస్కారం లభించింది. టిబెట్ ప్రజల విముక్తి కోసం ఆయన చేస్తున్న శాంతియుత పోరాటానికి గానూ ఈ అవార్డు వచ్చింది. టిబెట్‌లో జన్మించిన దలైలామా 1959 టిబెటన్ తిరుగుబాటు సమయంలో భారత్‌కి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు.

**వీ ఎస్ నైపాల్**

విద్యాధర్ సూరజ్ ప్రసాద్ నైపాల్(వీ ఎస్ నైపాల్) ట్రినిడాడ్‌కు చెందిన భారతీయ సంతతికి చెందిన ప్రఖ్యాత నవలా రచయిత. 2001లో ఈయనకు సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించింది. చరిత్రకు సంబంధించిన ఇతివృత్తాలు ఆయన రచనల్లో ఎక్కువగా కనిపించేవి. నిష్పక్షపాతమైన రచయితగా ఆయనకు పేరుంది.

**రోనాల్డ్ రాస్**

సర్ రోనాల్డ్ రాస్ ప్రముఖ ఆంగ్లో-ఇండియన్ శాస్త్రవేత్త. మలేరియా పరాన్నజీవి జీవితచక్రానికి చెందిన పరిశోధనకుగానూ 1902లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈయన హైదరాబాద్‌లోనే ఈ పరిశోధన జరిపారు.

# భారతీయ అమెరికన్‌కు నోబెల్

అర్థశాస్త్రంలో భార్య డ్యుఫ్లోతో కలిసి ఎంపికైన అభిజిత్ బెనర్జీ

మరో ఆర్థికవేత్త మైఖేల్ క్రేమర్‌నూ వరించిన అవార్డు

- పేదరిక నిర్మూలనకు విశిష్ట పరిశోధనలు
- దారిద్ర్యంపై పోరాటంలో మన సామర్థ్యాల్ని పెంచారు
- రాయల్ స్వీడిష్ అకాడమీ ప్రశంస
- దుర్బలంగా భారత ఆర్థిక వ్యవస్థ: అభిజిత్ ఆందోళన

**స్టాక్‌హోమ్, అక్టోబర్ 14:** భారతీయ అమెరికన్ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ (58), ఆయన భార్య ఎస్తేర్ డ్యుఫ్లోను ప్రఖ్యాత నోబెల్ పురస్కారం వరించింది. ఆర్థిక శాస్త్రానికి సంబంధించి ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ బహుమతిని ప్రకటించారు. మరో ఆర్థికవేత్త మైఖేల్ క్రేమర్‌తో కలిసి అభిజిత్, డ్యుఫ్లో సంయుక్తంగా ఈ అవార్డును అందుకోనున్నారు. పేదరిక నిర్మూలనకు వీరు చేసిన విశిష్ట పరిశోధనలకు గుర్తింపుగా ఈ అత్యున్నత పురస్కారం వరించింది. అభిజిత్, డ్యుఫ్లో ప్రస్తుతం ప్రతిష్ఠాత్మక మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. క్రేమర్.. హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆర్థిక రంగంలో నోబెల్‌కి ఎంపికైన రెండో మహిళ, అత్యంత పిన్న వయస్కురాలు డ్యుఫ్లో కావడం విశేషం. పురస్కారం కింద 9,18,000 డాలర్ల నగదు బహుమతి, బంగారు పతకం, ధ్రువీకరణ పత్రం అందించనున్నారు. నగదు బహుమతిని విజేతలకు సమానంగా అందజేస్తారు. ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు సాగించిన పరిశోధనలు పేదరికంపై పోరాటంలో మన శక్తి సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపరిచాయని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కొనియాడింది. వారి సరికొత్త ప్రయోగాత్మక పరిశోధనల ఫలితంగా కేవలం రెండు దశాబ్దాల్లో డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని ప్రశంసించింది. పేదరికంపై పోరాడేందుకు ఉత్తమ మార్గాలను అన్వేషించేందుకు వీరు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారని పేర్కొంది. వీరి పరిశోధన కార్యక్రమాల్లో భాగంగా భారతీయ స్కూళ్లలో బోధనా పద్ధతులను మెరుగుపరిచారని, తద్వారా 50 లక్షల మందికి పైగా విద్యార్థులు నేరుగా ప్రయోజనం పొందారని వివరించింది. ప్రివెంటివ్ హెల్త్‌కేర్ రంగంలో చాలా దేశాలు భారీగా సబ్సిడీలు అందించడాన్ని వీరి పరిశోధన ఫలితాలకు మరో ఉదాహరణగా పేర్కొంది. నోబెల్ పురస్కారానికి ఎంపికైన అనంతరం డ్యుఫ్లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'ఒక మహిళ విజయం సాధించగలదని, ఆ విజయానికి గుర్తింపు లభిస్తుందనేందుకు ఇదే నిదర్శనం. మరింత మంది మహిళలకు ఇది స్ఫూర్తినిస్తుందని, పురుషులు మహిళలకు సముచిత గౌరవం ఇస్తారని నేను భావిస్తున్నా' అని పేర్కొన్నారు. కాగా, నోబెల్ పురస్కారానికి ఎంపికైన అభిజిత్‌పై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, ప్రఖ్యాత ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.



మైఖేల్ క్రేమర్

**ముంబై నుంచి అమెరికాకు..**

అభిజిత్ బెనర్జీ 1961లో ముంబైలో జన్మించారు. కోల్‌కతా యూనివర్సిటీ, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం సాగించారు. 1988లో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో (ఎంఐటీ) ఫోర్డ్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 2003లో తన భార్య డ్యుఫ్లోతోపాటు సెందిల్ ముల్లయనాథన్‌తో కలిసి అబ్దుల్ లతీఫ్ జమీల్ పావర్టీ యాక్షన్ ల్యాబ్ (జే-పాల్)ను స్థాపించారు. ఇప్పటికీ ల్యాబ్ డైరెక్టర్లలో ఒకరిగా ఉన్నారు. ఎకానమిక్ అనాలసిస్ ఆఫ్ డెవలప్‌మెంట్‌లో రీసెర్చ్ బ్యూరోకు గతంలో అధ్యక్షుడిగా పనిచేశారు. ఎబీఈఆర్ రీసెర్చ్ అసోసియేట్‌గా, సీఈపీఆర్ రీసెర్చ్ ఫెలోగా, కీల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఫెలోగా, అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అండ్ ఎకనామెట్రిక్ సొసైటీ ఫెలోగా, గుగెన్‌హీమ్ ఫెలోగా, ఆల్‌ఫ్రెడ్ పీ సోలెన్ ఫెలోగానూ ఉన్నారు. ఇన్ఫోసిస్ పురస్కారాన్ని కూడా ఆయన అందుకున్నారు. '2015 అనంతర అభివృద్ధి ఎజెండా'పై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఏర్పాటుచేసిన మేధావుల కమిటీలోనూ అభిజిత్ సభ్యుడిగా ఉన్నారు. అభిజిత్.. డ్యుఫ్లో కంటే ముందు ఎంఐటీలో సాహిత్య అధ్యాపకురాలిగా పనిచేస్తున్న అరుంధతి తుల్ బెనర్జీని వివాహం చేసుకున్నారు. అనంతరం విడిపోయారు.



భార్య డ్యుఫ్లోతో అభిజిత్ బెనర్జీ (ఫైల్)

### గురుశిష్యులు.. భార్యాభర్తలు.. నేడు సహ విజేతలు

**భార్య** డ్యుఫ్లోతో కలిసి నోబెల్ పురస్కారానికి ఎంపికైన అభిజిత్.. 1990లో ఎంఐటీలో డ్యుఫ్లో పీహెచ్‌డీకి సూపర్‌వైజర్‌గా వ్యవహరించడం విశేషం. 2015లో వారిద్దరూ వివాహం చేసుకున్నారు. వారు కలిసి రచించిన 'గుడ్ ఎకనామిక్స్ ఇన్ హార్డ్ టైమ్స్-బెటర్ ఆన్సర్స్ టు అవర్ బిగ్గెస్ట్ ప్రాబ్లమ్స్' పుస్తకం ఈ వారం విడుదల కానుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కార మార్గాలను కనుగొనడంలో ఇది దోహదపడుతుందని పబ్లిషర్లు పేర్కొన్నారు. డ్యుఫ్లోతో కలిసి అభిజిత్ రాసిన 'పూర్ ఎకనామిక్స్' పుస్తకం 2011లో గోల్డ్‌మన్ శాక్స్ బిజినెస్ బుక్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికైంది. ఆ పుస్తకం 17కుపైగా భాషల్లోకి అనువాదితమైంది. మరో మూడు పుస్తకాలకు ఆయన ఎడిటర్‌గా ఉన్నారు. రెండు డాక్యుమెంటరీ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఫ్రెంచ్-అమెరికన్ అయిన డ్యుఫ్లో 1972లో పారిస్‌లో జన్మించారు. 1999లో ఎంఐటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. పారిస్‌లోని ఎకోల్ నార్మలే సుపీరియర్ గ్రాడ్యుయేట్ స్కూల్ నుంచి హిస్టరీ, ఎకనమిక్స్‌లో తొలి డిగ్రీ పొందారు. డ్యుఫ్లో పలు పురస్కారాలను అందుకున్నారు. ప్రిన్సెస్ ఆఫ్ అస్టురియాస్ అవార్డ్ ఫర్ సోషల్ సైన్సెస్ (2015), ఏఎస్‌కే సోషల్ సైన్స్ అవార్డు (2015), ఇన్ఫోసిస్ ప్రైజ్ (2014), డేవిడ్ ఎన్ కెర్షా అవార్డు (2011), జాన్ బేట్స్ క్లర్క్ మెడల్ (2010), మాక్ ఆర్థర్ 'జీనియస్ గ్రాంట్' ఫెలోషిప్ (2009)ను పొందారు. అమెరికన్ ఎకనమిక్ రివ్యూ ఎడిటర్‌గానూ ఆమె వ్యవహరిస్తున్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సభ్యురాలిగా, బ్రిటిష్ అకాడమీ కరస్పాండింగ్ ఫెలోగానూ ఉన్నారు.

### భారత్ ఇప్పట్లో కోలుకోవడం కష్టం..

**భారత** ఆర్థిక పరిస్థితి దుర్బలంగా ఉన్నదని అభిజిత్ ఆందోళన వ్యక్తం చేశారు. నోబెల్ పురస్కారానికి ఎంపికైన నేపథ్యంలో సోమవారం ఆయన అమెరికాలో ఒక న్యూస్ చానల్‌తో మాట్లాడారు. 'ప్రస్తుత వృద్ధి గణాంకాలను పరిశీలిస్తే.. సమీప భవిష్యత్తులో భారత ఆర్థిక వ్యవస్థ కోలుకునే పరిస్థితులు కనిపించడం లేదు. గత ఐదారేండ్లలో మనం కనీసం కాస్త వృద్ధినైనా చూశాం. ప్రస్తుతం ఆ భరోసా కూడా లేదు. నా కెరీర్‌లో ఇంత త్వరగా నోబెల్ పురస్కారాన్ని అందుకుంటానని ఊహించలేదు. గత రెండు దశాబ్దాలుగా నేను ఈ పరిశోధనలు చేస్తున్నాను. పేదరిక నిర్మూలనకు పరిష్కార మార్గాలను చూపేందుకు మేం ప్రయత్నించాం' అని ఆయన వివరించారు. 'బెంగాల్‌లో నా బాల్యం, టీనేజ్ అనుభవాలు నా పరిశోధనల తొలినాళ్లలో వివిధ అంశాలను అర్థం చేసుకునేందుకు ఎంతో దోహదపడ్డాయి' అని చెప్పారు. సోమవారం వేకువజామున నోబెల్ పురస్కారం వచ్చిందన్న వార్త వినగానే మీ స్పందన ఏమిటని ప్రశ్నించగా.. ఆ వార్త విన్న తర్వాత తాను మళ్లీ నిద్రపోయినట్లు చెప్పారు. తాను తెల్లవారుజామునే నిద్ర లేచే వ్యక్తిని కాదన్నారు. నోబెల్ వార్త అందరికీ తెలియడంతో వరుసగా ఫోన్లు రావడం మొదలైందని, దీంతో తాను సరిగా నిద్రపోలేదన్నారు. భార్యతో కలిసి పురస్కారానికి ఎంపికవడం 'ప్రత్యేకమని' పేర్కొన్నారు. నోబెల్ చరిత్రలో ఇప్పటివరకు కేవలం ఐదుగురు దంపతులు మాత్రమే సంయుక్తంగా ఈ అవార్డును అందుకున్నారు.

# సంతోషంగా.. గర్వంగా ఉంది

- అభిజిత్‌కు నోబెల్ పురస్కారంపై తల్లి నిర్మల హర్షం
- కోడలు డ్యుఫ్లో ఎంతో తెలివైనదని ప్రశంస



కోల్‌కతాలో మీడియాతో నిర్మలా బెనర్జీ

**కోల్‌కతా, అక్టోబర్ 14:** తన కొడుకు అభిజిత్ బెనర్జీ, కోడలు ఎస్తేర్ డ్యుఫ్లోకు అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించడం పట్ల తనకు సంతోషంగాను, గర్వంగాను ఉన్నదని కోల్‌కతాకు చెందిన నిర్మలా బెనర్జీ పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాన్ని తన కొడుకు, కోడలు సంయుక్తంగా దక్కించుకోవడం తనకు మరింత సంతోషాన్ని ఇచ్చిందని ఆమె చెప్పారు. సామాజిక శాస్త్రాల అధ్యయన కేంద్రంలో నిర్మలా బెనర్జీ అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆమె భర్త దీపక్ బెనర్జీ ప్రెసిడెన్సీ కాలేజీలో అర్థశాస్త్ర విభాగం అధిపతిగా పనిచేశారు. తన కొడుకు అభిజిత్ ఎంతో తెలివైనవాడు, క్రమశిక్షణ గల విద్యార్థి అని నిర్మలా బెనర్జీ కొనియాడారు. కోడలు ఎస్తేర్ డ్యుఫ్లో వయస్సు చిన్నదైనప్పటికీ ఎంతో తెలివైనదని ప్రశంసించారు. అభిజిత్ బెనర్జీ కోల్‌కతాలోని సౌత్‌పాయింట్ స్కూల్‌లో, ఆ తరువాత ప్రెసిడెన్సీ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. ఆయన ఈ కాలేజీ నుంచే 1981లో బీఎస్సీ పట్టా పొందారు. 'పేదరికాన్ని, పేదల స్థితిగతులను తెలుసుకోవడానికి అభిజిత్ చాలా కష్టపడ్డాడు. పలు సందర్భాలలో మేము వివిధ అంశాలతోపాటు ఆర్థిక వ్యవస్థలోని సమస్యలపై గురించి కూడా చర్చించుకొనేవారం. ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై కూడా అభిజిత్ పలుమార్లు మాట్లాడాడు' అని నిర్మలా బెనర్జీ చెప్పారు.

# పాక్‌ను దోషిగా నిలబెడుదాం

- ఉన్న సమాచారాన్ని సాక్ష్యాలుగా మార్చండి
- ఏటీఎస్, ఎస్టీఎఫ్ దళాలకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సూచన
- పాక్‌పై ఎఫ్‌ఏటీఎఫ్ ఒత్తిడి చాలా ఎక్కువగా ఉన్నదని వ్యాఖ్య



ఎన్‌ఐఏ సదస్సులో అజిత్‌దోవల్‌కు మొక్కను అందిస్తున్న ఎన్‌ఐఏ డీజీ యోగేశ్ చందర్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచిపోషిస్తున్నదన్న విషయాన్ని అంతర్జాతీయ సమాజం ముందు ఆధారాలతో సహా చూపించాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తెలిపారు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదులకు అందుతున్న నిధులపై ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్‌ఏటీఎఫ్) గట్టి చర్యలు తీసుకున్నదని, ఇది ఆ దేశంపై తీవ్ర ఒత్తిడిని పెంచిందన్నారు. ఉగ్రవాదాన్ని పాక్ ఓ విధాన నిర్ణయంగా మార్చుకున్నదని, ఈ అంశం భారత భద్రతా సంస్థలకు పెద్ద సవాలుగా మారిందన్నారు. ఉగ్రవాదులను మట్టికరిపించాలంటే వారి సిద్ధాంతాలతో పోరాడాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధిపతులతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో దోవల్ మాట్లాడారు. మానవ, ఆర్థిక వనరులు పరిమితంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఒక్క దేశం కూడా యుద్ధానికి వెళ్లే పరిస్థితి లేదని అన్నారు. ఒకవేళ యుద్ధానికి వెళ్లినప్పటికీ, ఏ ఒక్క దేశానికి గెలుపుపై సరైన నమ్మకం లేదన్నారు. 'ఎఫ్‌ఏటీఎఫ్ తీసుకున్న విధానాలు పాకిస్థాన్ మీద తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తున్నాయి. ఆర్థిక వనరుల్ని సమకూరుస్తూ ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తున్నదని అందరికీ తెలుసు. అయితే, దీన్ని తగిన ఆధారాలతో నిరూపించాల్సి ఉంటుంది. ఉగ్రవాదులకు పాక్ సాయం చేస్తున్నదన్న సమాచారాన్ని సాక్ష్యాలుగా మార్చి భద్రతా చట్టాలు సమర్థించే విధంగా చేయాలి. అప్పుడే అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్థాన్‌ను దోషిగా ఉంచగలం' అని సూచించారు. యుద్ధంతో పోలిస్తే ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం ఆర్థికంగా చవకైన అంశం. ఉగ్రవాదంతో శత్రు దేశాన్ని ఎక్కువకాలం తీవ్రంగా దెబ్బతీయొచ్చు. ఉగ్రవాదాన్ని మట్టుపెట్టాలంటే వాళ్ల సిద్ధాంతాలపై పోరాడాలి' అని అన్నారు. ఉగ్రవాదంపై పోరాడటంలో మీడియా సహకారం మరువలేనిదని, భద్రతా సంస్థలు పారదర్శక మీడియా విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని దోవల్ సూచించారు. కాగా రెండు రోజుల పాటు సాగే ఏటీఎస్, ఎస్టీఎఫ్ అధినేతల సమావేశానికి ఎన్‌ఐఏ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నది. ఉగ్రవాద నిధులు, రాడికలైజేషన్, డిజిటల్ ఎవిడెన్స్ సహా పలు అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నారు.

**ఎఫ్‌ఏటీఎఫ్ సదస్సుకు పాక్ మంత్రి క్లీన్ చిట్ కోసం ప్రయత్నాలు**

ప్రస్తుతం ఎఫ్‌ఏటీఎఫ్ గ్రే లిస్టులో ఉన్న పాకిస్థాన్.. 'బ్లాక్' లిస్టులోకి దిగజారిపోకుండా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా ఆ దేశ ఆర్థిక మంత్రి హమ్మద్ అజార్ తన బృందంతో ఎఫ్‌ఏటీఎఫ్ సదస్సులో తమ వాణిని వినిపించేందుకు ఆదివారం పారిస్‌కి చేరుకున్నట్టు పాక్ మీడియా పేర్కొంది. అక్రమ లావాదేవీలు, తీవ్రవాదులకు నిధుల చేరవేతను ఎలా అడ్డుకున్నామో తెలియజేస్తూ రూపొందించిన నివేదికను అజార్ ఎఫ్‌ఏటీఎఫ్ ప్రతినిధుల ముందు ఉంచనున్నారు. దీంతో తమ దేశానికి క్లీన్ చిట్ లభిస్తుందని పాక్ భావిస్తున్నది. ఉగ్రవాద సంస్థలకు సురక్షిత స్థావరంగా మారిన పాకిస్థాన్‌ను గ్రే లిస్టులో చేరుస్తూ ఎఫ్‌ఏటీఎఫ్ గత సంవత్సరం జూన్‌లో నిర్ణయం తీసుకున్నది. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి తీసుకున్న చర్యల్ని అక్టోబర్ 2019లోపు తెలియజేయాలని పాక్‌కు సూచించింది. ఇరాన్, ఉత్తర కొరియాను ఎఫ్‌ఏటీఎఫ్ ఇప్పటికే బ్లాక్ లిస్టులో ఉంచింది.

### దేశానికి జేఎంబీ ముప్పు: ఎన్‌ఐఏ అధిపతి యోగేశ్ చందర్

**భారతదేశానికి** బంగ్లాదేశ్ ఉగ్రవాద సంస్థ జమాత్-ఉల్-ముజాహిద్దీన్ బంగ్లాదేశ్ (జేఎంబీ) నుంచి ముప్పు పొంచి ఉన్నదని ఎన్‌ఐఏ హెచ్చరించింది. జార్ఖండ్, బీహార్, మహా రాష్ట్ర, కేరళ, కర్ణాటకలో జేఎంబీ కార్యకలాపాలు పెరిగినట్టు గుర్తించామని, 125 మంది అనుమానిత ఉగ్రవాదుల పేర్లను సంబంధిత రాష్ట్ర ఏజెన్సీలకు చేరవేశామని ఎన్‌ఐఏ అధిపతి యోగేశ్ చందర్ మోదీ తెలిపారు. రాష్ట్రాల యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధిపతులను ఉద్దేశించి యోగేశ్ చందర్ మోదీ ఎన్‌ఐఏ సమావేశంలో సోమవారం మాట్లాడారు. బంగ్లాదేశ్ వలసవాదుల పేరుతో దేశంలో జేఎంబీ తమ కార్యకలాపాలు సాగిస్తున్నదని యోగేశ్ చెప్పారు. 130 మంది అనుమానిత ఉగ్రవాదులు జేఎంబీతో తరుచూ సంభాషిస్తున్నారని తమ దర్యాప్తులో తేలిందని ఎన్‌ఐఏ ఇన్‌స్పెక్టర్ జనరల్ అలోక్ మిట్టల్ తెలిపారు.

## బీజేపీకి బలమైన జట్టు.. పటిష్ఠమైన కెప్టెన్



జట్టుకట్టే యత్నంలో కూలిపోతున్న ప్రతిపక్షాలు

హర్యానా ఎన్నికల ప్రచారంలో మోదీ విమర్శలు

**బల్లబ్‌గఢ్:** ఒకప్పుడు ఆలోచించడానికి కూడా వెనుకాడే ఆర్టికల్ 370రద్దు వంటి నిర్ణయాలను నేడు భారత్ తీసుకుంటున్నదని, ప్రజలు తనకిచ్చిన భారీ తీర్పు వల్లనే ఇది సాధ్యమైందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని బహిరంగంగా ప్రకటించే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా అని ఆయన ప్రశ్నించారు. హర్యానా ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ సోమవారం బల్లబ్‌గఢ్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. బీజేపీకి బలమైన జట్టు, పటిష్ఠమైన కెప్టెన్ ఉన్నాడని, ప్రతిపక్షాలు మాత్రం ఐక్యమయ్యే ప్రయత్నంలో కూలిపోతున్నాయని ఎద్దేవా చేశారు. తాము తీసుకున్న నిర్ణయం వల్ల నేడు జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని, ఈ ప్రతిష్ఠ కేవలం మోదీ ఒక్కడిది కాదని, మొత్తం 130 కోట్ల దేశ ప్రజలదన్నారు.ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని మోదీ ఆరోపించారు.

## సంపన్నుల 'లౌడ్‌స్పీకర్' మోదీ

రాహుల్‌గాంధీ ఆరోపణ



నూహ్ సభలో రాహుల్ అభివాదం

**నూహ్ (హర్యానా), అక్టోబర్ 14:** అదానీ, అంబానీ వంటి సంపన్నులకు ప్రధాని మోదీ 'లౌడ్‌స్పీకర్' వంటి వారని, ఆయన ఎప్పుడూ పెద్ద పెద్ద వ్యాపారవేత్తల గురించే మాట్లాడుతారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. పేదల జేబులు ఖాళీ చేసి ఆ ధనాన్ని సంపన్నులైన తన స్నేహితులకు మోదీ అప్పగిస్తున్నారన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ సోమవారం నూహ్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. ప్రధాని మోదీతోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కూడా సంపన్నులైన వ్యాపారుల కోసమే ఆలోచిస్తారని, పేదలను పట్టించుకోబోరని విమర్శించారు. మీడియాపై కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. మీడియాలో రాఫెల్ యుద్ధ విమానానికి జరిగిన పూజలను చూపిస్తారు తప్ప వాటి కొనుగోళ్లలో జరిగిన లూటీని చూపించరని విమర్శించారు. మోదీ, ఖట్టర్‌లు పేదల డబ్బును ధనవంతులైన తమ 15 మంది మిత్రులకు పంచిపెడుతున్నారని రాహుల్ ఆరోపించారు. 'మీరు జాతీయవాదులమని చెప్పుకుంటారు. భారతదేశపు పెట్టుబడిని సంపన్నులైన మీ స్నేహితుల చేతిలో ఎందుకు పెడుతున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. 'ప్రధానమంత్రి తన 'మన్ కీ బాత్ (మనసులో మాట)' గురించి మాట్లాడుతారని, 'కామ్ కీ బాత్ (పనికొచ్చే మాట)' మాట్లాడరని ఎద్దేవా చేశారు.




## ఆమె చచ్చిన ఎలుక వంటిది

- సోనియాపై హర్యానా సీఎం ఖట్టర్ అసభ్యకర వ్యాఖ్య
- అయితే! నువ్వు గాడిదవు!
- ఎదురుదాడి చేసిన మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నితిన్ రౌత్



**సోనిపట్/న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీపై హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. ఆమె 'చచ్చిపోయిన ఎలుక' వంటిదని వ్యాఖ్యానించారు. ఖట్టర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండి పడింది. ఈ నెల 21న హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. ఆదివారం సోనిపట్‌లో జరిగిన ఎన్నికల సభలో ఖట్టర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని, జన్నాయక్ జనతా పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన రాహుల్‌గాంధీ స్థానంలో గాంధీ కుటుంబేతర వ్యక్తి నియామకానికి అన్వేషించారని, గాంధీ కుటుంబానికి దూరమైతే ఆ పార్టీకి మంచి రోజులు వస్తాయని భావించామన్నారు. కానీ మళ్లీ మూడు నెలల తర్వాత గాంధీ కుటుంబ సభ్యురాలు సోనియాగాంధీ పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారంటూ.. 'ఇది కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉంది. అది కూడా చచ్చిన ఎలుక' అని పేర్కొన్నారు. 'కుటుంబ పార్టీల తమాషా మీకు తెలుసు. కుటుంబంలో సభ్యులు పరస్పరం గొడవ పడతారు. ఓ వైపు 'పప్పు', మరోవైపు 'మమ్మీ' ఉంటారు' అని ఎద్దేవా చేశారు. దీనిపై తీవ్రంగా మండిపడిన కాంగ్రెస్ పార్టీ తక్షణం ఖట్టర్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. సీఎం వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనాన్ని తెలియజేస్తున్నాయని, బీజేపీ మహిళ వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొంది. మహారాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నితిన్ రౌత్ మాట్లాడుతూ 'ఖట్టర్ కాదు ఖచ్చర్ (గాడిద)' అని వ్యాఖ్యానించారు. సోనియా పట్ల అవమానకర వ్యాఖ్యలు చేయడం నేరపూరితమని అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుష్మితా దేవ్ పేర్కొన్నారు.

## కమలానికి ఓటేయడమంటే.. పాక్‌పై బాంబు వేయడమే!

యూపీ డిప్యూటీ సీఎం మౌర్య వ్యాఖ్య

**థాణె, అక్టోబర్ 14:** బీజేపీకి ఓటేయడమంటే పాకిస్థాన్‌పై అణుబాంబు వేయడం వంటిదని ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తరువాత జరుగుతున్న మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలు ఎంతో కీలకమైనవన్నారు. ఈ ఎన్నికలు భారతీయుల నిజమైన దేశభక్తిని ప్రపంచానికి చాటనున్నాయని తెలిపారు. మహారాష్ట్రలోని భయందర్‌లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా జరిగిన సభలో మౌర్య మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో కమలం గుర్తు ఉన్న మీటను నొక్కడం వల్ల.. ప్రధాని మోదీ, సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, అభ్యర్థి నరేంద్ర మెహతాకు మాత్రమే మీరు లబ్ధి చేకూర్చరు.. బీజేపీకి ఓటు వేయడం ద్వారా మీరు పాకిస్థాన్‌పై అణుబాంబు వేసిన వారవుతారు' అని మౌర్య వ్యాఖ్యానించారు.

# తెలంగాణ నర్సులకు యూకేలో ఉద్యోగాలు!

- శిక్షణ అనంతరం మూడేండ్లపాటు అవకాశం
- తెలంగాణ, యూకే సంస్థల మధ్య ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో నర్సు విద్యకు పేర్లు నమోదు చేసుకున్నవారు యూకేలో చదువుకొని.. అనంతరం మూడేండ్లపాటు అక్కడే ఉద్యోగం చేసుకునే సదవకాశం కలిగింది. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్‌కంపెనీ.. యూకేకు చెందిన జాతీయ ఆరోగ్య సేవాసంస్థ (ఎన్‌హెచ్‌ఎస్)తో సోమవారం ఒప్పందం కుదుర్చుకున్నది. దీనిపై హెల్త్ ఎడ్యుకేషన్ ఇంగ్లాండ్ (హెచ్‌ఈఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ జెడ్ బైరన్, తెలంగాణ ప్రభుత్వం తరపున టామ్‌కామ్ డైరెక్టర్ కేవై నాయక్ సంతకాలు చేశారు. ఇతర దేశాలనుంచి యూకేకు వచ్చే నర్సుల విద్య, అనుభవం వంటివి ఎన్‌హెచ్‌ఎస్ అంచనా వేస్తుంది. ఇందులో భాగంగా గ్లోబల్ లర్నర్స్ ప్రోగ్రాం (జీఎల్‌పీ)కు శ్రీకారం చుట్టింది. దీనిద్వారా నర్సులు ఎన్‌హెచ్‌ఎస్ ఉద్యోగాలను చేయగలుగుతారు. 2022 మార్చివరకు 5,500 మంది నర్సులను నియమించాలని హెచ్‌ఈఈ లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకున్నది. ఇందులో భారత్‌కు చెందిన నర్సులకు ప్రాధాన్యమిస్తూ.. టైర్ 2 వీసా నిబంధనలను సడలించింది.

**గతంలో కేరళ.. ఇప్పుడు తెలంగాణ**

యూకేలో పనిచేసే నర్సుల అర్హతలకు తగ్గట్టుగా ఉద్యోగాలు లభించేందుకు జాతీయ ఆరోగ్య సేవా సంస్థ ప్రయత్నిస్తున్నదని హెచ్‌ఈఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జెడ్ బైరన్ అభిప్రాయపడ్డారు. గతంలో కేరళ రాష్ట్రంతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఈసారి తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఏర్పాటుచేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో హోమ్ సెక్రటరీ రాజీవ్ త్రివేది, ముఖ్యకార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు చెందిన డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



## అమెరికా-భారత్ రక్షణ సంబంధాల్లో హైదరాబాద్ కీలకం

- యూఎస్ కాన్సుల్ జనరల్ జోయెల్ రిఫ్‌మన్



కెప్టెన్ లకెట్‌తో యూఎస్ కాన్సుల్ జనరల్ రిఫ్‌మన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అమెరికా, భారత్ రక్షణ సంబంధాల్లో హైదరాబాద్ అత్యంత కీలక ప్రాంతమని యూఎస్ కాన్సుల్ జనరల్ జోయెల్ రిఫ్‌మన్ అన్నారు. అమెరికాకు చెందిన యుద్ధనౌకలు భారత్‌కు రావడం, ఇక్కడి సైన్యంతో అనుభవాలు పంచుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. సోమవారం ఏపీలోని విశాఖతీరానికి వచ్చి మంగళవారం ప్రయాణమైన అమెరికా సహాయక యుద్ధనౌక 'యూఎస్ఎస్ ఎమోరి ఎస్ ల్యాండ్'కు రిఫ్‌మన్ వీడ్కోలు పలికారు. ఇరు దేశాలమధ్య రక్షణరంగంలో సత్సంబంధాలకు ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు.





బిర్లా ప్లానిటోరియంలో 'డోమ్ డిజిటల్ అస్ట్రనామికల్ ఫెసిలిటీ' ప్రారంభోత్సవంలో పాల్గొన్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ డీజీ సిద్ధార్థ్ తదితరులు

# ఆదర్శ సచివాలయం ఉండొద్దా?

- సచివాలయం నిర్మాణం.. నిధుల దుర్వినియోగం కాదు
- అప్పులున్నాయని ప్రాజెక్టులు ఆపేస్తామా?
- నిధులు ఎలా వినియోగించాలో నిర్ణయించేది ప్రభుత్వమే
- విధాన నిర్ణయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవు
- ఏపీ కార్యాలయాలు తరలిపోయినప్పుడు పునర్విభజనచట్టంతో పనేంటి?
- సచివాలయం కూల్చివేత పిటిషన్లపై హైకోర్టు వ్యాఖ్యలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతనంగా ఏర్పడిన తెలంగాణలో కొత్త సచివాలయం నిర్మిస్తే తప్పేమిటని హైకోర్టు ప్రశ్నించింది. నూతన భవనాలు నిర్మించరాదనే నిషేధాలు ఏ చట్టంలోనైనా ఉన్నాయా? అని పిటిషనర్లను నిలదీసింది. ప్రస్తుత సచివాలయ ప్రాంగణంలో నూతన భవన సముదాయాన్ని నిర్మించాలన్న మంత్రిమండలి నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు ప్రారంభమయ్యాయి. నూతన సచివాలయాన్ని నిర్మిస్తే తప్పేమిటని చీఫ్ జస్టిస్ రాఘువేంద్రసింగ్‌చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డితో కూడిన ద్విసభ్య ధర్మాసనం పిటిషనర్లను ప్రశ్నించింది. సచివాలయం నిర్మాణం ద్వారా ప్రజాధనం దుర్వినియోగమవుతుందన్న పిటిషనర్లు అభియోగంపై ఘాటుగా స్పందించింది. సచివాలయం ప్రజల కోసమే అయినప్పుడు ప్రజాధనం దుర్వినియోగమవుతుందని ఎలా చేప్తారని ప్రశ్నించింది. ప్రజా ప్రయోజనాల కోసమే ప్రభుత్వం నిధులను ఖర్చుచేస్తుందని, ఏయే రంగాలకు ఎంత కేటాయించాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుందని, ఆ హక్కును రాజ్యాంగమే కల్పించిందని ధర్మాసనం స్పష్టంచేస్తూ.. ఇలాంటి విషయాలను కోర్టులు నిర్ణయించజాలవని పేర్కొన్నది. రాష్ట్రానికి వేలకోట్ల రూపాయల అప్పులున్నాయని.. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల చేయలేదని పిటిషనర్లు చెప్పడంతో.. అప్పులుంటే రోడ్లు, ఇతర ప్రాజెక్టులు, నిర్మాణాలను ఆపేయాలా? అని ధర్మాసనం ప్రశ్నించింది. సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన లాంటి అంశాల ప్రాధాన్యాన్ని ప్రభుత్వమే నిర్ణయిస్తుందని పేర్కొంటూ.. అలాంటి విధానపరమైన నిర్ణయాల్లో కోర్టుల జోక్యం ఉండదని ధర్మాసనం స్పష్టంచేసింది.

**సుప్రీంకోర్టు గతంలోనే చెప్పిందిగా..**

మాయావతి సీఎంగా ఉన్న సమయంలో యూపీ ప్రభుత్వం భారీసంఖ్యలో ఏనుగులు, నాయకుల విగ్రహాలను ఏర్పాటుచేసినప్పటికీ అది క్యాబినెట్ నిర్ణయమని, ఆ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంచేసిన విషయాన్ని హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం ఉమ్మడి రాజధానిలోని ప్రభుత్వ భవనాలు, ఆస్తులపై గవర్నర్‌కు నిర్ణయాధికారం ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఆ అధికారం లేదని పిటిషనర్లు పేర్కొనగా.. తెలంగాణ క్యాబినెట్ సలహామేరకు గవర్నర్ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని ఆ చట్టంలో స్పష్టంగా ఉన్నదని హైకోర్టు ప్రస్తావించింది. క్యాబినెట్ సూచన మేరకు గవర్నర్ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడానికి, క్యాబినెట్ సిఫారసులను గవర్నర్ ఆమోదించడానికి మధ్య తేడా ఉన్నదని, అదేమిటో వివరించాలని పిటిషనర్ల తరపు న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. దీనికి పిటిషనర్ల తరపు న్యాయవాది సరైన సమాధానం ఇవ్వకపోవడంతో.. రాజ్యాంగ అంశాల గురించి వాదించేటప్పుడు సరైన సన్నద్ధతతో రావాలని సూచించింది.

**ఆ కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమే: ఏఏజీ**

ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకే అన్ని హంగులతో నూతన సచివాలయాన్ని నిర్మించాలని క్యాబినెట్ నిర్ణయించిందని అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) జే రాంచంద్రరావు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతమున్న భవనాలను కాలక్రమంలో ఒక్కొక్కటిగా నిర్మించారని, ఆ భవనాలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఖాళీచేసిన భవనాలు కూడా ఉన్నాయని ధర్మాసనం పేర్కొనగా.. అన్ని శాఖలు ఒక్కచోటే ఉండేలా సచివాలయ భవనసముదాయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఏఏజీ తెలిపారు. పాత సచివాలయ భవనాలకు అగ్నిప్రమాదాల ముప్పు పొంచి ఉన్నదని అగ్నిమాపకశాఖ తన నివేదికలో తెలిపిందని ఏఏజీ పేర్కొనడంతో.. కొత్త సచివాలయాన్ని నిర్మించాలని అగ్నిమాపక శాఖ సూచించిందా అని ధర్మాసనం ప్రశ్నించింది. నూతన సచివాలయాన్ని నిర్మించాలని సాంకేతిక కమిటీ కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని ఏఏజీ తెలుపడంతో.. క్యాబినెట్ నిర్ణయం తర్వాతే కమిటీ నివేదిక వచ్చిందని ధర్మాసనం ప్రస్తావించింది. శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని తొలిగించి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శుల కోసం చాంబర్లు నిర్మించవచ్చు కాదా? కొన్నేండ్ల క్రితం నిర్మించిన భవనాలను కూడా కూల్చడం ఎందుకు? అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రస్తుత భవనాలు అస్తవ్యస్తంగా, ఇరుకుగా ఉన్నాయని, అన్నిఅవసరాలు తీర్చేలా నూతన భవన సముదాయం ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని ఏఏజీ పేర్కొంటూ.. ప్రస్తుతం పార్కింగ్, ఫైర్‌సేఫ్టీ ప్రశ్నార్థకంగా మారాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఒక భవనానికి మరో భవనానికి అనుసంధాన వ్యవస్థ లేదని, వేసవి, వర్షాకాలంలో కార్యదర్శులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారని, సందర్శకులకు తగిన ఏర్పాట్లు, టాయిలెట్స్, క్యాంటీన్లు లేవని చెప్పారు. ప్రస్తుతం దాఖలైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమని, రాజకీయ దురుద్దేశంతోనే నాయకులు ఆ కేసులు వేశారని ఏఏజీ రాంచంద్రరావు పేర్కొంటూ.. ముందు పిటిషనర్ల అర్హత (లోకస్ స్టాండీ) ఏమిటో పరిశీలించాలని ధర్మాసనాన్ని కోరారు. చట్టసభల సభ్యులు సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించకుండా కోర్టుల్లో కేసులు వేస్తున్నారని చెప్పారు. ఈ వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదావేసింది.

### సెక్షన్ 8కు కాలం చెల్లినట్టే కదా..

ఏపీకి సంబంధించిన అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు అమరావతికి తరలిపోయినప్పుడు ఏపీ పునర్విభజన చట్టంతో సంబంధం ఏమున్నదని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఏపీ గవర్నర్, సీఎం కార్యాలయాలతోపాటు అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు అన్నీ అమరావతిలో ఉన్నప్పుడు సెక్షన్ 8 సమస్య ఎలా ఉత్పన్నమవుతుంది? ఆ సెక్షన్‌కు కాలం చెల్లినట్టేకదా? దేశంలో కాలంచెల్లిపోయిన చాలా చట్టాలు ఉన్నాయని, వాటిని తొలిగించాల్సిన అవసరం ఉన్నదని లా కమిషన్ ఎప్పటికప్పుడు మనకు గుర్తుచేస్తుంటుంది' అని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుత సచివాలయ భవనాలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నవీకరిస్తూ మరమ్మతులకు కోట్ల రూపాయలు ఖర్చుచేసిందని, ఇప్పుడు కూడా అవసరాలకు తగినట్టు మరమ్మతులు చేయాలని పిటిషనర్లు తెలుపగా.. ఏయే భవనాలను ఎప్పుడు నవీకరించారు? అందుకు ఎప్పుడు ఎంత ఖర్చుచేశారు? అనే వివరాల్లేకుండా పిటిషనర్లు అస్పష్ట వాదనలు చేస్తున్నారని ధర్మాసనం ఆక్షేపించింది.

## 41ఏ సీఆర్పీసీపై 20న సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోలీసులకే స్టేషన్‌బెయిల్ ఇచ్చే అధికారాన్ని కల్పిస్తున్న సీఆర్పీసీ 41ఏ (సవరణ)పై చర్చించి కార్యాచరణ ప్రణాళికపై నిర్ణయం తీసుకొనేందుకు రాష్ట్రంలోని అన్ని కోర్టుల బార్ అసోసియేషన్ల కార్యదర్శులు, అధ్యక్షులు, రాష్ట్ర బార్ కౌన్సిల్‌సభ్యులతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించాలని బార్ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ నెల 20న హైకోర్టులోని బార్‌కౌన్సిల్‌లో సంయుక్త సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నర్సింహారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఆర్పీసీ 41ఏ (సవరణ)పై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

- సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్ కింద ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగసంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు టీవీ ప్రసాద్, డీ కమలాకర్ సోమవారం సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో జీవో ఎంఎస్ 653 ద్వారా సీపీఎస్ పథకాన్ని తీసుకువచ్చారని, దీనివల్ల గ్రాట్యుటీ, పెన్షన్‌ను కోల్పోతున్నామన్నారు.

## మాపై విమర్శలు బాధించాయి

- ఆర్టీసీ అధికారుల సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకే నడుచుకొంటున్నామని ఆర్టీసీ అధికారుల సంఘం స్పష్టంచేసింది. రేయింబవళ్లు బస్సుల రవాణా విషయంలో కృషిచేస్తున్న తమపై విమర్శలు రావటం బాధాకరమని ప్రకటించింది. బస్సులు నడవటంలో చొరవ చూపడంలేదంటూ తమ పనితీరుపై అవాస్తవమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని తెలిపింది. ప్రాణాలర్పించిన శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌గౌడ్‌కు నివాళులర్పిస్తున్నట్టు వెల్లడించింది. ఆర్టీసీ కార్మికులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ అధికారుల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది.

## 'రియల్' మేనేజర్లకు ప్రత్యేక కోర్సు

- ఐఐఎం బెంగళూరుతోకలిసి ప్రారంభించిన క్రెడాయ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఐఎం బెంగళూరుతో కలిసి క్రెడాయ్ ప్రప్రథమంగా రియల్ రంగంలోని మధ్యస్థాయి మేనేజర్లకు ప్రత్యేకకోర్సును ప్రారంభించింది. భారతదేశ నిర్మాణరంగంలో సుమారు ఐదునుంచి పదిహేనేండ్ల అనుభవం గల వారు ఈ కోర్సులో చేరడానికి అర్హులని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు జక్సేషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 31లోగా దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. నవంబర్ 11 నుంచి 14 వరకు ఈ కోర్సును నిర్వహించనున్నట్టు చెప్పారు. వివరాలకు 9911639410, 8588936494 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## శాస్త్రవేత్తల కృషి ఫలితమే 'చంద్రయాన్-2'

- అంతరిక్షంలో ఉన్న అనుభూతి కలిగింది
- 'డోమ్ డిజిటల్ అస్ట్రనామికల్ ఫెసిలిటీ' ప్రారంభంలో గవర్నర్ తమిళిసై

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేల మంది శాస్త్రవేత్తల కృషి ఫలితమే 'చంద్రయాన్-2' ప్రయోగమని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ చెప్పారు. చంద్రయాన్-2 కోసం పనిచేసిన వారిందరినీ ప్రశంసించాల్సిన అవసరం ఉన్నదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో ఏర్పాటుచేసిన 'డోమ్ డిజిటల్ అస్ట్రనామికల్ ఫెసిలిటీ'ని గవర్నర్ ప్రారంభించి మాట్లాడారు. డోమ్ డిజిటల్ అస్ట్రనామికల్ ఫెసిలిటీ ద్వారా చంద్రయాన్-2 ప్రయోగ విధానాన్ని తిలకించడం ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. దీని ద్వారా చంద్రుడిపైకి వెళ్లిన అనుభూతి కలిగిందని సంతోషం వ్యక్తంచేశారు. చంద్రయాన్-2 కోసం పనిచేసిన శాస్త్రవేత్తలకు ప్రజలందరూ కృతజ్ఞతలు తెలుపాలని సూచించారు. ఈ ప్రయోగం ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తిని రేకెత్తించిందన్నారు. మనమందరం భారతీయులమైనందుకు గర్వపడాలని అన్నారు. బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ డీజీ సిద్ధార్థ్ మాట్లాడుతూ.. డోమ్ డిజిటల్ అస్ట్రనామికల్ ఫెసిలిటీ అనేది ఒక డిజిటల్ ప్రొజెక్షన్ సిస్టం అని స్పష్టంచేశారు. దీనిద్వారా అంతరిక్ష చిత్రాలను ఎంతో స్పష్టంగా చూడగలుగుతామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం రూ.4 కోట్లు వెచ్చించి దీనిని సిద్ధం చేశామని చెప్పారు. దీని ద్వారా వీక్షిస్తే పూర్తిగా చంద్రుడి వద్ద ఉన్న అనుభూతి కలుగుతుందన్నారు.

## హెచ్‌ఏఎల్ ఉద్యోగుల సమ్మె బాట

చట్ట విరుద్ధం: యాజమాన్యం

**బెంగళూరు:** వేతన సవరణతోపాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హిందూస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఉద్యోగులు సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. అఖిల భారత హెచ్‌ఏఎల్ కార్మిక సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ సూర్యదేవర చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ యాజమాన్యంతో చర్చలు విఫలమైనందువల్లే తాము సమ్మె చేపట్టామని పేర్కొన్నారు. దేశంలోని తొమ్మిది హెచ్‌ఏఎల్ యూనిట్లలో సమ్మె సాగుతున్నదన్నారు. ఉద్యోగుల ఆందోళన చట్ట విరుద్ధం అని హెచ్‌ఏఎల్ పేర్కొన్నది. సమ్మెలో పాల్గొన్న వారిపై చర్యలు ఉంటాయని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

Telangana State Co-operative Marketing Federation Ltd.,
5-2-68, 3rd Floor, Mahatma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderabad- 095. Ph: 040-24607106.
E-mail: enggtgmarkfed@gmail.com
Webpage: www.tsmarkfed.com
CORRIGENDUM
It is to inform that a tender notification was published in Namasthe Telangana State edition on 27-09-2019 for lease of TSMARKFED godowns. Due to administrative reasons, the last date for submission of tenders is extended upto 12:00 Noon 18-10-2019.
Sd/- MANAGING DIRECTOR

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, నాగర్‌కర్నూల్
డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయుటకు ఆసక్త వ్యక్తీకరణ కోరుతూ ప్రకటన
No. DB3/RURBAN/2019 తేది: 05-10-2019
దిగువ పనుల కొరకు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) తయారు చేయుటకు ప్రముఖ కన్సల్టెన్సీ సర్వీసులు /సంస్థల నుండి కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్, నాగర్‌కర్నూల్ తరపున సీలు కొటేషన్లు కోరబడుతున్నవి. 1) పెద్ద కొత్తపల్లి మండలం వద్ద ఫిష్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్, యూనిట్ అంచనా వ్యయం: రూ. 100 లక్షలు. 2) పెదకొత్తపల్లి మండలంలో జిల్లాలో ప్రధానంగా లభించే మామిడి పండ్లకు ప్రాధాన్యత ఇస్తూ ఇంటిగ్రేటెడ్ పోస్ట్ హార్వెస్టింగ్ సదుపాయాలు /కట్టడాలు (కోల్డ్ స్టోరేజ్ గోడౌను మరియు ప్రాసెసింగ్ యూనిట్). అంచనా వ్యయం: రూ. 400 లక్షలు. 3) పెద్దకొత్తపల్లి మండలంలో మామిడి రైతులకు మార్కెటింగ్ సదుపాయాల ఏర్పాటు. అంచనా వ్యయం: రూ. 110 లక్షలు. సంప్రదించు నం. 9121136660. మెయిల్ ఐడి: eeprngkl@yahoo.co.in
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, PIU, నాగర్‌కర్నూల్
DIPR RO. No. 1369-DP/CL/Advt/1/2019-20, Dt: 14/10/2019

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.
ఆసక్తి వ్యక్తీకరణ
చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వేవారు CGHS 2014 రేట్లు లేదా ఇతర విధంగా క్రెడిట్ ప్రాతిపదికన డివిజన్ అంతటా తమ లబ్ధిదారులకు సమగ్ర ఎమర్జెన్సీ కేర్ ఏర్పాటు చేయుటకు హెల్త్ కేర్ ప్రొవైడర్ల కొరకు చూస్తున్నారు.
1. హెల్త్ కేర్ ప్రొవైడర్లు దిగువ తెలిపిన రైల్వే కాలనీలకు దగ్గరగా ఉండవలెను మరియు వారు సమీప పట్టణం లేదా నగరంలో కూడా ఉండవచ్చును.
a. డోర్నకల్ జంక్షన్
b. భద్రాచలం రోడ్ (కొత్తగూడెం)
c. వికారాబాద్
d. పర్లి వైద్యనాథ్ (పర్లి)
e. రామగూడెం
f. బెల్లంపల్లి
g. కరీంనగర్
2. నియమ నిబంధనలు
a. ఎంపానెల్‌మెంట్ చెల్లుబాటు రెండు సంవత్సరాలపాటు ఉంటుంది మరియు పరస్పరం అంగీకరించిన నియమాలపై రెన్యువల్ చేయబడుతుంది.
b. సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే నుండి డాక్టర్ల తనిఖీ బృందంచే సర్టిఫికేషన్ మరియు సమర్థ ప్రాధికారి ఆమోదానికి లోబడి ఎంపానెల్‌మెంట్ ఉంటుంది.
c. సమర్థ ప్రాధికారి నిర్ణయం తుదిగా ఉంటుంది.
3. రేట్లు మరియు సర్వీసెస్
a. 10% రిబేటుతో CGHS 2014 టారిఫ్
b. CGHS 2014 క్రింద జాబితా చేయబడని వారి పరిశోధనలు/ విధానాలు/ ప్యాకేజీలు 25% డిస్కౌంట్‌తో ఎంపానెల్డ్ హాస్పిటల్ టారిఫ్ ప్రకారం బిల్ చేయబడతాయి.
c. ఆసక్తిగల ఆసుపత్రి/లు, NABH గుర్తింపు పొందిన ఆసుపత్రా లేదా నాన్-NABH (నేషనల్ బోర్డ్ ఫర్ ఎక్రిడిటేషన్ ఆఫ్ హాస్పిటల్స్) గుర్తింపు పొందిన ఆసుపత్రా అనేది తెలియజేయాలి.
d. మెడిసిన్స్‌పై 10% డిస్కౌంట్
e. రైల్వే లబ్ధిదారుల రవాణా కొరకు ఎంపానల్డ్ ఆసుపత్రులు ఉచిత అంబులెన్స్ సేవలను ఏర్పాటు చేయాలి.
f. తమ ఆసక్తి (EOI)ని దాఖలు చేసిన ఆసుపత్రులలో సదుపాయాలను పరిశీలించడానికి రైల్వే డాక్టర్ల బృందం తనిఖీ చేస్తుంది.
g. ఈ ప్రకటన ప్రచురణ నుండి 14 రోజులలోగా వారు స్పందించవలెను.
4. ఆసక్తిగల పార్టీలు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, రైల్వే హెల్త్ యూనిట్ కాంపౌండ్, చిలకల్‌గూడ, సికింద్రాబాద్-500025, తెలంగాణ రాష్ట్రం వారికి దరఖాస్తు చేసుకోవాలి.
5. తదుపరి వివరాలను కార్యాలయ వేళలలో ఏదేని పని రోజున పైన తెలిపిన కార్యాలయం నుండి పొందవచ్చును. ఫోన్ నం. 040-27545685, ఇమెయిల్:cmssc1500@gmail.com.
చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సికింద్రాబాద్
A1669

## ఎన్ఐవోఎస్ పరీక్ష ఫీజు గడువు తేదీ 31

**హైదరాబాద్:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐవోఎస్)లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌చేస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులు సప్లిమెంటరీ పరీక్ష చెల్లింపునకు గడువును ఈ నెల 31గా నిర్ణయించినట్టు ఆ సంస్థ ప్రాంతీయకేంద్రం సంచాలకుడు అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు రూ.250 చొప్పున ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు http://dled.nios.ac.in, www.nios.ac.in ను సంప్రదించాలని సూచించారు. ఫీజు చెల్లింపులో ఇబ్బందులు తలెత్తితే ప్రాంతీయకేంద్రం నంబర్లు 040-24752859, 24750712లో సంప్రదించాలని కోరారు.

## హుజూర్‌నగర్‌లో సీపీఐ మద్దతు ఉపసంహరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉపఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రకటించిన మద్దతును ఉపసంహరించుకుంటున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు మద్దతుపై చర్చించారు. ఉప ఎన్నికలో టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని గతంలో నిర్ణయించామని..హక్కులు, డిమాండ్లపై పది రోజులుగా సమ్మెచేస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి న్యాయబద్ధంగా లేదని సమావేశం అభిప్రాయపడింది. ఉపఎన్నికల్లో ఎవరికి మద్దతివ్వాలనే అంశంపై మంగళవారం హుజూర్‌నగర్‌లో సమావేశం ఏర్పాటుచేసి నిర్ణయిస్తామని చాడ వెంకటరెడ్డి స్పష్టంచేశారు.

# రాష్ట్రంలో మెరుగైన పశువైద్యం

- సత్ఫలితాలిస్తున్న సంచార పశువైద్యశాలలు
- మరో 100 వాహనాలకు పశుసంవర్ధకశాఖ ప్రతిపాదనలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పశువైద్యం మెరుగుపడింది. పశువైద్యానికి దేశంలోనే తొలిసారి ప్రవేశపెట్టిన సంచార వైద్యశాలలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 100 సంచార పశువైద్యశాలలను ఏర్పాటుచేయడంతోపాటు వాటి ద్వారా కేవలం రెండేండ్లలోనే లక్షల పశువులకు శస్త్రచికిత్సలు, ప్రాథమిక వైద్య చికిత్సలు నిర్వహించింది. అనారోగ్యంతో బాధపడుతున్న పశువుల వద్దకే వెళ్లి వాటికి అత్యవసర సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మరో 100 సంచార పశువైద్య వాహనాలను అందుబాటులోకి తీసుకురానున్నది. ఇందుకోసం పశుసంవర్ధకశాఖ ప్రతిపాదనలు రూపొందించిం ది. ఈ 100 సంచార పశువైద్యశాలలను ఆర్‌కేవీవై కింద 60:40 వాటా నిధులతో మం జూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. రాష్ట్రంలో తొలిసారిగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 2017 సెప్టెంబర్‌లో గ్రామీణ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 100 సంచార పశువైద్యశాలలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. వీటికి విస్తృత ఆదరణ లభించడంతో పశువులకు సకాలంలో మంచి వైద్యం అందుతున్నది. ఈ వాహనాలు ఒకే సమయంలో అన్నిచోట్లకు వెళ్లలేకపోతుండటంతో మరో 100 వాహనాలు అందుబాటులోకి తీసుకురావాలని పశుసంవర్ధకశాఖ భావిస్తున్నది. ఒక్కో నియోజకవర్గానికి రెండు సంచార వైద్యశాల లు ఉంటే మరింత మెరుగైన వైద్యం అందిం చే అవకాశాలుంటాయని అధికారులు భావిస్తున్నారు. పశువులకు ఏదైనా చికిత్స అవసరమైనప్పుడు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేస్తే సంచార వాహనాన్ని పంపిస్తారు. ఈ వాహనాల ద్వారా పశువులకు చిన్న చికిత్సల నుంచి శస్త్రచికిత్సల వరకు వివిధరకాల వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రతి వాహనంలో ఒక పశువైద్యాధికారి, ఒక వెటర్నరీ కంపౌండర్ ఉంటారు. పశువులకు శస్త్రచికిత్స అవసరమైతే సంబంధిత వైద్యనిపుణుడిని వాహనంలో పంపిస్తున్నారు. ప్రతి వాహనంలో మందులతోపాటు శస్త్రచికిత్సకు అవసరమయ్యే పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ సంచార వైద్యశాలకు రైతుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ సంఖ్య విపరీతంగా పెరుగటంతో వాటిని స్వీకరించేందుకు రాష్ట్ర కార్యాలయంలో 30 సీట్ల కాల్‌సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ప్రాథమిక పశువైద్యశాలలు అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి రైతులు ఫోన్‌చేస్తే మూగజీవాలను సమీపంలోని పశువైద్యశాలకు పంపి చికిత్సలు అందిస్తున్నారు. ప్రధానంగా దూడల్లో నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు వేయడం, పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, గొర్రెలు, మేకలు, పెరటికోళ్ల అభివృద్ధికి తోడ్పాటునందించడం లాంటి సేవలను ఈ సంచార పశువైద్యశాలల ద్వారా అందిస్తున్నారు.

# 'ఫ్యాన్సీ'గా కుచ్చుటోపి

- ఎయిర్‌టెల్ సీఈవోనంటూ మోసాలు
- రాజకీయ నాయకులే లక్ష్యం
- నిందితుడు రాజమండ్రికి చెందిన దీపుబాబు
- బెంగళూరులో అరెస్ట్ చేసిన సైబర్‌క్రైం పోలీసులు



నిందితుడు దీపుబాబు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఎయిర్‌టెల్ సీఈవోనంటూ చెప్పి మొబైల్ ఫ్యాన్సీ నంబర్లను తక్కువ ధరకు ఇస్తానంటూ నమ్మిస్తూ కుచ్చుటోపీ పెడుతున్న వ్యక్తిని సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్ట్‌చేశారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన మద్దెల దీపుబాబుగా గుర్తించారు. బెంగళూరు నుంచి నగరానికి తీసుకొచ్చి కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకొని విచారించగా పలు ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీసీఎస్ జాయింట్ సీపీ అవినాశ్ మహంతి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన జానకీరామ్మోహన్ అనే వ్యక్తికి గత నెల 19న మొబైల్ ఫ్యాన్సీ నంబర్లు కావాలా? 9899999999, 9123456789, 9999999099, 9999999999 నంబర్లను తక్కువ ధరకే అంటూ గుర్తుతెలియని ఫోన్ నుంచి మెసేజ్ వచ్చింది. ఆ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా.. అవతలి వ్యక్తి తన పేరు గోపాల్ అని, ఎయిర్‌టెల్ కంపెనీకి సీఈవోనంటూ పరిచయం చేసుకొన్నాడు. ఫ్యాన్సీ నంబర్లపై ఇద్దరు మాట్లాడుకొని చేసుకొన్న ఒప్పందం ప్రకారం రూ.45,800 నగదును అతడు సూచించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశాడు. డబ్బు డిపాజిట్ అయిన తరువాత సదరు వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించిన జానకీరామ్మోహన్.. సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ బీ మధుసూదన్ నేతృత్వంలోని బృందం దర్యాప్తుచేపట్టి నిందితుడు బెంగళూరులో నివాసముంటున్నట్టు గుర్తించి గతనెల 30న అరెస్ట్ చేసి నగరానికి తరలించారు.

**ఎమ్మెల్యేలు, ఎంపీలే లక్ష్యంగా!**

నిందితుడు మద్దెల దీపుబాబు 2014 నుంచి మొబైల్ ఫ్యాన్సీ నంబర్ల పేరుతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ కంపెనీల డైరెక్టర్లే లక్ష్యంగా మోసాలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. ప్రజాప్రతినిధులకు ఫోన్‌చేసి ఎయిర్‌టెల్ సీఈవోనంటూ పరిచయం చేసుకోవడం, తక్కువ ధరకే ఫ్యాన్సీ నంబర్లు ఇస్తామంటూ బురిడీ కొట్టించడం పనిగా పెట్టుకొన్నాడు. ఫోన్ చేస్తున్న వ్యక్తి నిజంగా ఎయిర్‌టెల్ సీఈవో గోపాల్ అని భ్రమపడేట్టుగా ట్రూకాలర్ ఐడీని ఫీడ్ చేయడం, బ్యాంకు ఖాతా పేరును ఎయిర్‌టెల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అని చెప్పుండటంతో చాలామంది ఇట్టే ఇతగాడి మాటలు నమ్మి మోసపోయారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేటర్లకు ఫోన్ చేశాడు. ఇతడి వలకు చిక్కిన ఎమ్మెల్యే ఒకరు రూ.3లక్షలు, ఎమ్మెల్సీ ఒకరు రూ.2లక్షల వరకు సమర్పించుకొన్నట్టు పోలీసుల విచారణలో బయటపడింది. మోసపోయిన ప్రజాప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో మరింత మందిని మోసం చేసే అవకాశం దీపుబాబుకు వచ్చింది.

## సఫాయి కర్మచారీలకు 8,500 వేతనం

మొదటిపేజీ తరువాయి...

పనిచేస్తున్న వారందరికీ సీఎం కేసీఆర్ హామీ మేరకు వేతనాలు పెరిగాయి. ఇక నుంచి వీరికి నెలకు రూ.8,500 చొప్పున చెల్లిస్తూ అందరినీ ఫుల్‌టైం వర్కర్లుగా గుర్తించి పనిచేయించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వసూచనలకు అనుగుణంగా అత్యధికంగా ఎంతమందిని విధుల్లోకి తీసుకోవాలో నిర్ణయించాలని సూచించారు. అన్ని గ్రామపంచాయతీల్లో శానిటరీ, మల్టీపర్పస్ వర్కర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించుకునేందుకు మార్గదర్శకాలను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయంలో పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

**తొలగనున్న ఇబ్బందులు**

అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న 25 వేల మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం వేతనాలు పెంచింది. ఇటీవల 30 రోజుల పల్లె ప్రణాళిక కార్యాచరణ అమలు సందర్భంగా సఫాయి కర్మచారీల వేతనాలు పెంచేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఏండ్ల తరబడి అతి తక్కువ వేతనాలతో.. అవికూడా నెలనెలా అందక ఇబ్బందులు పడుతున్న సఫాయి కర్మచారీలకు ప్రయోజనం కలుగనున్నది. ప్రభుత్వం ప్రతినెలా పంచాయతీలకు రూ.339 కోట్లు ఇస్తుండటంతో కార్మికులకు వేతనాలు సక్రమంగా అందనున్నాయి.

**మార్గదర్శకాలు ఇలా..**

- 500 మంది జనాభాకు ఒక వర్కర్ చొప్పున ప్రతి పంచాయతీలో కనీసం ఇద్దరు చొప్పున ప్రస్తుతం పనిచేస్తున్న వర్కర్లను కొనసాగించాల్సి ఉంటుంది.
- పంచాయతీలో ట్రాక్టర్ అవసరం ఉన్నందున వీరిలో ఒకరికి డ్రైవర్‌గా శిక్షణ ఇస్తారు. ప్రాథమికంగా పారిశుద్ధ్యం పనులతోపాటు అప్పగించే ఇతర పనులను మల్టీపర్పస్ వర్కర్లు చేయాల్సి ఉంటుంది.
- మార్గదర్శకాల ప్రకారం మల్టీపర్పస్ వర్కర్లను తీసుకున్నారా లేదా అనే దానిపై ఎంపీడీవోలు గ్రామపంచాయతీ తీర్మానాలను, వర్కర్ల పేర్లను పరిశీలించాలి.
- ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంతమంది కార్మికులు అవసరమో డీఎల్పీవోల ద్వారా ఎంపీడీవోలు కలెక్టర్లకు నివేదిక ఇవ్వాలి. పంచాయతీకి చెందినవారినే మల్టీపర్పస్ వర్కర్లుగా తీసుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామపంచాయతీల తీర్మానాల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకోవాలి.



వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. వరుసగా సెలవులు రావడంతో రాజన్నను భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రద్దీ దృష్ట్యా ఆర్జితసేవలను రద్దుచేశారు. గండదీపం, పల్లకీ సేవలు, పెద్దసేవలు, కల్యాణ, కోడె మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. దాదాపు 20 వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకోగా సుమారు రూ.17 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు.

- వేములవాడ కల్చరల్

## పూజల పేరుతో బంగారం చోరీ

**వట్‌పల్లి:** పూజలు చేసి జాతకం మారుస్తామని మాయమాటలు చెప్పి ఓ అపరిచితవ్యక్తి ఓ మహిళ వద్ద ఆరుతులాల బంగారంతో ఉడాయించాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం నాగులపల్లిలో సోమవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన పెద్దగొల్ల శివ్వయ్య- శివలక్ష్మి దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరి కుమారుడు దత్తు పనిచేయకుండా తిరుగుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం శివలక్ష్మి ఇంటికి ఓ అపరిచిత వ్యక్తి వచ్చి పూజ చేస్తే కొడుకు జాతకం మారిపోతుందని శివలక్ష్మిని నమ్మించాడు. ఇంట్లో ఉన్న బంగారం తెచ్చి పూజలో ఉంచాలని శివలక్ష్మికి చెప్పగా ఆమె ఆరుతులాల బంగారం తెచ్చి అతడు చెప్పిన డబ్బాలో పెట్టింది. పూజముగిసిన అనంతరం బంగారం ఉన్న డబ్బాను ఆమెకు ఇచ్చి దేవుడి గదిలోకి పెట్టాలని చెప్పి సదరు వ్యక్తి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి డబ్బాతెరిచి చూడగా అందులో బంగారం కనిపించకపోవడంతో మోసపోయానని గ్రహించి సోమవారం విషయం భర్త శివ్వయ్యకు తెలపడంతో అపరిచిత వ్యక్తి కోసం పలుచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో వట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు.

## అమెరికా మారథాన్‌లో గండ్ర జ్యోతికి మెడల్

**శాయంపేట:** అమెరికాలోని చికాగోలో భారత కాలమాన ప్రకారం ఆదివారం జరిగిన మారథాన్‌లో వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పాల్గొని మెడల్ సాధించారు. చికాగో మారథాన్ రేసులో 42.2 కిలోమీటర్ల దూరాన్ని 5 గంటల 16 నిమిషాల 19 సెకన్లలో ఆమె పూర్తి చేసి మెడల్ దక్కించుకున్నారు. గతంలో అమెరికా మారథాన్, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఆఫ్ మారథాన్‌లోనూ గండ్ర జ్యోతి పాల్గొని మెడల్స్ సాధించారు.



అమెరికా మారథాన్‌లో సాధించిన మెడల్‌ను చూపిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి



# చట్టప్రకారమే లీజు

- ఆర్టీసీ సమ్మె పరిష్కారమవుతుందంటే రద్దు చేసుకుంటా
- వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్



**వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** వరంగల్ టైర్ రీట్రేడింగ్ సెంటర్ లీజు వ్యవహారం చట్ట విరుద్ధమేమీ కాదని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ తెలిపారు. తమపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని ఆయన కొట్టిపారేశారు. టైర్ రీట్రేడింగ్ సెంటర్ లీజు తీసుకున్న తీరును ఆయన మీడియాకు వివరించారు. ఆర్టీసీ మూడుసార్లు టెండర్లు పిలిచిందని, మొదటి రెండుసార్లు ఎవరూ ముందుకు రాలేదన్నారు. మూడోసారి మాత్రం తన భార్య జయరాణి నిర్వహిస్తున్న మెస్సర్స్ రోని భారత్ గ్యాస్ సంస్థకు ఈ టెండర్ రావడం వెనుక తన ప్రమేయం ఏమీ లేదని, ఆర్టీసీ నిబంధనల ప్రకారం చట్ట ప్రకారమే అన్ని జరిగాయన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యమం నుంచి వచ్చిన మహానాయకుడని, ప్రజల కష్టసుఖాలు, కార్మికుల కష్టసుఖాలు అన్నీ తెలిసిన మనసున్న నాయకుడని పేర్కొన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాలన్నదే సీఎం కేసీఆర్ ధ్యేయమన్నారు. చట్ట ప్రకారం అత్యధిక బిడ్‌తో కోట్ చేసి సాధించుకున్న ఈ టైర్ రీట్రేడింగ్ సెంటర్ లీజును రద్దు చేసుకుంటే.. మొత్తం ఆర్టీసీ సమస్య పరిష్కారం అవుతుందంటే తానే ముందుండి తన భార్యను ఒప్పిస్తానని ఆయన స్పష్టం చేశారు.

## జనవరి నుంచి భగీరథ నీరందించాలి

- మంత్రి గంగుల కమలాకర్ ఆదేశం



కరీంనగర్ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్ కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో మిషన్ భగీరథ పనులను డిసెంబర్ 15 నాటికి పూర్తిచేసి వచ్చే జనవరి ఒకటి నుంచి ప్రజలకు నీటిని అందించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిషన్ భగీరథ పనులపై నగరపాలక, ఆర్‌డబ్ల్యూఎస్, భగీరథ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. డిసెంబర్ 15 నాటికి పనులు పూర్తిచేసి, ట్రయల్ రన్ నిర్వహించి, జనవరి ఒకటి నుంచి నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. వివిధ రోడ్ల అభివృద్ధి పనుల్లో పైపులైన్లు, ఇతర పనులు పూర్తి చేసుకోవాలనీ, ఆ తర్వాతే రోడ్లు వేయాలన్నారు. సమావేశంలో నగర కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అబార్షన్ మాత్రలు వికటించి..

- అస్వస్థతకు గురై యువతి మృతి

**రెంజల్:** నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం దూపల్లిలో అబార్షన్ మాత్రలు వికటించడంతో మూడు నెలలుగా అస్వస్థతకు గురైన ఓ యువతి సోమవారం మృతిచెందింది. దూపల్లికి చెందిన రూప (18) బీడీలు చుట్టి జీవనం సాగించేది. అదే గ్రామానికి చెందిన దాస్ అనే యువకుడు మాయమాటలు చెప్పి రూపను లొంగదీసుకోవడంతో ఆమె గర్భం దాల్చింది. ఈ విషయం దాస్‌కు చెప్పగా.. అబార్షన్ చేయించుకోవాలని సలహా ఇచ్చాడు.



రూప (ఫైల్)

అతడి సలహామేరకు మూడు నెలల క్రితం రూప అబార్షన్ మాత్రలు వేసుకోగా అవి వికటించాయి. దీంతో తీవ్ర రక్తస్రావం కారణంగా ఆరోగ్యం క్షీణించింది. పరీక్షించిన స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రూప తల్లిదండ్రులు మొదట నిజామాబాద్‌కు తరలించి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొంది ఇంటికి చేరుకున్న రూప అప్పుడప్పుడు కడుపు నొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున కడుపునొప్పి తీవ్రం కావడంతో మృతి చెందింది.

## హైదరాబాద్, ఖమ్మంలో వర్షం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/ఖమ్మం వ్యవసాయం:** క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో సోమవారం గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం 6 వరకు ఆసిఫ్‌నగర్‌లో 0.9 సెం.మీ., ఖైరతాబాద్‌లో 0.8 సెం.మీ., హిమాయత్‌నగర్‌లో 0.6 సెం.మీ. వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాగల 36 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మంలో తేలికపాటి జల్లులు , ముదిగొండ, కల్లూరు, ఖమ్మం రూరల్, మధిర, పాలేరు నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ముదిగొండ మండలంలో 1.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

## అంత్యక్రియలకు వెళ్లొస్తూ..

**బస్సు-ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళల మృతి.. 16 మందికి గాయాలు**

**కంది:** అంత్యక్రియలకు వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా, 16 మంది గాయపడ్డారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కులబ్‌గూర్ శివారు సదాశివనగర్ వద్ద చోటుచేసుకున్నది. పుల్కల్ మండలం చౌటకూర్‌కు చెందిన 19 మంది టాటాఏస్ వాహనంలో కొండాపూర్ మండలం గొల్లపల్లిలో తమ బంధువు అంత్యక్రియల కోసం సోమవారం ఉదయం వెళ్లారు. అంత్యక్రియలు ముగిసిన తర్వాత తిరిగొస్తుండగా కులబ్‌గూర్ శివారు సదాశివనగర్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడ్డ అత్తాకోడండ్లు బుచ్చి భాగ్యమ్మ (50), బుచ్చి చంద్రకళ (42) చికిత్స పొందుతూ మృతిచెందారు. మరో 16 మంది గాయపడగా, వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు.

## లారీ క్లీనర్ పైశాచికం

జ్వరంతో ఉన్న బాలికపై లైంగిక దాడి



బాలగొమ్మి సాయి

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఓ లారీ క్లీనర్‌గా పైశాచికంగా ప్రవర్తించాడు. జ్వరంతో బాధపడుతూ ఇంట్లో ఉన్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లి గమనించి కేకలు వేయడంతో అక్కడినుంచి ఉడాయించాడు. ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన ఓ మహిళ కూతురు(7)తో కలిసి పుట్టింట్లో ఉంటున్నది. బాలికకు జ్వరం రావడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా చిన్నారి తల్లి, అమ్మమ్మ కూలి పనులకు వెళ్లారు. సమీపంలో ఉండే లారీ క్లీనర్ బాలగొమ్మి సాయి (23) ఇంట్లోకి వెళ్లి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా.. అప్పుడే వచ్చిన ఆమె తల్లి కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్సీ, ఎస్టీ, లైంగిక దాడి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## రోడ్డుపై చెత్త వేసినందుకు జరిమానా

**కల్వకుర్తి, నమస్తేతెలంగాణ:** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి బస్‌డిపో ఎదురుగా చెత్త వేసినందుకు గృహ యజమాని సందీప్‌కు అధికారులు రూ.500 జరిమానా విధించారు. సందీప్ ఇంట్లోని పనిమనిషి చెత్తను సంచుల్లో మూటగట్టి బస్‌డిపో ఎదురుగా పడేసింది. అక్కడే ఉన్న పోలీసులు ఆ దృశ్యాన్ని ఫొటోలు తీసి మున్సిపల్ అధికారులకు పంపించడంతో వారు స్పందించి ఇంటి యజమానికి 500 జరిమానా విధించి రసీదు ఇచ్చారు.

# ఆగని ప్రగతి చక్రం



గోదావరి ఖనిలో డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష..

## యథావిధిగా నడిచిన బస్సులు

- పదోరోజు రోడ్డెక్కిన 54 శాతం వాహనాలు
- కనిపించని సమ్మె ప్రభావం..
- పక్కా ఏర్పాట్లతో ప్రజలకు తొలగిన ఇబ్బందులు



సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసిన నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ప్రగతి రథ చక్రం ఆగకుండా పరుగులు తీస్తున్నది. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె పదో రోజు కూడా బస్సులను యథావిధిగా నడిపించిన యంత్రాంగం.. ప్రయాణికులను సురక్షితం గా గమ్యస్థానాలకు చేరవేసింది. ప్రభుత్వ ప్రత్యా మ్నాయ ఏర్పాట్లతో ప్రజారవాణాకు ఆటం కం లేకుండాపోయింది. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల ద్వారా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 54 శాతం బస్సులు నడిపించింది. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతోపాటు మెకానిక్ ఇతర సిబ్బంది నియామకం ద్వారా నూరు శాతం బస్సులు నడిచేలా కృషి చేస్తున్నది.

### ఆయా జిల్లాల్లో..

సోమవారం ఆదిలాబాద్ డిపో పరిధిలో 70 శాతం.. ఉట్నూర్ డిపో పరిధిలో 80 శాతం ఆర్టీసీ, అద్దె బస్సులు రాకపోకలు సాగించాయి. నిర్మల్, భైంసా డిపోల పరిధి నుంచి 77 ఆర్టీసీ బస్సులు, 79 అద్దె బస్సులు, 90 ప్రైవేటు వాహనాలు నడిచాయి. నల్లగొండ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 292 బస్సుల్లో 70వేల మంది ప్రయాణించా రు. సూర్యాపేట జిల్లాలోని కోదాడ డిపో పరిధిలో 71 ఆర్టీసీ బస్సులు, 15 స్కూల్ బ స్సులు నడిచాయి. సూర్యాపేట డిపో పరిధిలో 58 ఆర్టీసీ, 45 అద్దెబస్సులతోపాటు 12 స్కూల్ బస్సులు నడిచాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 110 బస్సులను నడిపినట్టు జిల్లా రవాణాశాఖ అధికారి వై సురేందర్‌రెడ్డి తెలిపారు. వరంగల్ రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోల నుంచి 643 బస్సులు సోమవారం ప్రయాణికులకు సేవలందించాయని రీజినల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. కరీంనగర్ రీజియన్‌లో సోమవారం 587 (87.61 శాతం) బస్సులు నడిచాయి. 13 బస్సుల్లో టిమ్ మెషిన్లతో టికెట్లు అందించగా, 43 బస్సుల్లో సాధారణ టికెట్ల ద్వారా చార్జీలు స్వీకరించారు. జనగామ డిపో పరిధిలోని బస్సుల్లో టికెట్లు ఇచ్చేలా ఏర్పాటు చేశారు. మెదక్ రీజియన్ పరిధిలోని 8 డిపోల పరిధిలో 523 బస్సులు, మహబూబ్‌నగర్ జిల్లాలో 58 ఆర్టీసీ, 35 అద్దె బస్సులు, మరో 20 ప్రైవేటు వాహనాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 226 బస్సులు నడవగా, నారాయణపేట జిల్లాలో 69 బస్సులు తిరిగాయి. రంగారెడ్డి జిల్లాలోని 11 డిపోల పరిధిలో 1,217 వాహనాలు, వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి 183 బస్సులు నడిచాయి.

### ఖమ్మంలో బంద్ ప్రశాంతం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ కార్మిక జేఏసీ, అఖిలపక్ష నేతలు సోమవారం తలపెట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఆర్టీసీ కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా చూసింది. ఉదయం 4 నుంచి సాయంత్రం 6 వరకు, రాత్రి 8 నుంచి అర్ధరాత్రి 12 వరకు హైదరాబాద్‌కు ప్రైవేటు వాహనాలను నడిపించింది. ఖమ్మం జిల్లాలో 20 ప్రైవేట్ బస్సులు, 60 మ్యాక్సీక్యాబ్‌లు నడిచాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బంద్ ప్రశాంతంగా జరిగింది.

### ఆత్మహత్యాయత్నం..

సెంట్రల్ యూనివర్సిటీ బస్‌డిపోకు చెందిన కండక్టర్ సందీప్ బ్లేడుతో తన చేయిని కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గచ్చిబౌలి పోలీసులు సందీప్‌ను కొండాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. కాగా కార్వాన్ బాంజావాడిలో నివసించే సురేందర్‌గౌడ్ (46) అనే కండక్టర్ ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా, సోమవారం ఉదయం అతని భౌతికకాయానికి ఉస్మానియా దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు.

### కార్మికుల పక్షాన ప్రభుత్వం: మంత్రి ఎర్రబెల్లి



ఆర్టీసీ సమ్మెను కాంగ్రెస్, బీజేపీలు రాద్ధాంతం చేస్తున్నాయని, తెలంగాణ ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. ఆర్టీసీ సమ్మెపై మాట్లాడిన మంత్రి.. తాను ఎప్పుడూ ఉద్యోగులను ఏమీ అనలేదన్నారు. తనను విమర్శించే వాళ్లు.. తెలంగాణ కోసం తాను జైలుకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని మంత్రి డిమాండ్‌చేశారు. ఆర్టీసీ జేఏసీ నేతలు చర్చలకు రాలేదని, వస్తే అన్ని విషయాలు తెలిసేవన్నారు. కార్మికులు రాజకీయ పక్షాల వలలో చిక్కుకోవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

### బీజేపీ పాలిత రాష్ర్టాల్లో విలీనం ఏదీ?: మంత్రి మల్లారెడ్డి



బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ర్టాల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో ఎందుకు విలీనం చేయలేదని కార్మిక మంత్రి మల్లారెడ్డి ప్రశ్నించారు. పలుసంఘాల ప్రతినిధులు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం బోయిన్‌పల్లిలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమ్మెను బీజేపీ, కాంగ్రెస్‌లు రాజకీయం చేయాలని చూస్తున్నాయన్నారు. నీడనిచ్చే చెట్టు కొమ్మను నరికేసి కార్మికులకు అన్యాయం చేసేందుకు ఆ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అడగకముందే 44శాతం ఫిట్‌మెంట్ అమలుచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు.



ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్న జనగామ బస్టాండ్



హన్మకొండ నుంచి ఆర్టీసీ బస్సులో వెళ్తున్న ప్రయాణికులు



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

# ‘కృష్ణ’కు కొనసాగుతున్న వరద

- జూరాలకు 63,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆల్మట్టికి 26,408, నారాయణపురకు 38,363 క్యూసెక్కుల వరద



శ్రీరాంసాగర్‌లో సోమవారం నాటి నీటిమట్టం

**జోగుళాంబ గద్వాల ప్రతినిధి,నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ /అయిజ/నందికొండ/మెండోరా/మహదేవపూర్:**

ఎగువప్రాంతాల నుంచి కృష్ణమ్మకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. జూరాలకు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో 3 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఇన్‌ఫ్లో 63,500 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 68,161 క్యూసెక్కులుగా నమోదైంది. జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,045 అడుగులకు ప్రస్తుతం 1,044.9 అడుగుల మేర 9.604 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నారు. ఆల్మట్టికి 26,408 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో అదే స్థాయిలో నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలకు గాను ప్రస్తుతం 128.19 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. నారాణయణపుర ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో 38,363 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 29,533 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలకు గాను 37.54 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాంకు వరద స్థిరంగా కొనసాగుతున్నది. సోమవారం ఇన్‌ఫ్లో 14,550 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 14,130 క్యూసెక్కులు నమోదైంది.

### మూతపడ్డ శ్రీశైలం గేట్లు..

గత రెండు రోజులుగా భారీగా వచ్చిన ఇన్‌ఫ్లోతో సీజన్‌లో ఆరోసారి తెరుచుకొన్న శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లను సోమవారం సాయంత్రానికి అధికారులు మూసివేశారు. జూరాల పంపుహౌస్ నుంచి 47,108 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 36,594 క్యూసెక్కులు మొత్తంగా 83,702 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో ప్రాజెక్టు ఒక గేటు ద్వారా మధ్యాహ్నం వరకు నీటి విడుదల చేసిన అధికారులు సాయంత్రం మూసివేశారు.

### సాగర్ రెండు క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల

ఎగువ నుంచి నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతూ, తగ్గుతూ ఉండటంతో అందుకు అనుగుణంగా ఎన్నెస్పీ అధికారులు క్రస్టుగేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం 10 క్రస్టు గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా సోమవారం ఉదయం ఇన్‌ఫ్లో తగ్గడంతో 8 గేట్లను మూసివేసి కేవలం రెండు గేట్ల ద్వారానే నీటి విడుదల కొనసాగిస్తున్నారు. సోమవారం నాగార్జునసాగర్‌కు శ్రీశైలం నుంచి 84,563 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నుంచి కూడా అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.90 అడుగులుగా ఉన్నది. ప్రస్తుతం జలాశయంలో 311.4474 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

### శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి 6,968 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నదని ప్రాజెక్టు ఏఈఈ మహేందర్ తెలిపారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 80,486 టీఎంసీల వరద వచ్చిందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా, సోమవారం సాయంత్రానికి 1,089.50 అడుగులు (82.215 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నదన్నారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్టు నీటిమట్టం 1,078.60 అడుగులు (48.698 టీఎంసీల) నీటి నిల్వ ఉన్నదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌లో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. బరాజ్‌లో ప్రస్తుతం 95.70 మీటర్ల ఎత్తులో 5.647 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

## తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి

**దంతాలపల్లి:** తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్లలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరికుంట్లకు చెందిన కారుపోతులు ఉప్పలయ్య (52) సోమవారం గ్రామ శివారు పాలేరు వాగు సమీపంలో ఉన్న తాటిచెట్టు ఎక్కాడు. పైకి వెళ్లిన తరువాత ప్రమాదవశాత్తు జారి కిందపడగా అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నందీప్ తెలిపారు. ఉప్పలయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

## ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి ఆధ్వర్యంలో ధర్నా
- దిగొచ్చిన ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం



ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు హామీ పత్రం అందజేస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ జీఎం రాజన్‌తాఫర్

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ:** త్వరలో ప్రారంభం కానున్న రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సోమవారం చేపట్టిన ధర్నాకు సంస్థ యాజమాన్యం దిగొచ్చింది. కేంద్రం ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తున్నదని ఆరోపిస్తూ ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా టీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. దీంతో సంస్థ యాజమాన్యం ఎమ్మెల్యేతో చర్చలు జరిపింది. ఇటీవల జారీచేసిన 80 మంది కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన నోటిపికేషన్ రద్దు చేస్తామనీ, కాంట్రాక్టు పనుల్లో 90 శాతం మంది స్థానికులకే అవకాశం కల్పిస్తామనీ, అవుట్‌సోర్సింగ్ పనుల్లో 100 శాతం భూనిర్వాసితులు, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు ఆర్‌ఎఫ్‌సీఎల్ జీఎం రాజన్ తాఫర్ హామీ పత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. దీంతో ఆందోళన విరమించారు.

## నీటికుంటలో మునిగి బాలురు మృతి

**నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ:** నీటి కుంటలో మునిగి ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలో సోమవారం విషాదంనింపింది. మండలంలోని మల్పరేగడితండాకు చెందిన బలరాంనాయక్ కొడుకు బబ్లు(12), కొండాపూర్ మిట్యానాయక్‌తండాకు చెందిన సురేశ్ నాయక్ కొడుకు హరిచరణ్(13)లు మనూరు మండలం మాయికోడ్ తండాలోని తమ పెద్దమ్మ వద్దకు వెళ్లారు. ఆడుకుంటూ తండా శివారు దాటి పంచగామ శివారులోని నీటికుంటలో దిగి మునిగిపోయారు. అక్కడే ఉన్న బబ్లు అక్క కేకలు వేయడంతో తండాకు చెందిన కొందరు అక్కడికి చేరుకుని బాలురను బయటకు తీసే ప్రయత్నంచేశారు. అప్పటికే ఇద్దరు మృతి చెందారు.

# దాదానే బాస్




భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)లో కొత్త శకం మొదలుకాబోతున్నది. దాదాపు మూడేండ్లు క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) నీడలో నడిచిన బీసీసీఐ నూతన జవసత్వాలు నింపుకోబోతున్నది. సీవోఏ పాలనకు ముగింపు పలుకుతూ జరుగుతున్న ఎన్నికల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. భారత జట్టుకు దూకుడును పరిచయం చేసి ప్రత్యర్థులతో సై అంటే సై అన్న సౌరవ్ గంగూలీ బోర్డు అధ్యక్ష పీఠాన్ని అధిరోహించబోతున్నాడు. పోటీ అన్నది లేకుండానే ఏకగ్రీవంగా అధ్యక్ష పదవిని అలకరించేందుకు సమాయత్తమవుతున్నాడు. ఫిక్సింగ్ దుమారంతో కొట్టుమిట్టాడుతున్న సందర్భంలో జట్టు సారథ్య బాధ్యతలు అందుకున్న దా...ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో బోర్డు పదవిలో ఆసీనుడు కాబోతున్నాడు. ఈనెల 23న అధికారికంగా అధ్యక్ష పదవిని అధిష్ఠించనున్న గంగూలీ.. బీసీసీఐ ప్రతిష్ఠను పెంచడమే తన లక్ష్యమంటూనే ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లకు తొలి ప్రాధాన్యమని ప్రకటించాడు.

**బీసీసీఐ అధ్యక్ష పదవికి గంగూలీ ఏకగ్రీవ ఎన్నిక**

**కార్యదర్శిగా అమిత్ షా తనయుడు**

**కోశాధికారిగా అనురాగ్ ఠాకూర్ తమ్ముడు**

**ఈనెల 23న బాధ్యతల స్వీకరణ**




**ముంబై :** టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభించబోతున్నాడు. బీసీసీఐ అధ్యక్ష పదవిని అతడు చేపట్టేందుకు సర్వం సిద్ధమైంది. తుది గడువైన సోమవారం సౌరవ్ ఒక్కడే ఆ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో 2017లో అధ్యక్షుడిగా అనురాగ్ ఠాకూర్ పదవి నుంచి తప్పుకున్నాక... 33 నెలల క్రికెట్ పరిపాలన కమిటీ(సీఓఏ) పాలన అనంతరం బీసీసీఐ పగ్గాలను దాదా స్వీకరించనున్నాడు. బీసీసీఐ ఆఫీస్ బేరర్ల ఎన్నికలు ఈనెల 23న ఎన్నిక జరుగనున్నాయి. నామినేషన్ వేసేందుకు బోర్డు కార్యాలయానికి వచ్చిన దాదా వెంట బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఎన్ శ్రీనివాసన్, మాజీ కార్యదర్శి నిరంజన్ షా, ఐపీఎల్ మాజీ చైర్మన్ రాజీవ్ శుక్లా ఉన్నారు. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ బ్రిజేశ్ పటేల్ అధ్యక్ష పదవి రేసులో ముందున్నా.. అనేక నాటకీయ పరిణామాల తర్వాత అతడు పోటీ నుంచి తప్పుకున్నాడు. ఆదివారం జరిగిన అనధికార సమావేశంలో అన్ని రాష్ర్టాల సంఘాల ప్రతినిధులు గంగూలీ వైపే మొగ్గుచూపినట్టు సమాచారం. బ్రిజేశ్‌కు ఐపీఎల్ చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

అయితే, కొత్త నిబంధనల ప్రకారం గంగూలీ బీసీసీఐ అధ్యక్ష పదవిలో పది నెలల పాటు (సెప్టెంబర్ 2020) కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం కోల్‌కతా క్రికెట్ బోర్డు (క్యాబ్) అధ్యక్షుడిగా దాదా ఉన్నాడు. ఈనెల 23న బీసీసీఐ బాస్ పదవి చేపట్టాక క్యాబ్ పదవిని వదిలేయనున్నాడు.

**సంక్షోభం తలెత్తిన ప్రతీసారి..**

1999లో వెలుగుచూసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఉదంతంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన భారత క్రికెట్ జట్టు పగ్గాలను సౌరభ్ గంగూలీ 2000లో చేపట్టాడు. తన సారథ్యంతో జట్టు సభ్యుల్లో విశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపాడు. దూకుడైన కెప్టెన్సీతో జట్టును సమర్థంగా నడిపి విజయాల బాట పట్టించాడు. గత కొన్నేండ్లుగా బీసీసీఐలోనూ అనిశ్చితి నెలకొంది. బోర్డులో రోజువారి కార్యకలాపాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో సుప్రీంకోర్టు 2017లో అప్పటి అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్‌ను పదవి నుంచి తప్పించింది. జస్టిస్ లోధా సంస్కరణలు అమలు చేసేందుకు వినోద్ రాయ్, విక్రమ్ లిమాయే, డయానా ఎడుల్జీ, రామచంద్ర గుహల కూడిన క్రికెట్ పరిపాల కమిటీ(సీఓఏ)ను నియమించింది. అప్పటి నుంచి 33నెలల సీఓఏ పాలనలో బీసీసీఐ అనిశ్చితి నెలకొంది. అలాగే పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశంలోనూ అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పరిస్థితులను చక్కదిద్దే సామర్థ్యం గంగూలీకే ఉందని నిశ్చయించుకున్న రాష్ర్టాల క్రికెట్ సంఘాలు అతడివైపే మొగ్గుచూపాయి.


బ్రిజేశ్ పటేల్

> ప్రపంచ క్రికెట్‌లో అతి పెద్ద క్రికెట్ బోర్డుకు అధ్యక్షుడిగా నాపై పెద్ద బాధ్యత ఉంది. ఈ స్థానంలో ఉంటానని నేనెప్పుడూ ఊహించలేదు. బీసీసీఐ అధ్యక్ష పదవిని నేను ఆశించలేదు.. సభ్యులే నన్ను ఎంపిక చేశారు. బోర్డు ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తా. నాతో ఏ రాజకీయ నేత(అమిత్ షా) టచ్‌లో లేరు. నాకెవరూ ఏమీ చెప్పలేదు. నాకు అభినందనలు తెలిపిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి కృతజ్ఞతలు

## అన్నీ ఏకగ్రీవమే..

బీసీసీఐ ఆఫీస్ బేరర్ పదవులన్నీ ఏకగ్రీవం కానున్నాయి. కేంద్ర హోంశాఖ మంత్రి, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా కుమారుడు జై షా ఒక్కడే బీసీసీఐ కార్యదర్శిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ సోదరుడు అరుణ్ సింగ్ ధుమాల్ కార్యదర్శి పోస్టుకు ఏకగ్రీవంగా ఎన్నికవనున్నాడు. వీరితో పాటు మిగిలిన ఆరు స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రం దాఖలైంది.

| | |
|---|---|
| సౌరభ్ గంగూలీ | (అధ్యక్షుడు) |
| మహిమ్ వర్మ | (ఉపాధ్యక్షుడు) |
| జై షా | (కార్యదర్శి) |
| అరుణ్ సింగ్ ధుమాల్ | (కోశాధికారి) |
| బ్రిజేశ్ పటేల్ | (ఐపీఎల్ జీసీ సభ్యుడు) |
| జయేశ్ జార్జ్ | (జాయింట్ సెక్రటరీ) |
| కైరుల్ జమీల్ మంజుమ్‌దార్ | (గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్) |
| ప్రభ్‌జ్యోత్ సింధ్ భాటియా | (కౌన్సిలర్) |

## బీసీసీఐకి పునర్వైభవం తెస్తా

**మీడియాతో గంగూలీ ఇంటర్వ్యూ**

బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నిక కానున్న నేపథ్యంలో సౌరవ్ గంగూలీ తన భవిష్యత్ ప్రణాళికలను ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గత మూడేండ్లుగా ఇబ్బందుల్లో ఉన్న బీసీసీఐను తిరిగి గాడిలో పెడతానని చెప్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ల సంక్షేమమే తొలి ప్రాధాన్యమని చెప్పాడు. మరిన్ని విషయాలు అతడి మాటల్లోనే...

**అద్భుత అవకాశం**

చాలా గొప్పగా ఫీలవుతున్నా. దేశం తరపున ఆటగాడిగా, కెప్టెన్‌గా వ్యవహరించా. మెరుగైన పరిస్థితుల్లో లేని బీసీసీఐ.. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించబోతున్నా. బోర్డు ప్రతిష్ఠ కాస్త మసకబారింది. మంచి చేయడానికి నాకు ఇదో అద్భుత అవకాశం. ఎనిమిది మంది(ఆఫీస్ బేరర్లు) సమిష్టిగా ముందుకు సాగి బీసీసీఐకి పునర్వైభవం తెస్తాం.

**ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లే ప్రాధాన్యం**

ఫస్ట్ క్లాస్ క్రికెటర్ల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే తొలి ప్రాధాన్యం. గతంలోనే ఈవిషయాన్ని సీఓఏకి విన్నవించా. కానీ పట్టించుకోలేదు. ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ల రెమ్యునరేషన్లు కచ్చితంగా పెరగాలి. నేను చేసే మొదటిపని అదే.

**విరుద్ధ ప్రయోజనాల నిబంధనతో కష్టమే..**

పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధన సమస్యగా మారింది. క్రికెట్ కోసం గొప్ప ఆటగాళ్లను ఎలా వినియోగించుకోవాలో సరిగ్గా అర్థం కావడం లేదు. ఎందుకంటే ఇప్పటికే వారు వేరే పదవుల్లో ఉన్నారు. ఎన్‌సీఏ, సీఏసీ, బ్యాటింగ్, ఫీల్డింగ్ కోచ్ ఇలా ఏ నియామకం జరిగినా ప్రతీ దాంట్లో సమస్య తలెత్తుతున్నది. ఏజీఎం తర్వాత కొత్త ఉప కమిటీల నియామకం జరుగుతుంది. కొత్త సెలక్షన్ కమిటీని నియమిస్తాం.

**రెండో క్రికెటర్ దాదా..**

**బీసీసీఐ అధ్యక్ష పదవిని చేపట్టిన రెండో క్రికెటర్‌గా సౌరభ్ గంగూలీ నిలువనున్నాడు. 1936లో టీమ్ఇండియా తరపున ఆడిన విజయనగరం మహా కుమార రాజు(విజ్జి) 1954 - 56 మధ్య బీసీసీఐ అధ్యక్షుడిగా పని చేశారు.**



## అమిత్ షా ఆధ్వర్యంలో!

బీసీసీఐ ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. బోర్డులో మరోమారు తన చక్రం తిప్పుదామనుకుని బ్రిజేష్ పటేల్‌ను బరిలోకి దింపిన మాజీ అధ్యక్షుడు ఎన్ శ్రీనివాసన్ పాచికలు పారకుండా పోయాయి. అప్పటి వరకు ఎదురేలేన్నట్లు ఉన్న వాళ్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రంగ ప్రవేశంతో సీన్ ఒక్కసారిగా రివర్స్ అయ్యింది. షా మంత్రాంగంతో పటేల్‌కు పోటీగా సౌరవ్ గంగూలీని దింపి అనుకున్న పనిని షా కానిచ్చారు. దీంతో అప్పటి వరకు ఓ స్టార్ హోటల్లో వంద మంది మద్దతుదారులతో క్యాంప్ నడిపిన శ్రీనివాసన్ వర్గం..షా వ్యూహంతో చిత్తయింది. బోర్డులో శ్రీని పునఃప్రవేశం ఇష్టం లేని షా..గంగూలీకి మద్దతుగా నిలిచారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి, బోర్డు మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్ ..షా సూచనలను అనుసరించి గంగూలీ పేరును ప్రతిపాదించడం.. అప్పటి వరకు పోటీలో ఉన్న పటేల్ పక్కకు తప్పుకోవడం చకాచకా జరిగిపోయాయి. నామినేషన్ ఆఖరు తేది(సోమవారం)కి రెండు రోజుల ముందు అమిత్‌షాను గంగూలీ కలుసుకోవడం బోర్డు ఎన్నికల్లో కీలక పరిణామమని చెప్పొచ్చు. ఇదిలా ఉంటే కార్యదర్శిగా అమిత్ షా తనయుడు జై షా, అనురాగ్ ఠాకూర్ తమ్ముడు అరుణ్ ధుమాల్ కార్యదర్శి, కోశాధికారి పదవులు దక్కించుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ వారసత్వంతో పదవులు అలకరించడమేందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## నంబర్‌వన్ చేరువలో కోహ్లీ



**దుబాయ్:** టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ..టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ ర్యాంక్ తిరిగి అధిరోహించేందుకు మరింత చేరువయ్యాడు. దక్షిణాఫ్రికాతో పుణెలో జరిగిన రెండో టెస్టులో అజేయ డబుల్ సెంచరీ ద్వారా కోహ్లీ తన పాయింట్లు మెరుగుపర్చుకున్నాడు. ఐసీసీ సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్(937) తర్వాత కోహ్లీ(936) రెండో ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఇద్దరి మధ్య కేవలం పాయింట్ తేడా ఉంది. వరుస సెంచరీలతో అదరగొడుతున్న యువ ఓపెనర్ మయాంక్ అగర్వాల్(657)ఎనిమిది ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 17వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. చతేశ్వర్ పుజార(817), రహానే(721) వరుసగా నాలుగు, తొమ్మిది ర్యాంక్‌ల్లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆసీస్ స్పీడ్‌స్టర్ ప్యాట్ కమ్మిన్స్(908) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, బుమ్రా(818), అశ్విన్ (792) మూడు, ఏడు ర్యాంక్‌ల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో టీమ్ఇండియా నుంచి జడేజా (414), అశ్విన్(328) రెం డు, ఐదు ర్యాంక్‌ల్లో నిలిచారు.

## టైటిల్ లక్ష్యంగా..

**బరిలోకి సింధు, శ్రీకాంత్**



**ఓడెన్స్:** ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన స్టార్ షట్లర్ పీవీ సింధు మరో పోరుకు సిద్ధమైంది. మంగళవారం నుంచి మొదలవుతున్న డెన్మార్క్ ఓపెన్‌లో సింధు టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నది. ప్రపంచ చాంపియన్‌షిప్ తర్వాత జరిగిన చైనా, కొరియా టోర్నీల్లో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయిన సింధు..డెన్మార్క్‌లో సత్తాచాటాలని చూస్తున్నది. మంగళవారం జరిగే తొలి పోరులో గ్రెగోరియా మరిస్కా(ఇండోనేషియా)తో తలపడుతుంది. గ్రెగోరియాతో ముఖాముఖి పోరులో సింధు 5-0 ఆధిక్యంతో కొనసాగుతున్నది. మరోవైపు ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్న సైనా నెహ్వాల్..సయాకా తకహషి(జపాన్)తో తన పోరాటాన్ని మొదలుపెట్టనుంది. చైనా, కొరియా ఓపెన్లలో ఆదిలోనే నిష్క్రమించిన సైనా..ఎలాగైనా గాడిలో పడాలని చూస్తున్నది. గాయంతో గత కొన్ని టోర్నీలకు దూరంగా ఉన్న కిడాంబి శ్రీకాంత్ పూర్తి ఫిట్‌నెస్‌తో డెన్మార్క్‌లో పోటీకి సై అంటున్నాడు.

## నలుగురు హాకీ ప్లేయర్ల మృతి



**భోపాల్ :** రోడ్డు ప్రమాదంలో నలుగురు జాతీయ స్థాయి హాకీ ప్లేయర్లు మృతి చెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని హోసంగాబాద్ జిల్లా ఇత్రాసి సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఆల్ ఇండియా మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ టోర్నమెంట్ సెమీఫైనల్స్ ఆడేందుకు కారులో వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. షానవాజ్ ఖాన్(20), ఆదర్శ్ హర్దువా(22), ఆశిష్ లాల్(21), అంకిత్ వరుణ్(19) ఆ ప్రమాదంలో మరణించారు. గిడియన్ అల్‌ఫ్రెడ్, అక్షయ్ అవస్తి, సాహిల్ చౌరే గాయపడ్డారు. వీరంతా మధ్యప్రదేశ్ హాకీ అకాడమీలో శిక్షణ తీసుకుంటూ... జాతీయస్థాయి టోర్నీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో గిడియన్ కారు నడుపుతుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పినట్టు అతడు చెప్పాడు. టోర్నీ జరుగుతున్న సమయంలో ప్లేయర్లంతా హోసంగాబాద్‌లోనే ఉంటుండగా ఆదర్శ్ పుట్టినరోజు వేడుకల కోసమని అనుమతి తీసుకొని ఆదివారం 18కిలోమీటర్ల దూరమున్న ఇత్రాసికి వెళ్లారు. సోమవారం తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

## నేడు బంగ్లాతో భారత్ ఢీ

**రాత్రి 7.30గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..**



**కోల్‌కతా :** ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో తొలి విజయం సాధించాలనే పట్టుదలతో బంగ్లాదేశ్‌తో తలపడేందుకు భారత జట్టు సిద్ధమైంది. మంగళవారం కోల్‌కతా వేదికగా ఇక్కడ ఇరు జట్ల మధ్య క్వాలిఫయర్స్ గ్రూప్-ఈ రెండో రౌండ్ మ్యాచ్ జరుగనుంది. గత నెల ఒమన్‌తో గెలుపుదాకా వచ్చి ఓటమి చెందిన భారత్(104వ ర్యాంకు).. ఆ తర్వాత తమకన్నా మెరుగైన ర్యాంకులో ఉన్న ఆసియన్ చాంపియన్ ఖతార్(62)తో పోరును డ్రాగా ముగించి సత్తాచాటింది. అదే ప్రదర్శనతో బంగ్లా(187)ను చిత్తుచేయాలని పట్టుదలగా ఉంది. స్టార్ డిఫెండర్ సందేశ్ జింగన్ గాయం కారణంగా జట్టుకు దూరం కావడం జట్టుకు లోటుగా మారింది. అయితే, గాయం వల్ల గత మ్యాచ్ ఆడని కెప్టెన్ సునీల్ ఛెత్రి తిరిగి జట్టులోకి రావడం కొండంత బలంగా మారింది. ఛెత్రి గైర్హాజరీలో ఖతార్‌తో పోరులో సారథ్య బాధ్యతలు వహించిన గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు గోడలా నిలబడి మరీ 11సార్లు ప్రత్యర్థి జట్టు గోల్ చేయకుండా సమర్థంగా అడ్డుకున్న విషయం తెలిసిందే.

## సెమీస్‌లో బెంగళూరు, ముంబా

**నవీన్ విజృంభణతో బుల్స్ గెలుపు.. యూపీ, హర్యానా ఔట్**



**అహ్మదాబాద్ :** ప్రొకబడ్డీ లీగ్ ఏడో సీజన్ ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో విజయం సాధించిన బెంగళూరు బుల్స్, యూ ముంబా జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఇక్కడ జరిగిన ఎలిమినేటర్-1 చివరి వరకు ఉత్కంఠగా సాగగా.. రైడర్ పవన్ షెరావత్(20పాయింట్లు) విజృంభించడంతో బెంగళూరు బుల్స్ 48-45 యూపీ యోధాపై అదనపు సమయంలో విజయం సాధించింది. యూపీ జట్టులో రైజర్లు రిశాంక్ దేవడిగ(11పాయింట్లు), శ్రీకాంత్ యాదవ్(9పాయింట్లు) రాణించారు. యూపీ యోధా మ్యాచ్ ప్రారంభంలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఎనిమిదో నిమిషంలోనే బెంగళూరును ఆలౌట్ చేసి 11-4తో యోధా పైచేయి సాధించింది. ఆ తర్వాత కూడా ఆధిక్యాన్ని కొనసాగించి 19-11కు చేరింది. ఆ సమయంలో బుల్స్ రైడర్ విజృంభించి సూపర్ రైడ్‌తో యూపీని ఆలౌట్ చేసి ఆధిక్యాన్ని తగ్గించాడు. అయితే తొలి అర్ధభాగం ముగిసే సరికి యూపీ 20-17తో ముందంజలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ పవన్ షెరావత్‌ను కట్టడి చేసిన యూపీ చాలాసేపు ఆధిక్యంలోనే నిలిచింది. అయితే బుల్స్‌లో సుమీత్ సింగ్, యూపీలో శ్రీకాంత్ రైడింగ్ పోటాపోటీగా పాయింట్లు సాధించడంతో పోరు హోరాహోరీగా సాగింది. చివర్లో బెంగళూరు రైడర్ పవన్ కీలక పాయింట్లతో ఆకట్టుకోవడంతో 40నిమిషాల సమయం ముగిసే సరికి 36-36తో పాయింట్లు సమమయ్యాయి. దీంతో ఆరు నిమిషాల ఎక్స్‌ట్రా టైం నిర్వహించగా.. పవన్ షెరావత్ సూపర్ రైడింగ్‌తో బెంగళూరు విజయం సాధించింది. ఆ తర్వాత రెండో ఎలిమినేటర్‌లో యూ ముంబా 46-38తో హర్యానా స్టీలర్స్‌పై సునాయాస విజయం సాధించింది.

## పంజాబ్‌తోనే అశ్విన్

**న్యూఢిల్లీ :** టీమ్ఇండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను జట్టులో కొనసాగించాలని ఐపీఎల్ ఫ్రాంఛైజీ కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ నిర్ణయించుకుంది. అశ్విన్ విషయంలో జట్టు యాజమాన్యం పునరాలోచించిందని, అతడిని ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇవ్వకూడదని నిర్ణయించినట్టు పంజాబ్ జట్టు సహ యజమాని నెస్ వాడియా సోమవారం తెలిపాడు. కింగ్స్ జట్టుకు నూతన ప్రధాన కోచ్‌గా నియమితుడైన స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే కూడా అశ్విన్‌ను రిటైన్ చేయడం వైపే మొగ్గుచూపినట్టు సమాచారం. గత రెండు సీజన్లుగా ఐపీఎల్‌లో కింగ్స్ ఎలెవెన్ జట్టుకు రవిచంద్రన్ కెప్టెన్‌గా ఉన్నాడు. రెండు సీజన్లలోనూ తొలి అర్ధబాగంలో మంచి ప్రదర్శన చేసిన ఆ జట్టు ఆ తర్వాత చతికిలపడుతున్నది.

## జింబాబ్వేపై నిషేధం ఎత్తివేత

**సూపర్ ఓవర్ నిబంధనల్లో మార్పు.. ఐసీసీ కీలక నిర్ణయాలు**



**దుబాయ్ :** జింబాబ్వే, నేపాల్ క్రికెట్ బోర్డులపై విధించిన నిషేధాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ఎత్తేసింది. మళ్లీ ఆ దేశాలను సభ్యులుగా గుర్తిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. జింబాబ్వే బోర్డు అధికారులు, క్రీడా మంత్రులతో చర్చించాక ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. బోర్డు కార్యకలాపాల్లో ప్రభుత్వ జోక్యం చేసుకుంటున్నదన్న కారణంతో జింబాబ్వేపై ఐసీసీ ఈ ఏడాది జులైలో నిషేధం విధించగా... నిబంధనలకు విరుద్ధంగా బోర్డు ఎన్నికల్లో అక్కడి ప్రభుత్వం కలుగజేసుకుందని నేపాల్‌ను 2016లోనే ఐసీసీ బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరిలో జరిగే అండర్-19 ప్రపంచకప్‌లో జింబాబ్వే పాల్గొననుంది.

**మహిళల టోర్నీల ప్రైజ్‌మనీ పెంపు**

ఐసీసీ మహిళల క్రికెట్ టోర్నీల ప్రైజ్‌మనీని భారీగా పెంచుతూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. 2018తో పోలిస్తే 2020 టీ20 ప్రపంచకప్ నగదు ప్రోత్సాహాన్ని ఐదు రెట్లు పెంచింది. టీ20ప్రపంచకప్ విజేతకు దాదాపు రూ. 7.12కోట్లు ఇవ్వనుండగా, రన్నరప్‌కు దాదాపు రూ.3.56కోట్లు దక్కనున్నాయి. ఇక 2021 వన్డే ప్రపంచకప్ కోసం మొత్తం 24కోట్ల కేటాయించనుంది. అలాగే తొలిసారిగా అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను 2021 నుంచి ప్రతి రెండ్లకోసారి నిర్వహించాలని నిర్ణయించింది.

**ఫలితం తేలే వరకు సూపర్ ఓవర్లు**

ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో తీవ్ర వివాదాస్పదమైన సూపర్ నిబంధనలను ఐసీసీ సవరించింది. అన్ని ముఖ్యమైన టోర్నీల్లో.. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లో సూపర్ ఓవర్ కూడా టై అయితే ఫలితం వచ్చే వరకు సూపర్ ఓవర్లు ఉంటాయని ప్రకటించింది. ప్రపంచకప్ ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 241 పరుగులు చేస్తే... ఆ తర్వాత ఇంగ్లండ్ కూడా అన్నే పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత సూపర్ ఓవర్లోనూ రెండు జట్లు 15పరుగులే చేశాయి.

## మిథాలీసేన క్లీన్‌స్వీప్

**ఆఖరి వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత్ విజయం**




**వడోదర:** దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం జరిగిన మూడో వన్డేలో మిథాలీ రాజ్ నేతృత్వంలోని టీమ్ఇండియా ఆరు పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యఛేదన కోసం బరిలోకి దిగిన సఫారీలు ఏక్తా బిస్త్(3/32), దీప్తిశర్మ(2/24), రాజేశ్వరి గైక్వాడ్(2/22) రాణింపుతో 48 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. స్వల్ప స్కోరుకే పరిమితం చేశామనుకుని సంబురపడ్డ దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమైంది. ఛేదనలో ఓ దశలో 5 వికెట్లకు 103 పరుగులతో మెరుగ్గా కనిపించిన సఫారీలు టీమ్ఇండియా స్పిన్నర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయారు. మారిజానె కాప్(29), కెప్టెన్ సునె లుస్(24) రాణించినా మిగతా వారు ఘోరంగా విఫలమయ్యారు. ఆఖరి వికెట్ తీసిన జెమీమా రోడ్రిగ్స్(1/1) గెలుపు సంబురాల్లో మునిగి తేలింది. అంతకుముందు టాస్ గెలిచిన కెప్టెన్ మిథాలీ..బ్యాటింగ్ ఎంచుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్(38), శిఖాపాండే (35) రాణింపుతో భారత్ 45.5 ఓవర్లలో 146 పరుగులు చేసింది. కాప్(3/20), ఇస్మాయిల్(2/18), ఖాక(2/33) విజృంభణతో టీమ్ ఇండియా స్వల్ప స్కోరుకే పరిమితం కావాల్సి వచ్చింది. ఏక్తాబిస్త్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కాప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 38,214 | 11,341 |
| ↗87 | ↗36 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 59.29 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 38,885 |
| 22 క్యారెట్లు | --- |
| వెండి (కిలో) | 46,510 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 68.00 | 73.50 |
| యూరో | 73.50 | 80.50 |
| బహ్రెయిన్ దినార్ | 176.00 | 190.00 |
| కువైట్ దినార్ | 220.00 | 234.00 |
| సౌదీ రియాల్ | 17.50 | 19.30 |
| యూఏఈ దిర్హామ్ | 17.90 | 19.90 |

## టార్క్‌లో రతన్ టాటా పెట్టుబడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** ఎలక్ట్రిక్ వాహన స్టార్టప్ టార్క్ మోటర్స్‌లో టాటా గ్రూపు గౌరవ చైర్మన్ రతన్ టాటా పెట్టుబడి పెట్టారు. ఎంతమేర పెట్టిందో మాత్రం వెల్లడించలేదు. పుణెకు చెందిన ఈ స్టార్టప్ గతంలో భారత్ ఫోర్జ్, భావిష్ అగర్వాల్(ఓలా క్యాబ్ వ్యవస్థాపకుడు) పెట్టుబడులు పెట్టారు. గడిచిన కొన్నేండ్లుగా ఎలక్ట్రిక్ వాహన విభాగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ రంగం అత్యంత వేగంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో టార్క్ మోటర్స్‌లో పెట్టుబడులు పెట్టినట్లు టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా వెల్లడించారు.

## దాతల జాబితాలో నాడర్ టాప్

మూడో స్థానంలో ముకేశ్ అంబానీ



**ముంబై, అక్టోబర్ 14:** దేశీయ కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ దాతల జాబితాలో మూడో స్థానంలో ఉన్నారు. ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం హెచ్‌సీఎల్ అధినేత శివ్ నాడర్ మాత్రం తొలిస్థానంలో నిలిచారు. 21 బిలియన్ డాలర్లతో ప్రత్యేక చారిటిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విప్రో అధినేత అజీం ప్రేమ్‌జీకి ప్రస్తుత సంవత్సరానికిగాను హ్యురున్ దేశీయ దాతల జాబితాలో రెండో స్థానం దక్కింది. సామాజిక బాధ్యతలో భాగంగా కంపెనీల యాక్ట్ 2013 ప్రకారం కార్పొరేట్ కుటుంబాలు, వారి సంస్థలకు వచ్చిన లాభాల్లో రెండు శాతం దాతృత్వం కింద తప్పనిసరిగా కేటాయించాల్సి ఉంటుంది. వీరిలో శివ్ నాడర్, ఆయన కుటుంబ సభ్యులు కలిసి రూ.826 కోట్లు దాతృత్వం కింద కేటాయించగా, ఇదే సమయంలో ప్రేమ్‌జీ రూ.453 కోట్లు, ముకేశ్ అంబానీ రూ.402 కోట్లను అందించారు. 2018లో దాతృత్వం కింద రూ.5 కోట్ల కంటే అధికంగా నిధులను కేటాయించినవారు 38 మంది ఉండగా, ప్రస్తుత సంవత్సరానికిగాను రెండింతలు పెరిగి 72కి చేరుకున్నారు. మొత్తంమీద దాతృత్వం కింద రూ.4,391 కోట్ల నిధులను వెచ్చించినట్లు అయింది. దాతృత్వం కింద కేటాయించే నిధుల్లో అత్యధికంగా విద్యకోసం ఖర్చు చేస్తున్నారు. వీరిలో ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, ఆయన భార్య రోహిని సంయుక్తంగా రూ.346 కోట్ల నిధులను విద్య కోసం ఖర్చు చేశారు.

## హెచ్‌యూఎల్ లాభం రూ.1,848 కోట్లు

రూ.11 మధ్యంతర డివిడెండ్ ప్రకటన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థ హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్(హెచ్‌యూఎల్) ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన మూడు నెలలకాలానికిగాను సంస్థ రూ.1,848 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. హోమ్‌కేర్, బ్యూటీ, పర్సనల్ కేర్ ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ నెలకొనడంతో గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.1,525 కోట్ల లాభంతో పోలిస్తే 21.18 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సమీక్షకాలంలో కంపెనీ విక్రయాలు రూ.9,138 కోట్ల నుంచి రూ.9,708 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ మరో త్రైమాసికంలో సంస్థ ఆశాజనక పనితీరు కనబరిచినట్లు, మార్జిన్లు కూడా అధికమయ్యాయని హెచ్‌యూఎల్ సీఎండీ సంజీవ్ మెహతా తెలిపారు. స్వల్పకాలంపాటు వ్యాపార రంగంలో ఒడిదుడుకులు తప్పవని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఇవి మరి ఎక్కువగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గత త్రైమాసికంలో కంపెనీకి హోమ్ కేర్ విభాగం నుంచి రూ.3,371 కోట్ల ఆదాయం సమకూరగా, బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ సెగ్మెంట్ నుంచి రూ.4,543 కోట్లు, ఆహారం అండ్ రిఫ్రెష్‌మెంట్ నుంచి రూ.1,847 కోట్లు లభించాయి. మార్చి 31, 2020తో ముగిసే ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.11 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.2,014.70 వద్ద ముగిసింది.

# కూర'గాయాలు'

మండుతున్న ఆహార ఉత్పత్తుల ధరలు • 4 నెలల గరిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం • సెప్టెంబర్‌లో 3.99 శాతంగా నమోదు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:**

ఆహార పదార్థాలు మళ్లీ భగ్గుమంటున్నాయి. గడిచిన కొన్ని నెలలుగా తగ్గుముఖం పట్టిన కూరగాయలు, పప్పు దినుసుల ధరలు గత నెలకుగాను భగ్గుమనడంతో రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 3.99 శాతానికి ఎగబాకింది. అయినప్పటికీ రిజర్వు బ్యాంక్ నిర్దేశించుకున్న లక్ష్యం కంటే తక్కువ జోన్‌లో ఉన్నది. కేంద్ర గణాంకాల శాఖ సోమవారం విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఆగస్టులో 3.28 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ..క్రితం ఏడాది ఇదే నెలలో 3.70 శాతంగా ఉన్నది. జూలై 2018లో నమోదైన 4.17 శాతం తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. గత నెలలో ఆహార పదార్థాల ధరల సూచీ ఏకంగా రెండు రెట్లు పెరిగి 5.11 శాతానికి చేరుకున్నది. అంతక్రితం ఏడాది ఇది 2.99 శాతంగా ఉన్నది. వీటిలో కూరగాయల ధరలు 15.40 శాతం ప్రియంకాగా, పప్పుదినుసులు, మాంసం, చేపలు మరింత అధికమయ్యాయి. కానీ, చమురు ధరల బాస్కెట్ మాత్రం కాస్త శాంతించింది. ద్రవ్యోల్బణ గణాంకాలు ఆధీనంలో ఉండటంతో ప్రస్తుత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రిజర్వు బ్యాంక్ ఐదుసార్లు వడ్డీరేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆహార పదార్థాలు భగ్గుమన్నప్పటికీ..వచ్చే రెండు నెలల్లో శాంతించే అవకాశాలున్నాయని, కొత్త సీజన్ ప్రారంభంకానుండటం ఇందుకు కారణమని తెలిపింది.

### మూడేండ్ల కనిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు 14 నెలల గరిష్ఠ స్థాయిని తాకితే..టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం మాత్రం మూడేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చమురు, పలు ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడంతో సెప్టెంబర్ నెలకుగాను సూచీ 0.33 శాతంగా ఉన్నది. ఆగస్టు నెలలో 1.08 శాతంగా నమోదైన టోకు ధరల సూచీ..క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.22 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. అంతకుముందు జూన్ 2016లో ఈ ధరల సూచీ 0.1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నది. ఆహార పదార్థాల ధరల సూచీ ఫ్లాట్‌గా 7.47 శాతం వద్ద ముగిసింది. బంగాళాదుంప ధర 22.50 తగ్గినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చమురు, ఇంధనం విభాగ ధరల సూచీ -7.05 శాతానికి జారుకున్నది. తయారీ రంగ సూచీ ప్రతికూలంలోనే కొనసాగుతున్నది.

ఖనిజాలు, తయారీ ఆహార పదార్థాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా ద్రవ్యోల్బణ గణాంకాలు భారీగా పెరిగాయి. పండ్లు, ఉల్లి, ప్రాథమిక ఆహార పదార్థాల ధరల సూచీ తగ్గుముఖం పట్టాయి.
**- అదిత్ నాయర్, ఇక్రా ఆర్థికవేత్త**

రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయికి చేరుకోగా, టోకు ధరల సూచీ మాత్రం మూడేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడానికి వీలు పడింది.
**- రాహుల్ గుప్తా, ఎంకీ గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్**

ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న తదుపరి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లను మరింతగా తగ్గించే అవకాశాలున్నాయి.
**- సునీల్ సిన్హా, ఇండియా రేటింగ్ అండ్ రిసర్చ్ ప్రధాన ఆర్థికవేత్త**




### ఆంధ్రా బ్యాంక్
## వడ్డీరేట్ల తగ్గింపు



**హైదరాబాద్, అక్టోబర్ 14:** ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్రా బ్యాంక్ కూడా వడ్డీరేట్లను తగ్గించింది. మంగళవారం నుంచి అమలులోకి వచ్చేలా తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు ( ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్ల వరకు కోత పెట్టింది. వినియోగదారులు అధికంగా తీసుకునే ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 8.40 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గనుండగా, ఒక్క రోజు కాలపరిమితి కలిగిన రుణాలపై విధించే వడ్డీరేటు 7.80 శాతానికి తగ్గనున్నది. నెల రుణాలపై 7.85 శాతంగాను, మూడు నెలల రుణాలపై 8.05 శాతం, ఆరు నెలల రుణాలపై 8.20 శాతంగా నిర్ణయించింది. అలాగే రెపో లింక్డ్ లెండింగ్ వడ్డీరేటును 8.35 శాతం నుంచి 8.10 శాతానికి కుదించింది. వచ్చే నెల 1 నుంచి ఇవి అమలులోకి రానున్నాయి.

## 81,800 కోట్లు రుణాలిచ్చాం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) సంక్షోభం మధ్య దేశవ్యాప్తంగా ప్రభుత్వ సూచనలతో రుణ మేళాలను బ్యాంకులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ నెల ఆరంభం నుంచి 9వ తేదీ వరకు రూ.81,781 కోట్ల రుణాలను ఇవ్వడం జరిగిందని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. కాగా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు ఆర్థిక చేయూతనిస్తున్నామని ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపారు. ముఖ్యంగా భారీ సంస్థల నుంచి ఎంఎస్ఎంఈలకు రావాల్సిన రూ.40 వేల కోట్ల బకాయిలను ఇప్పించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

# అంతా గమనిస్తున్నాం

పీఎంసీ బ్యాంక్ పరిణామాలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో-ఆపరేటివ్ (పీఎంసీ) బ్యాంక్ పరిణామాలను దగ్గరగా గమనిస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ అంశంలో ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడుతామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ హామీ ఇచ్చారని చెప్పారు. సోమవారం ఇక్కడ ప్రభుత్వ బ్యాంకుల అధిపతులతో సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా పీఎంసీ బ్యాంక్ సమస్యను పరిష్కరిస్తామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తనతో చెప్పినట్లు ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. 'ఈ మధ్యాహ్నం కూడా నేను ఆర్బీఐ గవర్నర్‌తో మాట్లాడాను. ఈ వ్యవహారాన్ని నిశితంగా గమనిస్తున్నాను' అని తెలిపారు. పీఎంసీ బ్యాంక్ నుంచి నిర్మాణ రంగ సంస్థ హెచ్‌డీఐఎల్ గ్రూప్, దాని అనుబంధ సంస్థలు మొత్తం 44 రుణాలు తీసుకున్నాయి. గత నెల 19 నాటికి వీటి విలువ రూ.6,500 కోట్లుగా ఉన్నది. బ్యాంక్ మొత్తం రుణాల్లో (రూ.8,880 కోట్లు) ఇది దాదాపు 73 శాతానికి సమానం. అయితే హెచ్‌డీఐఎల్ రుణాలు మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)గా మారుతున్నా.. పీఎంసీ బ్యాంక్ పెద్దలు కొత్త రుణాలను ఇస్తూ పోయారని, దీనివల్ల బ్యాంక్‌కు గడిచిన 11 ఏండ్లలో రూ.4,355 కోట్ల నష్టం వాటిల్లిందని పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే పీఎంసీపై ఆరు నెలలపాటు ఆర్బీఐ ఆంక్షలు వచ్చిపడ్డాయి.

### రూ.40 వేలు తీసుకోవచ్చు

పీఎంసీ బ్యాంక్ ఖాతాదారులు రూ.40 వేల వరకు తమ ఖాతాల నుంచి నగదును ఉపసంహరించుకోవచ్చంటూ ఆర్బీఐ అనుమతినిచ్చింది. ఇంతకుముందు ఈ పరిమితి రూ.25 వేలుగానే ఉన్నది. ఆంక్షల కాలంలో ఇది వర్తిస్తుందని ఆర్బీఐ స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో బ్యాంక్‌లోని 77 శాతం ఖాతాదారులు తమ మొత్తం సొమ్మును తీసుకునే వెసులుబాటు లభించింది. కాగా, మంగళవారం ప్రభుత్వ బ్యాంకుల అధిపతులతో ఆర్బీఐ గవర్నర్ దాస్ సమావేశం కానున్నారు. ఐఐపీ, వృద్ధిరేటు దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వ బ్యాంకర్లతో ఇటు ఆర్థిక మంత్రి, అటు ఆర్బీఐ గవర్నర్ల వరుస భేటీలు ప్రాధాన్యాన్ని సంతరిచుకున్నాయి. మరోవైపు డిపాజిట్ గ్యారెంటీ పరిమితిని ప్రస్తుతమున్న లక్ష రూపాయల నుంచి పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పెంపు పార్లమెంట్ ద్వారా జరుగుతుందన్నారు.

### సంస్కరణలు ఆగవు

సంస్కరణలు ఆగబోవని, వాటిని కొనసాగిస్తామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే తీసుకున్న పలు నిర్ణయాలను గుర్తుచేశారు. ఆర్థిక వృద్ధిపై నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేసిన ఆమె ఇందు కోసం సాహసోపేత సంస్కరణలకు వెనుకాడబోమని ప్రకటించారు.

### కంపెనీల చట్టంలో సవరణలపై..

కంపెనీల చట్టంలో సవరణలు చేస్తున్నామని నిర్మలా సీతారామన్ తెలియజేశారు. అయితే వాటిని శిక్షగా చూడరాదని కోరారు. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో చోటుచేసుకుంటున్న మోసాలకు అడ్డుకట్ట వేయడానికే ఈ మార్పులని పేర్కొన్న ఆమె.. అమాయకులు నష్టపోరాదన్నారు.

### దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం: ఠాకూర్

దేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం చాలా బలమైనదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. సోమవారం పంజాబ్ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వృద్ధిపథంలో పరుగులు పెడుతున్నదన్నారు.

## ఏటీఎఫ్‌ను జీఎస్టీలో చేర్చండి

**సహజ వాయువును కూడా • జీఎస్టీ కౌన్సిల్‌కు చమురు శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ విజ్ఞప్తి**

**సహజ** వాయువుతోపాటు విమానయాన ఇంధనం (ఏటీఎఫ్)ను వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లోకి తీసుకురావాలంటూ జీఎస్టీ కౌన్సిల్‌కు నేతృత్వం వహిస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విజ్ఞప్తి చేశారు. దీనివల్ల బహుళ పన్నుల భారం తగ్గుతుందని, వ్యాపార నిర్వహణ పరిస్థితులు మెరుగవుతాయని అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన ఇండియా ఎనర్జీ ఫోరం ఆఫ్ సెరావీక్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీఎస్టీ అమల్లోకి వచ్చి రెండేండ్లు దాటిపోయిందని, అప్పట్నుంచే పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ విధానంలోకి తీసుకురావాలన్న డిమాండ్లు ఉన్నాయని గుర్తుచేశారు. 2017 జూలై 1న జీఎస్టీ పరిచయం అవగా, డజనుకుపైగా కేంద్ర, రాష్ట్ర పన్నులను ఇందులో విలీనం చేసేశారు. 1,200లకుపైగా వస్తూత్పత్తులు, 500లకుపైగా సేవలను జీఎస్టీ కిందకు తెచ్చారు. ముడి చమురు, సహజ వాయు వు, పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్‌లను మినహాయించారు. దీంతో వీటిని జీఎస్టీలోకి చేర్చాలన్న డిమాండ్లు వినిపిస్తూనే ఉన్నాయి.

### భారీ పెట్టుబడులకు అవకాశం

దేశీయ చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి రంగంలో భారీ పెట్టుబడులకు అవకాశాలున్నాయని, వచ్చే కొన్నేండ్లలో 118 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రావచ్చని ప్రధాన్ తెలిపారు. 2023 నాటికి 58 బిలియన్ డాలర్ల పెట్టుబడులు చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి రంగంలోకి వచ్చే వీలుందన్న ఆయన 2024కల్లా మరో 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సహజ వాయువు మౌలిక సదుపాయాల కల్పనలోకి రావచ్చని అన్నారు.

## అదానీ గ్యాస్‌లో టోటల్‌కు 37% వాటా

ఒప్పందం విలువ రూ.5,700 కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** ఏడాది క్రితం దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టిన ఫ్రెంచ్‌కు చెందిన ఇంధన సంస్థ టోటల్ ఎస్ఈ..తాజాగా గౌతమ్ అదానీకి చెందిన గ్యాస్ ప్రాజెక్టులో 37.4 శాతం వాటాను కొనుగోలు చేయడానికి ముందుకొచ్చింది. ఆటోమొబైల్, గృహస్తులకు గ్యాస్ సరఫరా చేయడానికి గౌతమ్ అదానీ ఈ ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారు. ఈ ఒప్పందం విలువ రూ.5,700 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ఆగస్టు 2018లో రాయల్ డచ్ షెల్‌తో కలిసి గుజరాత్‌లోని హజిరా వద్ద 50 లక్షల టన్నుల సహజ వాయువు దిగుమతి టర్మినల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అదానీ గ్యాస్‌లో 25.2 శాతం వాటాను ఓపెన్ ఆఫర్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు టోటల్ ప్రకటించింది. ఈ ఓపెన్ ఆఫర్ విజయవంతమైన తర్వాత ఈ వాటాను 37.4 శాతానికి పెంచుకున్నట్లు తెలుస్తున్నది. అదానీ గ్యాస్‌లో 74.8 శాతం వాటా కలిగిన అదానీ కుటుంబ సభ్యులు క్రమంగా వాటాను విక్రయించనుండటంతో ఇది 37 శాతానికి తగ్గనున్నది. ప్రస్తుతం అదానీ గ్యాస్ 1,500 సీఎన్‌జీ స్టేషన్లను నిర్వహిస్తున్నది. వచ్చే పదేండ్లకాలంలో దేశీయ గ్యాస్ మౌలికసదుపాయాలు, డిస్ట్రిబ్యూషన్, మార్కెటింగ్ వ్యాపారాల్లో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. దేశీయ ఇంధన డిమాండ్‌లో 6 శాతంగా ఉన్న సహజ వాయువు వాటా 2030 నాటికి 15 శాతానికి పెంచడానికి కేంద్రం సంకల్పించింది.

## స్వల్ప లాభాలతో సరి

సెన్సెక్స్ 87, నిఫ్టీ 36 పాయింట్ల లాభం



**ముంబై, అక్టోబర్ 14:** ప్రారంభంలో భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లు చివరకు లాభాల్లో ముగిశాయి. ఒక దశలో 448 పాయింట్ల స్థాయిలో కదలాడిన బీఎస్‌ఈ 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 87.39 పాయింట్లు పెరిగి 38,214 వద్ద, నిఫ్టీ 36.10 పాయింట్లు అందుకొని 11,341.15 వద్ద స్థిరపడ్డాయి. మార్కెట్లు ముగిసిన తర్వాత విడుదలైన రిటైల్, టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు మంగళవారం మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. టాటా మోటర్స్ 5.32 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. వీటితోపాటు ఓఎన్‌జీసీ 4.73 శాతం, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకీ, బజాజ్ ఆటో, టీసీఎస్‌లు ఉన్నాయి. మరోవైపు ఇన్ఫోసిస్ 3.68 శాతం పడి టాప్ లూజర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్., పవర్ గ్రిడ్, ఎల్‌అండ్‌టీ, కొటక్ బ్యాంక్‌ల షేర్లు బారీగా నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే టెలికం, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, బేసిక్ మెటీరియల్, హెల్త్‌కేర్, ఇంధన రంగ సూచీలు లాభపడగా, ఐటీ, టెక్, విద్యుత్, క్యాపిటల్ గూడ్స్ షేర్లు నష్టపోయాయి.

## స్పెక్ట్రం ధరల్ని తగ్గిస్తాం

మార్చి ఆఖర్లోగా వేలం: టెలికం మంత్రి రవిశంకర్ ప్రసాద్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** స్పెక్ట్రం ధరల్ని తగ్గిస్తామని, ఈ విధానాన్ని సంస్కరిస్తామని టెలికం శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్.. పరిశ్రమకు హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20)లోనే స్పెక్ట్రం వేలం ఉంటుందని చెప్పారు. సోమవారం ఇక్కడ ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2019లో మంత్రి మాట్లాడుతూ దేశీయ టెలికం పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లపై తమకు అవగాహన ఉందన్నారు. గతేడాది దాదాపు 8,644 మెగాహెట్జ్‌ల స్పెక్ట్రంను టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ వేలానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. మొత్తం మూల ధరను రూ.4.9 లక్షల కోట్లుగా అంచనా వేసిన సంగతీ విదితమే. అయితే టెలికం పరిశ్రమ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అసలే నష్టాల్లో ఉన్న టెలికం రంగం.. ఇంత భారాన్ని మోయలేదని పరిశ్రమ వర్గాలు ప్రభుత్వానికి చెబుతున్నాయి. మరోవైపు ఈ కార్యక్రమానికి రిలయన్స్ జియో అధినేత ముకేశ్ అంబానీ, భారతీ ఎయిర్‌టెల్ అధిపతి సునీల్ మిట్టల్, వారి వారసులు హాజరుకాలేదు.

**పరిశ్రమకు గొప్ప ఊరట: సీవోఏఐ**

స్పెక్ట్రం ధరలను సంస్కరిస్తామని ప్రభుత్వం ముందుకు రావడాన్ని భారతీయ సెల్యులార్ ఆపరేటర్ల సంఘం (సీవోఏఐ) స్వాగతించింది. దేశీయ టెలికం పరిశ్రమకు ఇది గొప్ప ఊరటని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ పీటీఐ వద్ద అభిప్రాయపడ్డారు.



## తగ్గిన హెచ్‌డీఎఫ్‌సీ వడ్డీరేట్లు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ రుణాలపై వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయంతో పాత, కొత్తగా రుణాలు తీసుకునేవారికి ఆర్థిక ప్రయోజనం కలుగనున్నది. ఈ నెల మొదట్లో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను పావు శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా బ్యాంకులు తమ రుణాలపై వడ్డీరేట్లలో కోత విధిస్తున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ తగ్గించిన వడ్డీరేట్లు ఈ నెల 15 నుంచి అమలులోకి రానున్నాయి.

## ఐఆర్‌సీటీసీ అదరహో..

మార్కెట్లోకి ప్రవేశించిన రోజే 127 శాతం పెరిగిన షేరు

రూ.728.60గా నమోదైన విలువ



**ముంబై, అక్టోబర్ 14:** ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) అదరగొట్టింది. స్టాక్ మార్కెట్లో లిస్టైన తొలిరోజే కంపెనీ షేరు ధర ఆకాశమే హద్దుగా దూసుకుపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ఏకంగా 127 శాతం లాభపడి రూ.728.60 వద్ద ముగిసింది. ఇష్యూ ధర రూ.320 కంటే ఇది రెండు రెట్లు అధికం. ప్రభుత్వం జారీ చేసిన షేర్ల కంటే 112 రెట్లు అధికంగా బిడ్డింగ్ దాఖలయ్యాయి. ఐపీవో ద్వారా సంస్థ రూ.645 కోట్ల నిధులను సమీకరించింది. మినీ రత్నా హోదా కలిగిన కంపెనీ షేరు ధర రూ.644 వద్ద ప్రవేశించింది. బీఎస్ఈలో ఇంట్రాడేలో కంపెనీ షేరు 101.25 శాతం బలపడి రూ.743.80 వద్దకు చేరుకోగా, చివరకు రూ.728.60 వద్ద ముగిసింది. అలాగే ఎన్ఎస్ఈలో 95.62 శాతం లాభపడి రూ.626 వద్ద ముగిసింది. ప్రారంభరోజే డీ-మార్ట్‌నకు చెందిన అవెన్యూ సూపర్‌మార్ట్స్ షేరు ధర కూడా 100 శాతానికి పైగా లాభపడిన విషయం తెలిసిందే. మార్కెట్ విశ్లేషకులు మాత్రం కంపెనీ షేరు ధర రూ.500-530 మధ్యస్థాయిలో ఉంటుందని అంచనాను వెల్లడిస్తున్నారు. గడిచిన పది సంవత్సరాల్లో8/10 స్టాక్‌లు మాత్రమే అత్యధికంగా లాభపడ్డాయి. వీటిలో అవెన్యూ సూపర్‌మార్ట్ కూడా ఉన్నది. గతంతో పోలిస్తే ప్రస్తుతం కంపెనీ షేరు ధర 200 శాతం అధికంగా లాభపడింది. ఈ సందర్భంగా ఐఆర్‌సీటీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎంపీ మాల్ మాట్లాడుతూ..ఇది చారిత్రక రోజు, లిస్టింగ్ రోజే రికార్డులను తిరగరాసిన తొలి ప్రభుత్వరంగ సంస్థ కావడం విశేషమన్నారు. ఐపీవోద్వారా సేకరించిన నిధులతో ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో బడ్జెట్ హోటళ్లను అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇదివ రకే ఐఆ రసీ టీసీ ప్రకటించింది. ఇప్ప టికే లక్నోలో నిర్మించతలపెట్టిన బడ్జెట్ హోటల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, టూరిస్టు కీలకంగా ఉన్న ప్రాంతాల్లో బడ్జెట్ హోటళ్లను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.



మహబూబ్‌నగర్‌లోని సినిమా థియేటర్ వద్ద బ్యానర్ కడుతూ ప్రమాదానికి గురైన వెంకటేశ్ తల్లి నీలమ్మకు చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నిర్మాత దిల్ రాజు

## ప్రమాద బాధితుడికి ఆపన్నహస్తం

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో రూ.7లక్షల సాయం అందజేసిన దిల్ రాజు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహబూబ్‌నగర్‌లోని ఓ సినిమా థియేటర్ వద్ద బ్యానర్లు కడుతూ ప్రమాదానికి గురైన బాధితుడు వెంకటేశ్‌కు పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆపన్నహస్తం అందించారు. మంత్రి చొరవతో చిత్ర పంపిణీదారుడు దిల్ రాజు.. వైద్య చికిత్సల నిమిత్తం బాధితుడి కుటుంబానికి రూ.7లక్షల సాయం అందించారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో.. దిల్ రాజు, థియేటర్ యజమాని సురేశ్ కలిసి వెంకటేశ్ తల్లి నీలమ్మకు చెక్కును అందజేశారు.



తాడేపల్లిలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న నటుడు చిరంజీవి. చిత్రంలో జగన్ సతీమణి భారతి, చిరంజీవి సతీమణి సురేఖ కూడా ఉన్నారు.

## ఏపీ సీఎంతో చిరంజీవి భేటీ

- సైరా సినిమా చూడాలని ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సినీ నటుడు చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిరంజీవి సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు. సీఎం జగన్‌తోపాటు ఆయన సతీమణి భారతి కూడా ఉన్నారు. తాను నటించిన సైరా నరసింహారెడ్డి చిత్రాన్ని వీక్షించాలని జగన్‌ను కోరారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు. చిరంజీవి ఇటీవలే తెలంగాణ గవర్నర్ తమిళిసైను కలిసి కూడా సైరా చిత్రాన్ని చూడాలని ఆహ్వానించిన విషయం తెలిసిందే. చిరంజీవితో సమావేశం ఆనందంగా ఉన్నదని, ఆయన మంచి జ్ఞాపకాలు పంచుకొన్నారని సీఎం జగన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.





సోమవారం న్యూఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గౌరవ్ ఉప్పల్

## ఆంధ్రా బ్యాంకులో భారీ దోపిడీ

**అమరావతి:** చిత్తూరు జిల్లా యాదమరి ఆంధ్రా బ్యాంకులో భారీగా బంగారం చోరీకి గురైంది. అమరరాజా పరిశ్రమ ఆవరణలోని బ్యాంకులో తనఖాపెట్టిన నగలను దుండగులు ఎత్తుకెళ్లారు. సుమారు 17కిలోల బంగారం, రూ.2.66 లక్షలు చోరీకి గురైనట్లు సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు బ్యాంకుకు చేరుకుని లాకర్లను పరిశీలించారు. నగలు, నగదు మాయమైన ఘటనలో బ్యాంకు మేనేజరు పాత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయనతోపాటు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# పంటకాలనీల్లో సుగంధ సాగు!

- విస్తీర్ణం పెంచాలని ఉద్యానశాఖ నిర్ణయం
- 100 ఎకరాల్లో ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రైతులకు నేడు శిక్షణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సుగంధ ద్రవ్యాల పంటల సాగును చేపట్టేలా రైతులను చైతన్యవంతం చేయడంపై ఉద్యానశాఖ దృష్టి సారించింది. అందులోభాగంగా పంటకాలనీల ద్వారా విత్తన సుగంధ ద్రవ్యాల విస్తీర్ణం పెంచాలని, ఇందుకు 1.15 లక్షల ఎకరాలు అవసరమని గుర్తించింది. ధనియాలు, జీలకర్ర, మెంతులు, సోంపు, వాము సాగును ప్రోత్సహించడానికి సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్) కింద 2019-20 ఆర్థిక సంవత్సరంలో 100 ఎకరాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రదర్శన క్షేత్రాలను రైతుల పొలాల్లో చేపట్టేందుకు తెలంగాణ ఉద్యానశాఖ సన్నాహాలు చేస్తున్నది. ఉద్యాన నర్సరీల్లో కూడా ఈ పంటల ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. వీటికి కావాల్సిన విత్తనాలను అజ్మీర్‌లోని జాతీయ విత్తన సుగంధ ద్రవ్యాల పరిశోధన కేంద్రం నుంచి తెప్పించింది. సుగంధ ద్రవ్యాల పంటసాగుపై రాష్ట్ర రైతాంగానికి అవగాహన కల్పించడం కోసం మంగళవారం హైదరాబాద్‌లోని ఉద్యాన శిక్షణా సంస్థలో సదస్సును ఏర్పాటుచేసింది. దీనిని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, కొండాలక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, జాతీయ విత్తన సుగంధ ద్రవ్యాల పరిశోధన కేంద్రం అజ్మీర్ సంచాలకుడు డాక్టర్ గోపాల్‌లాల్, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ శివలాల్, డాక్టర్ ఎన్‌కే మీనాహాజరై రైతులకు సుగంధ విత్తన పంటల సాగుపై అవగాహన కల్పించనున్నారు. సదస్సుకు నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నుంచి సుగంధ ద్రవ్య పంటల సాగు ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటుకు ఎంపికైన ఔత్సాహిక, అభ్యుదయ రైతులు హాజరవుతారు.

### దిగుమతిచేసుకోవాల్సిన పరిస్థితి: ఎల్ వెంకట్రామిరెడ్డి

రాష్ట్రంలో పసుపు, ఎండుమిర్చి అవసరానికి మించి అధికంగా సాగవుతుండగా.. ధనియాలు, జీలకర్ర, మెంతులు, సోంపు, వామును పండించకపోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నదని ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. సుగంధ ద్రవ్యాలు అధికంగా పండించే గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల వాతావరణ పరిస్థితులు.. తెలంగాణ వాతావరణ పరిస్థితులు ఇంచుమించు ఒకేరకంగా ఉన్నా సాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. 17 రకాల విత్తన సుగంధ ద్రవ్య పంటలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, నారమ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలో తలసరి సగటున రోజుకు 21 గ్రాములు, నెలకు 640 గ్రాములు, సంవత్సరానికి 7.58 కిలోల సుగంధ ద్రవ్యాలు వినియోగిస్తున్నట్టు తేలిందని ఆయన వివరించారు. రాష్ట్ర జనాభాకు సంవత్సరానికి కావాల్సిన సుగంధ ద్రవ్యాల వినియోగం 2.31 లక్షల మెట్రిక్ టన్నులని, వాటి విలువ సుమారు రూ. 1451 కోట్లు ఉంటుందని వెల్లడించారు. ఇందులో పసుపు, ఎండుమిర్చి, అల్లం, వెల్లుల్లి, చింతపండు 2,02,890 మెట్రిక్ టన్నులు ఉండగా వాటివిలువ.. రూ.1251 కోట్లని ఆయన వివరించారు.

## ఏపీలో వైఎస్సార్ రైతు భరోసా పెంపు

- రూ.12,500 నుంచి 13,500 పెంచుతూ ఉత్తర్వులు
- రూ.5,510 కోట్లు విడుదల
- నేడు నెల్లూరు జిల్లాలో ప్రారంభించనున్న ఏపీ సీఎం జగన్

**అమరావతి:** ఏపీ రైతులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం రూ.12,500 నుంచి 13,500 పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెట్టుబడి సాయాన్ని మూడు విడుతలుగా అందజేయనున్నది. రైతు భరోసా పథకానికి రూ.5,510 కోట్లను విడుదల చేస్తూ ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కే సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, నెల్లూరు జిల్లా కాకుటూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించే బహిరంగసభలో మంగళవారం ఏపీ సీఎం వైఎస్ జగన్ రైతు భరోసా పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రైతుభరోసా పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం చెక్కులు, కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేయనున్నారు. రైతులకు ఇచ్చే పెట్టుబడిసాయాన్ని వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఆ డబ్బులను బ్యాంకులు ఇతర బకాయిల కింద జమచేసుకోవడానికి వీలు లేదు.

## లైంగిక వేధింపుల ప్రొఫెసర్‌పై వేటు

**అమరావతి:** రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఆంగ్లవిభాగాధిపతిగా పని చేస్తున్న డాక్టర్ ఎన్ సూర్యరాఘవేంద్రపై సోమవారం సస్పెన్షన్ వేటుపడింది. రాఘవేంద్రపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో అంతర్గత విచారణ చేపట్టిన యూనివర్సిటీ వైఎస్ చాన్సలర్ ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రొఫెసర్ లైంగికవాంఛ తీర్చాలంటూ వేధిస్తుండటంతో పలువురు విద్యార్థినులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాయగా.. ఆయన స్పందించి విచారణకు ఆదేశించారు.



తెలంగాణ ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసేందుకు నిర్వహించిన అవగాహనా సమావేశానికి హాజరైన డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్, సీఎం పీఆర్వో రమేశ్ హజారీతోపాటు వివిధ ప్రభుత్వశాఖల పీఆర్వోలు

## ‘టిక్‌టాక్’గా పథకాల ప్రచారం

- సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతం
- ‘టిక్‌టాక్’పై అవగాహన కార్యక్రమంలో డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను టిక్‌టాక్ ద్వారా ప్రజలకు చేరువ చేస్తామని డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ తెలిపారు. సోమవారం హోటల్ హరితప్లాజాలో టిక్‌టాక్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వం, ఐటీశాఖ, డిజిటల్ మీడియా ఆధ్వర్యంలో వివిధశాఖల అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతం దిలీప్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోనున్నదని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ట్విట్టర్ ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి టిక్‌టాక్ ఉపయోగించుకోవాలని సూచించారు. టిక్‌టాక్ ఇండియా పాలసీ డైరెక్టర్ నితిన్ సాలూజా మాట్లాడుతూ తమ సంస్థ అనతికాలంలోనే దేశంలో 20 కోట్ల మంది యూజర్లను చేరుకోగలిగిందన్నారు. మూడు నెలలుగా టిక్‌టాక్ ఇండియా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నదని, ఇందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వంతో పనిచేయడానికి ముందుకొచ్చినట్టు తెలిపారు. సామాజిక బాధ్యతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను టిక్‌టాక్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ‘టిక్‌టాక్’ ప్రత్యేక సేవలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎం పీఆర్వో రమేశ్‌హజారీ, రాచకొండ కమిషనర్ పీఆర్వో దయాకర్, సైబరాబాద్ కమిషనర్ పీఆర్వో కిరణ్‌కుమార్, డీజీపీ సీపీఆర్వో హర్షభార్గవి, టూరిజం, జీహెచ్‌ఎంసీ, ప్రజాసంబంధాల అధికారులు పాల్గొన్నారు.






## చాక్లెట్లతో మతిమరుపు మాయం!



**మతిమరుపు అనగానే గజిని, భలే భలే మగాడివోయ్.. సినిమాలు గుర్తొస్తాయి. మరీ అంత మతిమరుపు లేకపోయినా కొంచెం ఉన్నా చాలు కదా సమస్యల్లో చిక్కుకోవడానికి. మతిమరుపు అనేది వయసు మీద పడిన వారికే అనుకుంటే పొరపాటే. మతిమరుపు మానవ సహజం. దీని నుంచి బయటపడాలంటే చాక్లెట్లు తినాలంటున్నారు.**

- చాక్లెట్ తినమంటే తామేమీ చిన్న పిల్లలం కాదంటుంటారు పెద్దలు. కానీ, మతిమరుపు అనేది పిల్లలకు మాత్రమే రాదు. పెద్దలకు కూడా వయసు పెరిగే కొద్దీ మతిమరుపు పెరుగుతుంటుంది. దీనికి విరుగుడుగా చాక్లెట్లు తినమంటున్నారు వైద్యులు.
- మతిమరుపును దూరం చేయాలనుకుంటే ప్రతిరోజూ చాక్లెట్లు తప్పనిసరిగా తీసుకోవాలట. సమతులాహారం తోపాటు చాక్లెట్ కూడా మీ ఆహారంలో భాగంగా ఉండాలంటున్నారు వైద్యులు.
- ముఖ్యంగా డార్క్ చాక్లెట్లలో ఉండే పాలీ ఫెనాల్స్ చర్మానికి గుండె కణాలకు హాని చేసే రసాయనాలను నివారిస్తాయి.
- చాలామందిలో చాక్లెట్లు తింటే దంతాలు పాడైపోతాయనే అపోహ ఉంది. కానీ, చాక్లెట్ నోట్లో వేసుకుంటే కరిగిపోతుంది. దీంతో అది దంతాలకు హాని చేసే ఆస్కారమే ఉండదు. మిగిలిన తీపి పదార్థాలతో పోల్చితే చాక్లెట్ పర్వాలేదని పరిశోధనలో తేలింది. కాబట్టి ప్రతిరోజూ చాక్లెట్ తినడం వల్ల నష్టమేమీ లేదని వైద్యులు సూచిస్తున్నారు.
- చాక్లెట్‌లో ఆరోగ్యానికి చాలా మేలు చేసే విటమిన్లు పుష్కలంగా ఉన్నాయని బ్రిటీష్ డైటిక్ అసోసియేషన్ పేర్కొంది. ముఖ్యంగా మిల్క్ చాక్లెట్‌లో క్యాల్షియం, విటమిన్ బి2, బి12 పుష్కలంగా ఉంటాయని వీటితో పాటు మెగ్నీషియం, రాగి, ఇనుములాంటివి డార్క్ చాక్లెట్‌లో పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని కొవ్వును తగ్గిస్తాయని వైద్యులు తెలిపారు.

నమస్తే తెలంగాణ
# జిందగీ
మంగళవారం 15 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



# ఓ యువతీ నువ్వు మగాడివి కాదు..

**ఓ యువతీ నువ్వు మగాడివి కాదు.. అంటారు రచయిత్రి అపూర్వ పురోహిత్. Lady, You're Not a Man! అని ఆవిడ ఒక పుస్తకం కూడా రాశారు. ఉద్యోగం పురుష లక్షణం అంటారు. ఓ యువతీ నువ్వు మగాడివి కాదు.. కేవలం ఉద్యోగం చేయడానికి.. అంతకు మించింది ఇంకేదో నువ్వు చెయ్యగలవు అని చెబుతుంది. అచ్చంగా ఇలాంటి పనే చేసింది ఈ ఫొటోలోని అమ్మాయి అంకితి బోస్. 23 ఏండ్లకే ఓ స్టార్టప్ మొదలెట్టి నాలుగేండ్లలోనే దాన్ని 100 కోట్ల డాలర్ల సంస్థగా తీర్చిదిద్దింది. జిలింగో పేరుతో ఆమె కో-ఫౌండర్, సీఈవోగా ప్రారంభించిన ఫ్యాషన్ ప్రపంచం ఎందరో చిరు, మధ్య తరగతి వ్యాపారులకు ఓ ఆన్‌లైన్ వేదికైంది. అదే ఆమెను ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలురైన స్ఫూర్తిదాయక యువ వ్యాపారవేత్తల్లో ఇండియా నుంచి ఏకైక యువతిగా గుర్తింపు తెచ్చిపెట్టింది.**

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 'చాటుచాక్' అనేది పెద్ద వారాంతపు సంత. ప్రపంచంలోనే ఇది పెద్దది. ప్రసిద్ధి. సుమారు 15 వేల స్టాళ్లు, 12 వేల చిరు వ్యాపారులు విక్రయాలు జరుపుతారు. సుమారు రెండు లక్షల మంది కొనుగోళ్లు చేస్తారు. ప్రతి వస్తువూ అక్కడ దొరుకుతుంది. సెలవుల కోసం అక్కడికి వెళ్లిన 'అంకితి బోస్' సరిగ్గా ఆ మార్కెట్‌లోనే ఓ రోజు తిరిగింది. అంత రద్దీ, క్రయవిక్రయాలు, వ్యాపారులను చూస్తుంటే ఆమెకేవో ఆలోచనలు వచ్చాయి!

* * *

ప్రపంచంలో ఇంత ఇంటర్నెట్ విస్తరించింది. ఆన్‌లైన్ మార్కెట్లూ పెరిగాయి. ప్రతిదేశంలో ఈ-కామర్స్ వెబ్‌సైట్లు పుంజుకున్నాయి. అమెరికాలో అమెజాన్, చైనా అలిబాబా, ఇండియా ఫ్లిప్‌కార్ట్.. ఇట్లా ఆన్‌లైన్‌లో వస్తువిక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా చాటుచాక్ మార్కెట్ ఎందుకు ఇంత రద్దీగా ఉంటున్నది?

* * *

ఆమె ఆలోచనలో పడింది. మార్కెట్‌లో ఎటు చూసినా వ్యాపార దుకాణాలు, ఎగబడి కొంటున్న జనం. మరో వైపు ఈ-కామర్స్ వెబ్‌సైట్లు. ఆమె అధ్యయనం మొదలుపెట్టింది. మార్కెట్‌లో ఉండేది చిన్న, మధ్యతరహా వ్యాపారులే అని ఆమె తెలుసుకుంది. కేవలం భారీ వ్యాపార సంస్థలకే ఈ-కామర్స్ సంస్థలు అవకాశాలను కల్పిస్తున్నాయి. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్ కొనుగోళ్లతోపాటు ఇలాంటి వారాంతపు మార్కెట్లు కూడా పెరుగుతున్నాయని తెలుసుకుంది.

ఆగ్నేయాసియా.. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పాదక కేంద్రాల్లో ఒకటిగా ప్రాతినిధ్యం వహిస్తున్నది. కానీ చాలామంది చేస్తున్న స్థానిక ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడానికి సరైన వేదికలు లేవు. అందుకే డిస్ట్రిబ్యూటర్ల మీద ఆధారపడుతున్నారు. ఇది ఉత్పత్తిదారుని లాభాల మీద తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది.

అంకితి దీని గురించి ఏదైనా చేయాలని నిర్ణయించుకుంది. స్థానిక ఉత్పత్తిదారులను, చిన్న, మధ్యతరగతి వ్యాపారస్థులను సమీకరించి, వారి కోసం ఓ స్టార్టప్ ద్వారా పెద్ద మార్కెట్‌ను సృష్టించాలనుకుంది.

* * *

సెక్వోయా క్యాపిటల్ ఇండియా సీడ్ కంపెనీ. అంకితి అందులో ఉద్యోగంలో చేరింది. అనలిస్టుగా అనుభవం సాధించింది. బిజినెస్ టు బిజినెస్ ద్వారా చిరువ్యాపారులను ఆహ్వానించడం, వారితో పెట్టుబడులు పెట్టించడంలో నైపుణ్యం పొందింది. ఆమె స్టార్టప్ ప్రారంభించడానికి కావాల్సిన అనుభవం కోసమే అనలిస్ట్‌గా అందులో చేరింది. ముంబైకి చెందిన అంకితి అక్కడే ఎంబీఏ చదివింది. గణిత, అర్థిక శాస్త్రంలో పట్టున్న అమ్మాయి. దీంతో సీడ్ కంపెనీలో కొద్ది కాలంలోనే మంచి అనుభవం పెంచుకుంది. మార్కెట్, చిరువ్యాపారం, వినియోగదారుల తీరు అర్థం అయ్యాక బయటకు వచ్చింది.

బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ధృవ్‌పూర్‌తో కలిసి స్టార్టప్ మొదలెట్టింది. 2015లో 'జిలింగో డాట్ కామ్'ని ప్రారంభించింది. ఇద్దరి దగ్గర ఉన్న 20 లక్షల రూపాయలను పెట్టుబడిగా పెట్టి ఈ స్టార్టప్‌ను డెవలప్ చేశారు. నమ్మకమైన స్నేహితులను ఒప్పించి భాగస్వామ్యం చేసుకున్నారు. ఇట్లా వారి ఆలోచనను నిజం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ స్టార్టప్‌లోకి బిజినెస్ టు బిజినెస్ పద్ధతిన చిరువ్యాపారులను అంకితి ఆహ్వానించింది. పెట్టుబడి ద్వారా చిరు వ్యాపారులు తొలుత ముందుకు రాలేకపోయారు. స్టార్టప్ ఆలోచన చెప్పినా పెట్టుబడిదారులు స్పందించలేదు. కానీ అనలిస్టుగా అనుభవం ఆమెకు ఇక్కడ ఉపయోగపడింది. స్టార్టప్ సీఈవోగా బాధ్యతలు చేపట్టడానికి ఆత్మవిశ్వాసాన్ని అందించింది.

ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఫ్యాషన్ రంగంలో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నది. దీన్ని పసిగట్టిన అంకితి అవకాశంగా తీసుకుంది. జిలింగో అభివృద్ధి చేసేందుకు, పెట్టుబడిదారులను రప్పించడానికి ప్రయత్నాలు చేసింది. జిలింగో తమ వ్యాపారాలను పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని చిరువ్యాపారస్థులను ఒప్పించింది. దీని కోసం ఆగ్నేయాసియా మొత్తం ప్రయాణించింది. ఆమె ప్రయత్నం, ఆలోచనా విధానం మెల్లిగా ఫ్యాషన్, లైఫ్‌స్టయిల్ రంగంలో ఎక్కువ ప్రాధాన్యం పొందింది. ఈ రంగాల్లో చిన్న, మధ్యతరగతి వ్యాపారులను ఎక్కువ ఆకర్షించింది. మరోవైపు మార్కెట్ నిపుణులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగ మిత్రుల సాయం తీసుకుంది. ఇట్లా జిలింగోను విస్తృత పరుచుకుంటూ వచ్చింది. ప్రస్తుతం విదేశాల్లోనూ విస్తరించింది. ప్రధాన కార్యాలయం సింగపూర్‌లో ఏర్పాటు చేసింది. ధృవ్‌కపూర్ సారథ్యంలో వంద మంది ఉద్యోగులు బెంగళూర్ నుంచే పని చేస్తున్నారు.

ఏడాది కాలం నాటికి జిలింగో ఆగ్నేయాసియాలో విస్తరించింది. వందలాది మంది వ్యాపారస్థులను ఈ స్టార్టప్‌లోకి చేర్చింది.

ఇట్లా నాలుగేండ్ల కాలంలోనే జిలింగో ఫ్యాషన్ ప్రపంచంలో ఎక్కడాలేని ప్రాధాన్యం పొందింది. సుమారు ఎనిమిది దేశాల్లోన్ని 15 మహానగరాల్లో జిలింగో కార్యాలయాలున్నాయి. హాంకాంగ్‌తో సహా ఈ దేశాల్లో సుమారు 500 మంది ఉద్యోగులను జిలింగో కలిగి ఉంది. మరోవైపు జిలింగో మహిళా ఔత్సాహికులను ప్రోత్సహించడం, యువ డిజైనర్లకు అవకాశాలివ్వడంలో ముందుంది. వారికి మార్కెట్ అవకాశాలు కల్పించడంలో సాయపడుతుంది.

జిలింగో కిందటి ఏడాదే నాలుగు రెట్ల ఆదాయాన్ని పొందింది. దాని వార్షిక ఆదాయం వంద కోట్లుగా అంచనా. ఇట్లా సార్టప్ ప్రపంచంలో వంద కోట్ల డాలర్ల ఆదాయాన్ని పొందిన తొలి స్టార్టప్ మహిళా సీఈఓగా అంకితి పేరుగాంచింది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావశీలురైన యువ పారిశ్రామికవేత్తల్లో అంకితి చోటు దక్కించుకుంది. ఇంత పెద్ద 'జిలింగో' ప్రారంభించినప్పుడు అంకితి వయసు 23 ఏండ్లు మాత్రమే..




**న్యూయార్క్‌కు చెందిన 'ఫార్చ్యూన్' మ్యాగజైన్ 40 అండర్ 40 జాబితాను ఏటా విడుదల చేస్తుంటుంది. ప్రపంచంలో అత్యంత ప్రభావశీలురైనా 40 మంది యువ, స్ఫూర్తిదాయక పారిశ్రామికవేత్తల జాబితా అది. ఇందులో భారతదేశం నుంచి చోటు దక్కించుకుంది అకింతి. ఈ జాబితాలో భారతదేశం నుంచి ఉన్న ఇద్దరిలో అంకితి ఒకరు. అందులో ఏకైక మహిళ కావడం విశేషం. ఇట్లా ఇండియాలోనే వందకోట్ల స్టార్టప్‌నకు స్ఫూర్తిదాయక మహిళా సీఈఓగా అంకితి రికార్డు సృష్టించింది.**

...వినోద్ మామిడాల

## పైపుల్లో సేంద్రియ పంట!



**నాలుగేండ్ల క్రితం ఇల్లు కట్టారు. ఎన్నో పైపుల ముక్కలు మిగిలాయి. ఇంటి పైన, ఆవరణలో పడేశారు. కొన్ని పగిలిపోయాయి. మరికొన్ని పిల్లలకు ఆట వస్తువులుగా మిగిలిపోయాయి. చెత్తకుండీలో పడేద్దామని ఆ కుటుంబీకులనుకున్నారు. కానీ, అప్పడామె సూక్ష్మదృష్టితో వాటిని పరిశీలించింది. ఆ చూపు ఇంటికి కూరగాయలే కొనాల్సిన అవసరం లేకుండా చేసింది.**

మరియా సిమి స్వగ్రామం కేరళలోని పొత్తూర్. ఆమె ఓ సాధారణ గృహిణి అయినా.. అసాధారణంగా ఆలోచించింది. అందుకే ఆమె ప్రస్తుతం వార్తల్లో నిలిచింది. తన సొంత ఇంటి నిర్మాణం అనంతరం చాలావరకు పైపుల ముక్కలు మిగిలాయి. వాటిని ఇంటి ఆవరణలో వృథాగా పడేశారు. పిల్లలు వాటిలో మట్టిని నింపి ఆడుకున్నారు. కొన్నాళ్ల తర్వాత పగిలిన ఆ పైపులోంచి ఓ అద్భుతం కనిపించింది. పచ్చని మొలక ఒకటి ఆమెను కొత్తగా ఆలోచించేలా చేసింది. . 'ఈ పైపుల్లో మొక్క ఎలా మొలిచింది' అనే ఆలోచన ఆమెను ఊరికే ఉండనివ్వలేదు. దీన్ని ఆధారంగా చేసుకొని కూరగాయలు పండించాలనుకుంది. ఇందుకోసం కొబ్బరి పీచు, ఆవుపేడ, మట్టిని పైపుల్లో నింపింది. పైపులకు అక్కడక్కడా రంధ్రాలు చేసింది. వాటిలో కూరగాయల విత్తనాలు నాటింది. ప్రతిరోజూ పైపుల్లోని మట్టి తడిసేట్లుగా కొద్దికొద్దిగా నీళ్లు అందించింది. కొన్నాళ్లకు పూత, కాత మొదలైంది. అలా ఇంటి వెనుకాల ఉన్న స్థలంలో, డాబాపైన కూరగాయలు, ఆకుకూరలు, కొత్తిమీర, పుదీనా, క్యారెట్ వంటివి పండిస్తున్నది. గత ఏడాది నుంచి ఆ కుటుంబం బయట కూరగాయలు కొనడమే మానేసింది. మరియా సిమి భర్త, పిల్లలు మొక్కల్ని సంరక్షిస్తున్నారు. 'రసాయనాలు లేని కూరగాయలు ఎంతో రుచిగా ఉన్నాయి. నా ఈ ప్రయత్నం వల్ల అతి తక్కువ ఖర్చులోనే కూరగాయలు పండుతున్నాయి' అని మరియా సిమి చెబుతున్నది.

## జిడ్డును తొలగించుకోండి..



**కొందరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ముఖం జిడ్డుగానే ఉంటుంది. దాంతో తరచూ మొటిమలు వస్తుంటాయి. కానీ ఈ చిన్న చిట్కాలు పాటిస్తే కాంతివంతమైన చర్మాన్ని పొందవచ్చు.**

- చర్మం లోపల నూనె గ్రంథులుంటాయి. ఇవి చర్మాన్ని తాజాగా ఉంచడానికి సహాయపడుతాయి. కానీ ఇవి కొందరిలో ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. అలాంటి సమయంలో చర్మం జిడ్డుగా మారుతుంది. ఆపిల్ జ్యూస్ లేదా నిమ్మరసం తీసుకుని ముఖానికి రాయాలి. ఇలా వారం పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- పాలు ముఖానికి రాసుకోవాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడగాలి. పాలు చమురుగా ఉంటాయి. కానీ ఇందులో క్యాల్షియం, లాక్టిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి ముఖాన్ని కాంతివంతంగా చేస్తాయి.
- కొంత తేనెను అరచేతిలోకి తీసుకొని ముఖానికి పూత పూసుకొని పూర్తిగా ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే చర్మంలో పేరుకుపోయిన మురికి తొలిగిపోతుంది. క్రమం తప్పకుండా వారం రోజులు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- రోజుకు కనీసం 6 సార్లు ముఖాన్ని కడుక్కోవాలి. ఈ సమయంలో సబ్బును వాడొద్దు. ఒక జగ్ నీటిలో ఒక నిమ్మ చెక్క రసం వేయాలి. ఈ నీటితో ముఖం కడగాలి. ఐస్ క్యూబ్స్‌తో రోజూ 2 నిమిషాలు ముఖాన్ని మర్దన చేసినా జిడ్డు తొలిగిపోతుంది.
- ఒక జగ్ నీళ్లు తీసుకొని అందులో చెంచాడు ఉప్పు వేయాలి. ఆ నీటిని స్ప్రే బాటిల్‌లో పోయాలి. ఈ నీటిని రోజులో మూడుసార్లు ముఖంపై స్ప్రే చేయాలి. పూర్తిగా ఆరనివ్వాలి. ఇలా వారం రోజులు చేస్తే కాంతివంతమైన ముఖ చర్మం మీ సొంతమవుతుంది.

### వంటింటి చిట్కాలు



- కోడిగుడ్లను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికిస్తే పై పెంకు త్వరగా ఊడి వస్తుంది.
- కూరలో కారం ఎక్కువైతే కొంచెం టమాటా రసం అందులో కలిపితే సరిపోతుంది.
- దోశలు పెనానికి అంటకుండా ఉండాలంటే ఉప్పు నీటిలో గుడ్డను ముంచి పెనం మీద తుడవాలి. ఆ తర్వాత నూనె రాసి దోశలు వేస్తే పెనానికి అంటుకోవు.
- క్యాబేజీ వాసన రాకుండా ఉండాలంటే వండేటప్పుడు ఒక చిన్న అల్లం ముక్క వేయాలి.
- కత్తిపీట పదును తగ్గిపోతే కాస్త ఉప్పును రెండువైపులా రాయాలి.
- వడియాలు తెల్లగా రావాలంటే వడియాల పిండిలో కొంచెం నిమ్మరసం కలపాలి.

## దేశంలో అందరికీ వైద్యం!




**నాడీ సంబంధిత సమస్య, గుండెపోటు, రక్తపోటు, మూర్ఛ.. సమస్య ఏదైనా, దానికి సంబంధించిన సమాచారం క్షణాల్లోనే తెలుసుకోవచ్చు. అదీ కేవలం ఒక్క ఫోన్ కాల్ ద్వారా. 18001020237 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి, మనదేశంలోని మారుమూల ప్రాంతాల్లో ఎక్కడి నుంచైనా సమాచారం తెలుసుకోవచ్చు.**

**ఈ** అద్భుతమైన అవకాశాన్ని తీసుకొచ్చింది మన తెలుగింటి ఆడబిడ్డే. పేరు డాక్టర్ బిందు మీనన్. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ప్రముఖ న్యూరాలజిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యాధులపై అవగాహన ఉంటే ఎక్కడ ఎంత ఖర్చు పెట్టాలో తెలుస్తుంది. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ నుంచి బయటపడొచ్చు కూడా. ఈ ఆలోచనతోనే 2013లో 'న్యూరాలజీ ఆన్ వీల్స్' అనే వైద్య సంస్థను ప్రారంభించించారు బిందు. ఈ సంస్థ ద్వారా ప్రత్యేకమైన వ్యాన్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలను సందర్శించి ఉచిత వైద్యం అందిస్తున్నారు. వ్యాధుల బారిన పడడానికి కారణం.. సమస్యలపై అవగాహనలేకపోవడమేని అంటున్నారు డాక్టర్ బిందు. రక్తపోటు, గుండెపోటు, మూర్ఛ, నాడీ సంబంధిత వ్యాధులకు సంబంధించి 160కు పైగా అవగాహనా శిబిరాలు నిర్వహించారు బిందు. ఇవేకాకుండా స్త్రీ జననేంద్రియాలకు సంబంధించిన సమస్యలకూ పరిష్కారం చూపుతున్నారు. ఎవరైనా పేదలు ఆమెను సంప్రదిస్తే.. మెరుగైన వైద్యం చేసి, ఆపరేషన్లకు తనకు తెలిసిన పెద్ద వైద్యుల వద్దకు పంపుతున్నారు. పేద వారికి నెలపాటు ఉచితంగా మందులు కూడా అందిస్తున్నారు. ఎవరికైనా మూర్ఛ వ్యాధి వచ్చినప్పుడు.. పక్కనున్న వారికి ఏం చేయాలో తెలియదు. ఆలాంటి క్లిష్ట సమయాల్లో 1800 1020237 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేస్తే.. మూర్ఛవ్యాధిగ్రస్థులను ఎలా కాపాడాలో మార్గదర్శకాలు చెబుతారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ మార్గదర్శకాలు ఉంటాయి. ఆమె తండ్రి కేఎమ్ఆర్ నంబియార్ కూడా కూతురు స్థాపించిన సంస్థలో పనిచేస్తున్నారు. ఈ సంస్థలో భాగమైనందుకు గర్వపడుతున్నానని చెబుతున్నారు. ఇప్పటివరకు ఈ సంస్థ 3 వేలమందికి పైగా ఉచిత వైద్యం అందించింది.



### ఆరోగ్య చిట్కాలు



- ముక్కు కారడంతో బాధపడుతున్నవారికి పెరుగు, బెల్లం కలిపి రోజుకు రెండు పూటలు తింటే తగ్గుతుంది.
- నెయ్యిలో బెల్లం వేసి కరిగించి.. కాస్త వేడి చేసి నొప్పి ఉన్న చోట వేస్తే బాధ నివారణ అవుతుంది.
- బెల్లం, నెయ్యి సమపాళ్లలో కలిపి తింటే 5-6 రోజుల్లో మైగ్రేన్ తలనొప్పి తగ్గుతుంది.
- బెల్లంలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది కణాల్లో ఆమ్లాలు, అసిటోన్లపై దాడి చేసి ఆమ్ల సమతౌల్యాన్ని కాపాడుతుంది.
- భోజనం చేసిన తర్వాత ప్రతిసారి చిన్న బెల్లం ముక్క తినడం ద్వారా అసిడిటీని తగ్గించుకోవచ్చు.
- లివర్‌ను శుభ్రపరిచేందుకు బెల్లం చక్కగా ఉపయోగపడుతుంది.
- బెల్లం తింటే లివర్‌లోని హానికర వ్యర్థాలు, విష పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. రోజుకు 50 గ్రాముల బెల్లం తినడం మంచిది.

నమస్తే తెలంగాణ

# జీవనరేఖ

[ కరీంనగర్ ]

మంగళవారం 15 అక్టోబర్ 2019



ఒకప్పుడు ఆపరేషన్ అంటే కత్తులు, కటార్లతో పెద్ద కోతలు పెట్టి చేసేవాళ్లు. ఎక్కడ సర్జరీ అవసరం అయితే అక్కడ కోసి లోపలున్న అవయవాలను సరిచేసేవాళ్లు. కాని అభివృద్ధి చెందిన వైద్యరంగం కష్టంలేని సర్జరీలను ఆవిష్కరిస్తున్నది. అలా వచ్చిందే లాపరోస్కోపిక్ సర్జరీ. ఇప్పుడు లాపరోస్కోపిక్ సర్జరీల కన్నా ఆధునికమైన రోబోలు వచ్చేశాయి. ఎక్కువ రక్తం పోకుండా అటు డాక్టర్‌కూ, ఇటు రోగికీ చాలా సౌకర్యవంతమైన శస్త్రచికిత్సలుగా ఇవి అత్యధిక ప్రయోజనాలనిస్తున్నాయి. కిడ్నీ సంబంధ సమస్యల చికిత్సల్లో కూడా ఇప్పుడు రోబోలు చకచకా సర్జరీలను చేసేస్తున్నాయి.

# కిడ్నీ సమస్యలకు అత్యాధునిక రోబోటిక్ సర్జరీలు

**నాలుగు** నెలల క్రితం...
ఆపరేషన్ థియేటర్ అంతటా ఉత్కంఠ నిండి ఉంది.
ఆపరేషన్ బెడ్ మీద 9 నెలల బాబు. అతనికి పుట్టుకతోనే కిడ్నీలో సమస్య ఉంది. అతనికి అదనంగా మరో మూత్రనాళం ఉంది. నిజానికి అంత పసివాడికి ఆపరేషన్ అంటే డాక్టర్‌కి కత్తి మీద సామే. కాని ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ చాలా కూల్‌గా ఉన్నాడు. చకచకా ఆపరేషన్ జరిగిపోతోంది.
కారణం..
డావిన్సీ రోబో..!
లోపలి అవయవాలను స్క్రీన్ మీద 3 డైమెన్షనల్‌గా చూస్తూ ఒకవైపు ఆపరేట్ చేస్తున్నాడు డాక్టర్. మరోవైపు రోబో యంత్రం తన చేతులతో పేషెంట్‌కి ఆపరేషన్ నిర్వహిస్తోంది. రోబో చేస్తున్న ఆపరేషన్ అంతా డాక్టర్ కంట్రోల్‌లో ఉంది.
ఆ పసివాడికి ఏ సమస్యా లేకుండా చాలా కచ్చితత్వంతో, రక్తస్రావం లేకుండా ఆపరేషన్ అయిపోతుందన్న నిశ్చింతతో రోబోని ఆపరేట్ చేస్తున్నాడాయన.
కట్ చేస్తే...
ఇప్పుడు ఆ బాబు పూర్తి ఆరోగ్యంతో ఉన్నాడు.
ఇందుకు రోబో చేసిన సర్జరీ ఒక కారణమైతే, దాన్ని సమర్థంగా కంట్రోల్ చేసిన డాక్టర్ మరో కారణం.

## బాబుకేమైంది?

బాబుకి పదే పదే జ్వరం రావడంతో పీడియాట్రీషియన్ దగ్గరికి వెళ్లారు. మూత్రపరీక్ష, అబ్డామినల్ స్కాన్ చేయించారు. మూత్రంలో ఇన్‌ఫెక్షన్, కిడ్నీ నిర్మాణంలో తేడా ఉన్నట్టు ఇందులో తేలింది. ఆపరేషన్ ద్వారా దాన్ని సరి చేయాలని చెప్పారు డాక్టర్లు.
మనకు ఉండేవి రెండు కిడ్నీలు. సాధారణంగా ఒక కిడ్నీ నుంచి ఒక మూత్రనాళం వస్తుంది. అలా రెండు మూత్రనాళాలు వెళ్లి యూరినరీ బ్లాడర్ (మూత్రకోశం)లో తెరుచుకుంటాయి. కాని ఈ బాబులో కుడి కిడ్నీ బాగానే ఉంది. కానీ ఎడమ కిడ్నీ రెండుగా విడిపోయి, రెండు భాగాల నుంచి రెండు మూత్రనాళాలు ఏర్పడ్డాయి. కుడి కిడ్నీలోని మూత్ర నాళంతో పాటుగా ఎడమ కిడ్నీలోని రెండింటిలో ఒక మూత్రనాళం బ్లాడర్‌లోకి, మరోటి ప్రొస్టేట్‌లోకి తెరుచుకున్నాయి. దాంతో ప్రొస్టేట్ దగ్గరి మూత్రనాళం బ్లాక్ అయింది. అందువల్ల యూరిన్ ఇన్‌ఫెక్షన్ వచ్చి, కిడ్నీలో వాపు వచ్చింది.




ఆ భాగం సరిగా పనిచేయకుండా పోయింది. సీటీ స్కాన్‌లో సమస్య కనుక్కొని సర్జరీ చేశారు. రోబోటిక్ సర్జరీతో అదనపు మూత్రనాళాన్ని కత్తిరించేసి, రెండవ మూత్రనాళానికి కలిపారు. పసిపిల్లవాడైనా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా సేఫ్‌గా సర్జరీ పూర్తయింది. బాబును మూడో రోజే ఇంటికి పంపించారు.
ఇలాంటి ఎన్నో రకాల కిడ్నీ సమస్యలకు సురక్షితమైన పరిష్కారం చూపిస్తున్నది రోబోటిక్ సర్జరీ.



## రోబోతో లాభాలూ.. నష్టాలూ..

రోబో ఒక యంత్రం కాబట్టి దీనిలో మృదువైన కణజాలమేదో, గట్టిగా ఉన్నదేదో తెలియదు. కాని ఇందువల్ల పెద్దగా నష్టాలేమీ ఉండవు. ఇక పోతే ప్రస్తుతం కేవలం ఒకే కంపెనీ రోబో యంత్రాన్ని తయారుచేస్తోంది కాబట్టి ఖర్చు ఎక్కువ. ఇలాంటి వాటితో పోలిస్తే రోబోటిక్ సర్జరీతో కలిగే ప్రయోజనాలే ఎక్కువ.

- కోత ఉండదు కాబట్టి ఇది మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ
- అధిక రక్తస్రావం ఉండదు.
- సర్జరీ తొందరగా అయిపోతుంది.
- 10 వంతులు ఎక్కువ మాగ్నిఫికేషన్ ఉంటుంది. అంటే చిన్నవి కూడా పదొంతులు ఎక్కువ పెద్దగా కనిపిస్తాయి. కాబట్టి లోపలి అవయవాలను చాలా స్పష్టంగా చూడొచ్చు. చిన్న చిన్న నాడులు కూడా కనిపిస్తాయి కాబట్టి పొరపాటున వాటిని కట్ చేయకుండా ఉంటారు.
- ఇది పూర్తిగా పేషెంట్ సేఫ్టీ సర్జరీ. ఎటువంటి దుష్ప్రభావాలూ ఉండవు.

## ఓపెన్ నుంచి రోబో వరకు..

వైద్యరంగంలో ఎన్ని మార్పులు వచ్చినా పేషెంట్ సేఫ్టీనే చివరి లక్ష్యంగా ఉంటుంది. మెరుగైన వైద్యాన్ని, సౌకర్యవంతంగా, సేఫ్‌గా అందించే దిశగా నిరంతరం పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అలాంటి పరిశోధనల ఫలితమే ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన రోబోటిక్ సర్జరీ. మొదట్లో సర్జరీ అంటేనే పెద్ద కోత పెట్టి చేసే ఓపెన్ సర్జరీయే. గుండె, ఊపిరితిత్తులకు సంబంధించినవైతే ఛాతి తెరిచి సర్జరీ చేయాలి. పొట్టలోని అవయవాలకు సంబంధించిందైతే పొట్టపై గాటు పెట్టాలి. కాని లాపరోస్కోపిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చిన తరువాత పెద్ద కోత అవసరం లేకుండా మూడు నాలుగు రంధ్రాలు మాత్రమే పెట్టి చేసే కీహోల్ సర్జరీ రోగులకు వరమైంది. కిడ్నీకి సంబంధించిన ఆపరేషన్లకు కూడా లాపరోస్కోపీ చేసేవాళ్లు. అయితే లాపరోస్కోపిక్ సర్జరీల్లో ఉండే లోపాలు కూడా లేనిది రోబోటిక్ సర్జరీ.



## ఓపెన్ సర్జరీ

కిడ్నీలు, ఇతర మూత్ర వ్యవస్థ అవయవాలను చూడాలంటే కూడా పెద్ద కోత పెట్టాల్సి వచ్చేది. ఇందుకోసం 15 నుంచి 20 సెం.మీ. కోత పెట్టాల్సి వస్తుంది. అందువల్ల నొప్పి చాలా ఉంటుంది. నొప్పి తగ్గడానికి పెయిన్ కిల్లర్లు వాడాల్సి వస్తుంది. దాంతో ఈ నొప్పి తగ్గించే మాత్రల వల్ల కలిగే దుష్ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పెద్ద కోత పెట్టి ఓపెన్ చేస్తారు కాబట్టి శస్త్రచికిత్స సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. కాబట్టి రికవర్ కావడానికి ఎక్కువ కాలం పడుతుంది. హాస్పిటల్‌లోనే 10 రోజులు ఉండాల్సి ఉంటుంది. ఆ తర్వాత కోలుకోవడానికి 15 నుంచి 20 రోజులు పడుతుంది. ఆపరేషన్ సమయంలో పెట్టిన పెద్ద కోత గాయమవుతుంది. ఇది తొందరగా మానకపోతే ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. అంతేకాదు హెర్నియా లాంటి సమస్యలు కూడా రావొచ్చు. అప్పుడు సమస్య మరింత జటిలం అవుతుంది.

## లాపరోస్కోపిక్ సర్జరీ

లాపరోస్కోపీ అందుబాటులోకి వచ్చిన తరువాత శరీరాన్ని కోసే బాధ తప్పింది. కత్తుల గాట్లు లేకుండా చిన్న చిన్న రంధ్రాలతో లోపలికి కెమెరా, లాపరోస్కోపిక్ పరికరాన్ని పంపి సర్జరీ చేయవచ్చు. లోపలి అవయవాలను స్క్రీన్ మీద స్పష్టంగా చూడవచ్చు. వాటిని తెర మీద చూస్తూ లోపల సర్జరీ చేయవచ్చు. లాపరోస్కోపిక్ పరికరం 2డి విజన్‌ను కలిగివుంటుంది. అందువల్ల లోపలి అవయవాలను 2 డైమెన్షనల్‌గా చూపిస్తుంది. కోత ఉండదు. 1 సెం.మీ. రంధ్రం పెడితే చాలు. ఇలాంటి రంధ్రాలు మూడు నాలుగు చేస్తారు. పెద్ద గాటు ఏమీ ఉండదు కాబట్టి ఆపరేషన్ సమయంలో రక్తం పోయే అవకాశం ఉండదు. చాలా తక్కువ బ్లడ్ లాస్ ఉంటుంది. లాపరోస్కోపీ ద్వారా ఆపరేషన్ చేయించుకుంటే హాస్పిటల్‌లో మూడు నాలుగు రోజులుంటే చాలు. ఆ తర్వాత తొందరగా కోలుకుంటారు. అయితే కొన్ని ప్రొసిజర్లను లాపరోస్కోపీలో చేయడం చాలా కష్టం. ఉదాహరణకి రీకన్‌స్ట్రక్టివ్ ప్రొసిజర్లను లాపరోస్కోపీ ద్వారా చేయడం కష్టం. మూత్రనాళం బ్లాక్ అయినప్పుడు దాన్ని కట్ చేసి బ్లాక్ తీసేసి మళ్లీ జాయిన్ చేయాల్సి ఉంటుంది. లాపరోస్కోపీలో కుట్లు వేయడం కష్టం అవుతుంది. ఇలాంటప్పుడు ఓపెన్ చేసి చేయాల్సి వచ్చేది. అదేవిధంగా కిడ్నీలో ట్యూమర్ ఉంటే కణితి వరకే తీసేసి మిగిలింది కుట్లు వేయాలి. ఇది లాపరోస్కోపీతో కష్టం. దీనికి స్కిల్ అవసరం. ఎంతో అనుభవం కావాలి. స్థూలకాయం ఉన్నవాళ్లలో కూడా ఆపరేషన్ లాపరోస్కోపీతో కష్టమవుతుంది.

## రోబోటిక్ సర్జరీ

రోబోతో చేసే సర్జరీకి డాక్టర్ చేతులు అవసరం లేదు. రోబో చేతులతోనే సర్జరీ చేయిస్తారు. తెరమీద లోపలి అవయవాలను చూస్తూ రోబో పరికరాన్ని ఎటు ఎలా తిప్పాలనేది డాక్టర్ కంట్రోల్ చేస్తుంటారు. అందుకు అనుగుణంగా రోబో చేతులు చకచకా ఆపరేషన్ చేసేస్తుంటాయి. రోబోటిక్ సర్జరీకి కూడా పెద్ద కోత పెట్టాల్సిన అవసరం లేదు. దీనికి కూడా లాపరోస్కోపీ లాగానే 1 సెం.మీ. రంధ్రం మూడు నాలుగు వేయాలి. రోబోటిక్ సర్జరీ చేయడానికి పెద్దగా స్కిల్స్ అవసరం లేదు. టెక్నాలజీ తెలిసి, కొద్దిగా అనుభవం ఉంటే చాలు. లాపరోస్కోపీ ద్వారా చేయలేని సర్జరీలను రోబోతో చేయొచ్చు. రోబో యంత్రానికి 3డి విజన్ ఉంటుంది. అందుకే లోపలి అవయవాలను 3 డైమెన్షనల్‌గా చూడవచ్చు. ఓపెన్ సర్జరీలో డాక్టర్ తన చేతులతో చేసినట్టు ఇక్కడ రోబో చేతులతో చేయించవచ్చు. మన చేతులను గుండ్రంగా తిప్పగలిగినట్టుగానే రోబో చేయిని కూడా 360 డిగ్రీలలో తిప్పవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే చెయ్యి కన్నా కూడా బెటర్. అప్పుడప్పుడు చెయ్యి వణికి అటు ఇటు కదలిపోవచ్చు. కాని రోబో చెయ్యి వణకదు. లాపరోస్కోపీలో అయితే ఒకరు కెమెరా పట్టుకుని ఉండాలి. కాని ఇందులో రోబో యంత్రానికే కెమెరా అమర్చి ఉంటుంది.
లోతుగా ఉండే భాగాలకు చేసినప్పుడు కూడా సర్జరీ సులువు అవుతుంది. స్థూలకాయులకు కూడా చాలా సులువుగా కిడ్నీ సర్జరీలను చేయొచ్చు.

**డాక్టర్ వి. సూర్యప్రకాశ్**
**సీనియర్ యూరాలజిస్ట్ అండ్ రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్**
**యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ**
**హైదరాబాద్, 8121022333**



## ఏ సమస్యలకు?

### ప్రొస్టేట్ క్యాన్సర్



ప్రొస్టేట్ గ్రంథిలో సమస్యలున్నప్పుడు ముఖ్యంగా క్యాన్సర్ ఉన్నప్పుడు దాన్ని తొలగించాల్సి వస్తుంది. దీన్ని రాడికల్ ప్రొస్టెక్టమీ అంటారు. లాపరోస్కోపీ ద్వారా ప్రొస్టేట్‌ను తీసేసినప్పుడు దాని చుట్టుపక్కలున్న చిన్న నాడులు సరిగా కన్పించక పొరపాటున అవి తెగిపోయేందుకు అవకాశం ఉంటుంది. అందువల్ల వాళ్లలో వంధ్యత్వం వస్తుంది. ప్రొస్టేట్ క్యాన్సర్ తొలగిపోయి, ప్రాణాపాయం లేకపోయినప్పటికీ వాళ్లు ఇంపొటెంట్ కావడం చాలా బాధాకరంగా ఉంటుంది. ఇలాంటప్పుడు ఈ సమస్య రాకుండా సర్జరీ చేయడం రోబోటిక్స్ ద్వారా సాధ్యమవుతుంది. లోపలున్న అన్ని శరీర భాగాలూ 10 వంతులు ఎక్కువ పెద్దగా కనిపించడం వల్ల చిన్న చిన్న నాడులు కనిపించకపోయే ప్రసక్తే లేదు. కాబట్టి అవి తెగిపోకుండా జాగ్రత్తగా సర్జరీ చేయడం సాధ్యమవుతుంది.

### కిడ్నీ ట్యూమర్లు



పెద్ద పెద్ద ట్యూమర్లు ఉంటే కొన్ని సందర్భాల్లో కిడ్నీ మొత్తాన్నీ తీసేయాల్సి వస్తుంది. దీన్ని రాడికల్ నెఫ్రెక్టమీ అంటారు. కాని చిన్న సైజు ట్యూమర్లు ఉన్నప్పుడు కణితి వరకు మాత్రమే తీసేసి, మిగిలిన కిడ్నీని కాపాడవచ్చు. దీన్ని పార్షియల్ నెఫ్రెక్టమీ అంటారు. ఓపెన్, లాపరోస్కోపీ, రోబోటిక్ సర్జరీలన్నిటి ద్వారా కూడా పార్షియల్ నెఫ్రెక్టమీ చేయొచ్చు. కానీ రోబోటిక్స్ ద్వారా సమర్థవంతంగా చేయవచ్చు.
ట్యూమర్ తీసేసేటప్పుడు కిడ్నీ కట్ చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు రక్తం ఎక్కువగా పోతుంది. ఇది అరగంట కన్నా ఎక్కువ సేపు అయితే కిడ్నీ డ్యామేజి అవుతుంది. లాపరోస్కోపీలో ఇది కష్టం అవుతుంది. కాని రోబో ద్వారా కిడ్నీ కట్ చేయడం, కుట్లు వేయడం అన్ని తొందరగా అయిపోతాయి. కాబట్టి అధిక రక్తస్రావం ఉండదు. కిడ్నీ దెబ్బతినేందుకు ఆస్కారం ఉండదు.

### బ్లాడర్ క్యాన్సర్



మూత్రకోశంలో క్యాన్సర్ ఉన్నప్పుడు దాన్ని సర్జరీ ద్వారా తీసేయాల్సి వస్తుంది. ఇలా బ్లాడర్‌ను తొలగించినప్పుడు రకరకాల పద్ధతుల ద్వారా బ్లాడర్ లాంటి నిర్మాణాన్ని తయారుచేస్తారు. ఈ సర్జరీకి రోబోటిక్స్ బాగా ఉపయోగపడుతుంది. బ్లాడర్‌ను తీసేసిన తరువాత మూత్రనాళాన్ని పేగుకు కలుపుతారు. కొన్నిసార్లు పేగులోపలే ఒక సంచీలాంటి నిర్మాణాన్ని అమరుస్తారు. ఇది బ్లాడర్ లాగా పనిచేస్తుంది. అయితే ఇలాంటప్పుడు మూడు నాలుగు గంటలకోసారి పైపు ద్వారా యూరిన్‌ను బయటకు తీయాలి. కొందరికి మూత్రనాళాన్ని పేగుకు కలిపిన తరువాత శరీరం బయట స్టోమా లాగా సంచీని ఏర్పాటు చేస్తారు. మరో పద్ధతి పేగుతోనే కొత్త బ్లాడర్‌ను తయారుచేయడం. ఇలా తయారుచేసిన బ్లాడర్‌ను మూత్రనాళానికి కలుపుతారు. ఇలాంటి చికిత్సల్లో రోబోటిక్స్ బాగా ఉపయోగపడుతాయి.

### గైనిక్ సర్జరీల తరువాత..



కొన్నిసార్లు స్త్రీ సంబంధ సమస్యలున్నప్పుడు చేసిన గైనిక్ సర్జరీల వల్ల ఫిస్టులా ఏర్పడి దాన్ని తొలగించాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు రోబోటిక్ సర్జరీ మంచి ఫలితాన్నిస్తుంది. ఉదాహరణకు హిస్టరెక్టమీ, ఫైబ్రాయిడ్స్ లాంటి సర్జరీల తరువాత బ్లాడర్ డ్యామేజి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. బ్లాడర్‌కి, వెజైనాకి మధ్యలో ఫిస్టులా ఏర్పడవచ్చు. దీన్ని వెసైకో వెజైనల్ ఫిస్టులా అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు మూత్రం ఎప్పుడూ లీక్ అవుతూనే ఉంటుంది. ప్యాడ్స్ పెట్టుకోవాల్సి వస్తుంది. ఇది చాలా ఇబ్బందికరమైన సమస్య. రోబో యంత్రం ద్వారా ఫిస్టులాను కత్తిరించి, మిగిలిన భాగాన్ని జాయింట్ చేస్తారు. దాంతో మూత్రం లీక్ సమస్య పోతుంది. యురెటిరో వెజైనల్ ఫిస్టులా ఉన్నప్పుడు కూడా ఫిస్టులా కట్‌చేసి, నార్మల్ మూత్రానాళాన్ని మూత్రాశయానికి అటాచ్ చేస్తారు. గైనకాలాజికల్ క్యాన్సర్లు ఉన్నప్పుడు, రెక్టల్ క్యాన్సర్ ఉన్నప్పుడు కూడా రోబోటిక్ సర్జరీ మంచి ఫలితాన్ని ఇస్తుంది.

### రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ



పుట్టుకతో మూత్రవిసర్జన వ్యవస్థలో ఏ లోపం ఉన్నా దాన్ని రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ ద్వారా సరిచేస్తారు. ఈ సమస్యలు పుట్టుకతోనే బయటపడవచ్చు. కొందరిలో పుట్టిన కొన్నాళ్ల తరువాత బయటపడవచ్చు. మూత్రనాళంలో ఎక్కడ బ్లాక్ ఉన్నా ఈ సర్జరీ ద్వారా సరిచేస్తారు. అలాంటి సర్జరీల్లో పైలోప్లాస్టీ ఒకటి. కొందరిలో పుట్టుకతోనే కిడ్నీ, మూత్రనాళం (యురెటర్) కలిసేచోట బ్లాక్ ఉంటుంది. దీన్ని పెల్వి యురెటర్ జంక్షన్ అబ్‌స్ట్రక్షన్ అంటారు. ఈ సమస్య కొందరిలో పుట్టుకతోనే బయటపడితే, మరికొందరిలో కొన్నాళ్ల తరువాత బయటపడుతుంది. ఈ బ్లాక్ తీసేయడానికి, బ్లాక్ భాగాన్ని కట్ చేసి, తిరిగి కుట్లు వేస్తారు. దీన్ని పైలోప్లాస్టీ సర్జరీ అంటారు. రోబోటిక్స్ ద్వారా ఈ సర్జరీ సులువు అవుతుంది.

### అబ్‌స్ట్రక్టివ్ మెగా యురెటర్




మూత్రనాళం కిడ్నీ నుంచి బయలుదేరి, యూరినరీ బ్లాడర్ (మూత్రకోశం) లోకి వెళ్తుంది. ఇలా మూత్ర నాళం బ్లాడర్‌లో ప్రవేశించే చోట బ్లాక్ ఏర్పడితే కిడ్నీ డ్యామేజి అవుతుంది. ఇలాంటప్పుడు కూడా బ్లాక్ ఉన్న మూత్రనాళ భాగాన్ని కత్తిరించివేసి, మిగిలిన భాగాలను తిరిగి కుట్లువేసి అతికిస్తారు.

### రిఫ్లక్స్

మూత్రం కిడ్నీలో తయారై మూత్రనాళం ద్వారా బ్లాడర్‌లో ప్రవేశించి, అక్కడి నుంచి బయటికి వెళ్లిపోవడం సహజమైన ప్రక్రియ. కాని కొందరిలో పుట్టుకతో లోపం వల్ల మూత్రం బ్లాడర్‌లో నుంచి బయటికి వెళ్లకుండా తిరిగి వెనక్కి కిడ్నీవైపు వెళ్లిపోతుంది. దీన్ని రిఫ్లక్స్ డిసీజ్ అంటారు. ఇలాంటప్పుడు మూత్రం కిడ్నీలోకి చేరి, ఇన్‌ఫెక్షన్ అవుతుంది. క్రమంగా కిడ్నీ దెబ్బతినవచ్చు. ఈ సమస్యకు కూడా రోబోటిక్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ మంచి పరిష్కారం చూపిస్తుంది.

---

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

## వరంగల్ నిట్‌లో

**వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో పీహెచ్‌డీలో ప్రవేశానికి ప్రకటన విడుదలైంది.**

- **ప్రోగ్రామ్:** పీహెచ్‌డీ (డిసెంబర్ సెషన్)
- **విభాగాలు:** ఇంజినీరింగ్, సైన్సెస్, ఇంగ్లిష్, మేనేజ్‌మెంట్
- ఈ ప్రోగ్రామ్ రెండు రకాలుగా ఉంది. ఫుల్‌టైం, పార్ట్‌టైం.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో అక్టోబర్ 16 నుంచి ప్రారంభం
- **వెబ్‌సైట్:** www.admisssions.nitw.ac.in




**బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో)లో ఎంఎస్‌డబ్ల్యూ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

## బీఆర్‌వోలో 540 పోస్టులు

- **పోస్టు:** మల్టీ స్కిల్డ్ వర్కర్ (డ్రైవర్ ఇంజిన్ స్టాటిక్)
- **మొత్తం ఖాళీలు:** 540. వీటిలో జనరల్-221, ఎస్సీ-81, ఎస్టీ-40, ఓబీసీ-145, ఈడబ్ల్యూఎస్-53 ఉన్నాయి.
- **జీతం:** రూ.18,000/- (లెవల్-1)
- ఈ పోస్టులకు కేవలం పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- **శారీరక ప్రమాణాలు:** సదరన్ రీజియన్ అభ్యర్థులు కనీసం 157 సెం.మీ. ఎత్తుతోపాటు బరువు 50 కేజీలు ఉండాలి.
- **వయస్సు:** 18-25 ఏండ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణత. సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** ఫిజికల్, ప్రాక్టికల్ టెస్ట్, రాతపరీక్ష, మెడికల్ టెస్టుల ద్వారా చేస్తారు.
- ఫిజికల్ టెస్ట్‌లో భాగంగా మైలు దూరాన్ని 10 నిమిషాల్లో పరుగెత్తాలి.
- ప్రాక్టికల్ టెస్ట్‌లో స్టాటిక్ ఇంజిన్ పార్ట్‌ల గురించి, ఆయిల్/లూబ్రికెంట్స్, టూల్స్, ఎక్విప్‌మెంట్ల గురించి ఇస్తారు. దీనికి 25 మార్కులు కేటాయిస్తారు.
- రాతపరీక్ష 100 మార్కులకు ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో (వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి)
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన 45 రోజుల్లోగా పంపాలి. ప్రకటన అక్టోబర్ 11న విడుదలైంది.
- **ఫీజు:** జనరల్/ఈడబ్ల్యూఎస్, ఓబీసీ, ఎక్స్‌సర్వీస్‌మెన్లకు రూ.50. ఇతరులకు ఫీజు లేదు.
- **వెబ్‌సైట్:** www.bro.gov.in.

## 'యూపీఎస్సీ' 88 ఖాళీలు

**కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు విభాగాల్లో 88 ఖాళీల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది.**

**పోస్టులు-ఖాళీలు-అర్హతలు:**

- బాటనిస్ట్-13
- **అర్హతలు:** పీజీ (బాటనీ/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్)తోపాటు మూడేండ్ల అనుభవం ఉండాలి.
- గ్రేడ్-2 లీగల్ ఆఫీసర్-6
- **అర్హతలు:** పీజీ (లా)లో ఇంటర్నేషనల్ లా స్పెషలైజేషన్‌గా కలిగి ఉండాలి.
- జాయింట్ అసిస్టెంట్ డైరెక్టర్-13
- **అర్హతలు:** బీటెక్/బీఈ
- **పోస్టు:** గ్రేడ్-3 స్పెషలిస్ట్.
- **విభాగాల వారీగా ఖాళీలు:** బయోకెమిస్ట్రీ-2, కార్డియాలజీ-1, ఫోరెన్సిక్ మెడిసిన్-3, జనరల్ మెడిసిన్-15, జనరల్ సర్జరీ-9, న్యూరో సర్జరీ-5, పీడియాట్రిక్ సర్జరీ-1 ఉన్నాయి.
- **అర్హతలు:** ఎంబీబీఎస్/పీజీ/ఎండీ, ఎంఎస్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30- 45 ఏండ్లు మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 31
- **వెబ్‌సైట్:** http://www.upsconline.nic.in

# సబ్ కలెక్టర్‌గా అంధ మహిళ

### తిరువనంతపురంలో బాధ్యతలు స్వీకరించిన ప్రంజల్ పాటిల్

### దేశంలోనే తొలి అంధ ఐఏఎస్



**తిరువనంతపురం, అక్టోబర్ 14:** దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఐఏఎస్)కు ఎంపికైన అంధ మహిళ ప్రంజల్ పాటిల్ (30) సోమవారం కేరళలోని తిరువనంతపురం జిల్లా సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మహారాష్ట్రలోని ఉల్లాస్‌నగర్‌కు చెందిన ప్రంజల్ పాటిల్ ఆరేండ్ల వయస్సులోనే చూపు కోల్పోయారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) 2016 పరీక్షల్లో 773వ ర్యాంక్ సాధించిన ప్రంజల్ ఆ మరుసటి సంవత్సరం 124వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆమె ట్రైనింగ్ పీరియడ్‌లో తొలుత ఎర్నాకుళం అసిస్టెంట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'మనం ఎప్పటికీ ఓడిపోకూడదు.. ఎప్పటికీ వదులుకోకూడదు.. మనం చేసే ప్రయత్నాల్లోనే మన పురోగతి కనిపిస్తుంది' అని వ్యాఖ్యానించారు.

# వైభవంగా సహస్ర చండీయాగం

**కల్లూరు:** లోకకల్యాణం కోసం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలో ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తలపెట్టిన సహస్ర చండీయాగం వైభవంగా కొనసాగుతోంది. రెండోరోజు సోమవారం పొంగులేటి సోదరులు ఉదయం రామాలయం, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం యాగశాలకు చేరుకున్నారు. పీఠాధిపతులు, ఋత్వికుల ఆధ్వర్యంలో యాగశాలలో ఉదయం గురుదేవతా ప్రార్థన, పుణ్యాహవచనం, గణపతిపూజ, మహాసంకల్పం, దేవలంబి యాగశాల సంస్కారం, సహస్ర మోదక గణపతి హవనం, గోపూజ, చండీయంత్ర స్థాపనం, రుద్రపునశ్చరణ, చతుర్వేద హవనం ప్రారంభం, సప్తసతీ పారాయణం, సవరణ పూజ, కన్యకాపూజ, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ వంటి పూజలు నిర్వహించారు. సాయంకాలం ప్రారంభమైన చండీపూజల్లో నవాక్షరి, మూలమంత్ర అనుష్టానం, రుద్రక్రమార్చన, అష్టాఉదారసేవ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠాధిపతి మాదవానంద సరస్వతి స్వామిజీ యాగం వద్దకు రావడంతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయనకు ఘనస్వాగతం పలికి పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఋత్వికులు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం చేపట్టిన చండీయాగం ద్వారా సకల ప్రాణకోటికి శుభం కలుగుతుందన్నారు.



మాధవానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న పొంగులేటి దంపతులు



జపాన్‌లో హగిబిస్ తుఫాన్ ధాటికి జలమయమైన మరుమోరి పట్టణంలో నీటమునిగిన వాహనాలు

# జపాన్ విలవిల

- హగిబిస్ తుఫాన్ ధాటికి 56 మంది మృతి
- గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం

**టోక్యో, అక్టోబర్ 14:** హగిబిస్ తుఫాన్ ధాటికి జపాన్ విలవిల లాడుతున్నది. భారీ వర్షాలు, వరదల వల్ల 56 మంది మృతి చెందగా సుమారు 15 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టిన్నట్లు జాతీయ చానల్ ఎన్‌హెచ్‌కే సోమవారం పేర్కొంది. తుఫాన్ కారణంగా జరిగిన ప్రమాదాల్లో వంద మందికిపైగా గాయపడినట్లు వెల్లడించింది. శనివారం తీరం దాటిన హగిబిస్ తుఫాన్ జపాన్‌ను అల్లకల్లోలం చేసింది. భారీ వర్షాలకు రాజధాని నగరం టోక్యోతోపాటు నాగానో, హోయాసు వంటి పలు పట్టణాలు జలమయమయ్యాయి. వరద నీరు ఇండ్లను ముంచెత్తడంతో వేలాది మంది వాటిని వీడి సహాయక శిబిరాలకు చేరారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న వారిని పడవలు, హెలికాప్టర్లలో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వరదలకు 20కిపైగా నదులు పొంగిపొర్లాయి. చికుమా నది ఆనకట్ట తెగిపోవడంతో నాగానో పరిధిలో పలువురు గల్లంతయ్యారు. సహాయక చర్యల కోసం అగ్నిమాపక దళంతోపాటు సైన్యాన్ని రంగంలోకి దించారు. వరదల వల్ల పలు ప్రాంతాల్లో భారీగా మట్టి పేరుకుపోయింది. ఆపిల్ పంటలకు అపార నష్టం వాటిల్లింది. కాగా సోమవారం వర్షాలు కాస్త తెరిపించాయి. దీంతో టోక్యోలో పరిస్థితులు కొంత సాధారణ స్థితికి వచ్చాయి. గత రెండు రోజులుగా ఇండ్లకే పరిమితమైన జనం బయటకు వచ్చారు. చాలా ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించామని, ఇంకా 35,100 ఇండ్లకు విద్యుత్ సరఫరా లేదని టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ తెలిపింది. ట్యోక్యో, నాగానో మార్గాల్లో పరిమితంగా బుల్లెట్ రైళ్లను నడుపుతున్నట్లు ఈస్ట్ జపాన్ రైల్వే కంపెనీ వెల్లడించింది. మరోవైపు సహాయక శిబిరాల నుంచి కొందరు తమ ఇండ్లకు తిరిగి వచ్చి శుభ్రం చేసుకునేపనిలోపడ్డారు. శిబిరాల్లో ఉన్న సుమారు 30 వేల మంది తమ ఇండ్లు ఎలా ఉన్నాయోనని ఆందోళన చెందుతున్నారు. గత పదేండ్లలో ఎప్పుడూ ఇలాంటి తీవ్రమైన తుఫాన్‌ను చూడలేదన్నారు.

**ప్రత్యేక విపత్తు బృందాన్ని ఏర్పాటు చేస్తాం: షింజో అబే**

తుఫాన్ వల్ల ప్రభావితమైనవారికి సహాయం, పునరావసం, విద్యుత్‌ను పునరుద్ధరణ వంటి అత్యవసర సేవల కోసం ఆయా మంత్రిత్వ శాఖ అధికారులతో కూడిన ప్రత్యేక విపత్తు బృందాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాని షింజో అబే తెలిపారు. తుఫాన్ నష్టం చాలా తీవ్రంగా ఉన్నదని, పలువురు గల్లంతయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేగవంతంగా స్పందించి ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత తమకు ఉన్నదని అబే చెప్పారు.

# కశ్మీర్‌లో సెల్‌ఫోన్ల పునరుద్ధరణ

- ఇంటర్నెట్ లేకుండా 40 లక్షల పోస్ట్ పెయిడ్ ఫోన్ సేవలు పునఃప్రారంభం
- రింగ్ టోన్లతో మార్మోగిన కశ్మీర్.. ఆనంద డోలికల్లో ప్రజలు
- ప్రీపెయిడ్ కనెక్షన్లు, ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు కొనసాగింపు



72 రోజుల తర్వాత ఫోన్‌లో బంధువుల యోగక్షేమాలు కనుక్కొంటున్న ఓ యువకుడు



పోస్ట్‌పెయిడ్ కనెక్షన్‌ను పునరుద్ధరించుకొనేందుకు సోమవారం శ్రీనగర్‌లోని టెలికాం కార్యాలయం ఎదుట బారులు తీరిన ప్రజలు

**శ్రీనగర్, అక్టోబర్ 14:**

దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత కశ్మీర్ లోయలో మొబైల్ ఫోన్లు మోగాయి. సుమారు 40 లక్షల పోస్ట్‌పెయిడ్ సబ్‌స్క్రైబర్లు కశ్మీర్‌లోయతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో గల తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా ఫోన్లలో ముచ్చటించుకున్నారు. కశ్మీర్ అంతటా పండుగ వాతావరణం నెలకొంది. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలిగించి రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న ఆగస్టు ఐదో తేదీ నుంచి కశ్మీర్ లోయలో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిషేధించిన సంగతి తెలిసిందే. అయితే, శనివారం ఇచ్చిన హామీ మేరకు సరిగ్గా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్నెట్ సేవల్లేకుండా పోస్ట్ పెయిడ్ ఫోన్ కనెక్షన్లను ప్రభుత్వం పునరుద్ధరించింది. వీటిల్లో వాయిస్ కాల్స్ చేసుకోవడంతోపాటు ఎస్సెమ్మెస్‌లు పంపుకోవడానికి మాత్రమే అనుమతినిచ్చింది. కాగా, వాట్సాప్‌తోపాటు మరో 25 లక్షలకు పైగా ప్రీపెయిడ్ మొబైల్ ఫోన్లు, ఇతర ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించలేదని అధికారులు తెలిపారు. సరిగ్గా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీనగర్‌లోని లాల్ చౌక్ ప్రాంతం మొబైల్ ఫోన్ల రింగ్‌టోన్లతో మార్మోగింది. కొందరు వాహనాలు నడుపుతూ కూడా ఫోన్లలో మాట్లాడటం కనిపించింది. రంజాన్‌కు సరిగ్గా ఏడు రోజుల ముందు నిషేధించిన మొబైల్ ఫోన్ సేవలు సోమవారం పునఃప్రారంభం కావడంతో అంతా పరస్పరం 'ఈద్ ముబారక్'తో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నిఘాట్ షా అనే వ్యక్తి మాట్లాడుతూ, 'మాకు ఈ రోజు ఈద్ కంటే తక్కువేం కాదు. ప్రపంచీకరణ యుగంలో దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోయి ప్రపంచం అంతా ఒక్కటైంది. కానీ రెండు నెలలకు పైగా మాకు మిగతా ప్రపంచంతో సంబంధాలు లేవు' అని అన్నారు. శ్రీనగర్‌లోని ఓల్డ్ సిటీకి చెందిన బషారత్ అహ్మద్ మాట్లాడుతూ గంట సేపట్లో కశ్మీర్‌లో, బయట ఉన్న తన బంధుమిత్రులకు 30 కాల్స్ చేశానని చెప్పారు. 72 రోజుల పాటు సొంత వారితో మాట్లాడకుండా ఉండటం ఎంతో కష్టమని చెప్పారు. యాసిర్ అహ్మద్ అనే యువకుడు త్వరలో తాను పెండ్లి చేసుకోబోయే యువతితో మాట్లాడినట్లు చెప్పాడు. కేవలం ఐదు కి.మీ. దూరంలో ఉన్నా.. ఆంక్షలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆమె బాగోగులు తెలుసుకోలేకపోయానని వాపోయాడు. శ్రీనగర్‌లో విద్యాభ్యాసం చేస్తున్న ముజామ్మిల్ అహ్మద్ షా అనే విద్యార్థి షోపియాన్‌లోని తన బామ్మకు తొలుత ఫోన్ చేశాడు. తల్లిదండ్రులతోనూ మాట్లాడాడు. ఇక రెండు నెలలకు పైగా ఆంక్షలు అమలులో ఉండటం వల్ల పోస్ట్ పెయిడ్ వినియోగదారులు బిల్లులు చెల్లించక వారి ఫోన్లు మూగబోయాయి. దీంతో వారంతా మొబైల్ దుకాణాలకు పరుగులు తీసి, బిల్లులు చెల్లించారు. కానీ మధ్యాహ్నానికే దుకాణాలను మూసేశారు. ఒక దుకాణ యజమాని మాట్లాడుతూ 'ఫోన్ లైన్ల పునరుద్ధరణతో సాధారణ జీవితమేమిటో మాకు మళ్లీ గుర్తుకువచ్చింది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఫోన్లలో మాట్లాడటం సాధారణం. కానీ మాకు అదొక అద్వితీయమైన అసాధారణ అంశంగా మారిపోయింది' అని వ్యాఖ్యానించాడు. మరోవైపు మొబైల్ ఫోన్ సేవల పునరుద్ధరణ నేపథ్యంలో తలెత్తే సవాళ్లను అధిగమించేందుకు కశ్మీర్ లోయ అంతటా భద్రతాబలగాలు అప్రమత్తం అయ్యాయి. పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశాయి. త్రివిధ దళాల కీలక అధికారులతోపాటు వివిధ భద్రతా సంస్థల అధికారులు పరిస్థితిని సమీక్షించారు. ఈ నెల 10 నుంచి లోయలోకి పర్యాటకులను అనుమతించారు. విద్యా సంస్థలను ప్రారంభించినా విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉంది. కశ్మీర్‌లోయలో ఆగస్టు 17న పాక్షికంగా ఫిక్స్‌డ్ లైన్ టెలిఫోన్ సేవలను, గత నెల నాలుగో తేదీన సుమారు 50 వేల ల్యాండ్‌లైన్ ఫోన్ల సేవలను పునరుద్ధరించారు. జమ్ము పరిధిలో ఫోన్, ఇంటర్నెట్ సేవలను ఆగస్టు రెండో వారంలోనే పునరుద్ధరించినా వాటిని దుర్వినియోగం చేయడంతో అదే నెల 18 నుంచి ఆంక్షలు అమల్లోకి తెచ్చారు. కశ్మీర్ లోయలో 84 లక్షల ఫోన్ కనెక్షన్లు ఉన్నాయి. కశ్మీరీల్లో ద్వేషాన్ని రగిల్చేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించే అవకాశాలు ఉన్నందు వల్లే మొబైల్ ఫోన్ల వినియోగంపై ఆంక్షలు విధించామని ఇంతకుముందు జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెప్పారు.

# పిటిషన్ ఉపసంహరణకు ఓకే

### తమిళిసైకి మద్రాసు హైకోర్టు అనుమతి



**చెన్నై, అక్టోబర్ 14:** తమిళనాడు బీజేపీ శాఖ మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందర్‌రాజన్ డీఎంకే ఎంపీ కనిమొళికి వ్యతిరేకంగా దాఖలుచేసిన ఎన్నికల పిటిషన్‌ను ఉపసంహరించుకొనేందుకు మద్రాస్ హైకోర్టు సోమవారం అనుమతిచ్చింది. తమిళిసై తెలంగాణ గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఈ పిటిషన్ దాఖలుచేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 18న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తమిళిసై తూత్తుకుడి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీచేసి కనిమొళి చేతిలో 3.47 లక్షలపైచిలుకు ఓట్లతేడాతో ఓటమిపాలయ్యారు. దీంతో తమిళిసైతోపాటు తూత్తుకుడి ఓటర్ శంతనకుమార్ దాఖలుచేసిన పిటిషన్లు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఎం సుబ్రమణ్యం ఎదుట విచారణకు వచ్చాయి. ఎన్నికల నామినేషన్ పత్రాల్లో కనిమొళి తన భర్తతోపాటు కుమారుని ఆస్తులకు సంబంధించిన కొన్ని వాస్తవాలను దాచిపెట్టారని తమిళిసై ఆ పిటిషన్‌లో ఆరోపించారు. అయితే తెలంగాణ గవర్నర్‌గా రాజ్యాంగ పదవిలో నియమితులైనందున తమిళిసై తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని భావిస్తున్నట్టు ఆమె తరపు న్యాయవాది తెలియజేయడంతో జడ్జి అందుకు అనుమతించారు. పిటిషన్ ఉపసంహరణకు తమిళిసై తీసుకున్న నిర్ణయాన్ని ఓ ఆంగ్ల దినపత్రికతోపాటు ఓ తమిళ దినపత్రికలో ప్రచురించాలని న్యాయమూర్తి ఆమెను ఆదేశిస్తూ.. ఈ అంశంపై తదుపరి విచారణను నవంబర్ 11కు వాయిదా వేశారు. శంతనకుమార్ దాఖలుచేసిన పిటిషన్‌ను తిరస్కరించాలన్న కనిమొళి విన్నపంపై పిటిషనర్‌కు న్యాయమూర్తి నోటీసు జారీచేసి, ఈ అంశంపై విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.



భూపాలపల్లిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్(పీపీ) భాస్కర్‌రావు

# ప్రత్యేక ప్రణాళికతో కొత్తరూపు

- 30 రోజుల్లో పల్లెల్లో అమోఘమైన మార్పు
- దళిత సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కొత్తపల్లిలో పల్లె ప్రగతి పనుల పరిశీలన



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మారం:** సీఎం కేసీఆర్ నూతనంగా రూపొందించిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళికతో గ్రామాలు అందంగా రూపుదిద్దుకున్నాయని దళిత సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తపల్లిలో 30 రోజుల ప్రణాళిక కింద చేపట్టిన పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కొప్పుల సంతృప్తి వ్యక్తం చేసి, సర్పంచ్ కోమటిరెడ్డి లలితను అభినందించారు. హరితహారంలో భాగంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఇదివరకు ఏ ప్రభుత్వం కూడా గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకోలేదనీ, కేవలం టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న పనుల వల్లే పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని చెప్పారు. పల్లెలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 30 రోజుల ప్రణాళికను చేపట్టడటంతోపాటు ప్రత్యేకంగా నిధులను విడుదల చేసిందన్నారు. దీంతో పల్లెలు ప్రగతిలో పరుగులు తీస్తున్నాయని చెప్పారు. చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడంతో గ్రామాలు అందంగా మారాయనీ, వ్యాధులు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. పల్లె ప్రగతి ఇక నిరంతరంగా సాగుతుందని మంత్రి తెలిపారు.

## కొత్తపల్లి సర్పంచ్ ఆదర్శం

### ఐదేండ్లపాటు గ్రామస్థుల ఇంటి పన్ను చెల్లింపునకు హామీ

### తొలి ఏడాదికిగాను రూ.87 వేలు చెల్లింపు

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తపల్లికి చెందిన సర్పంచ్ కోమటిరెడ్డి లలిత ఆదర్శంగా నిలుస్తున్నారు. ఐదేండ్లపాటు గ్రామస్థుల ఇంటి పన్ను తాను సొంతంగా చెల్లించేందుకు ముందుకువచ్చారు. ఇందులో భాగంగా మొదటి ఏడాదికిగాను రూ.87 వేలు కట్టారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో అందుకు సంబంధించిన చెక్కును మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అందజేశారు. ఇంటి పన్నులకు సంబంధించిన రసీదులను అందించిన మంత్రి.. సర్పంచ్ లలితను అభినందించారు.



రూ. 87వేలకు సంబంధించిన చెక్కును మంత్రి ఈశ్వర్‌కు అందిస్తున్న సర్పంచ్ లలిత

# చిదంబరం అరెస్ట్‌పై తీర్పు రిజర్వ్

### ఐఎన్‌ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో ఈడీ పిటిషన్

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ ఆర్థికశాఖ మంత్రి పీ చిదంబరాన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ ప్రత్యేక కోర్టు తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. తీర్పును మంగళవారం ప్రకటించనున్నట్టు ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ కుమార్ కుషార్ పేర్కొన్నారు. ఐఎన్‌ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో చిదంబరాన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతి కోరుతూ ఈడీ గత శుక్రవారం ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఈడీ తరపున సోమవారం వాదనలు కొనసాగించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. మనీ లాండరింగ్ అనేది ప్రత్యేక నేరమని, చిదంబరం కస్టోడియల్ విచారణ అవసరమని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని ప్రత్యేక కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చిదంబరం అరెస్ట్‌కు, రిమాండ్‌కు అనుమతివ్వాలని కోర్టును కోరారు. కాగా, చెల్లింపులు, విదేశాల్లో ఉన్న సంస్థలపై దర్యాప్తు కోసం సీబీఐ ఇప్పటికే తన కస్టడీని కోరిందని, నేరం ఒకేలా ఉన్నందున మళ్లీ విచారించాల్సిన అవసరం ఈడీకి లేదని చిదంబరం తరపున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. సీబీఐ నమోదుచేసిన ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో ఈ నెల 17 వరకు చిదంబరం జ్యూడిషియల్ కస్టడీలో ఉండనున్నారు.

# సిలిండర్ పేలి 12 మంది మృతి

### యూపీలో దుర్ఘటన



యూపీలోని వాలిద్‌పూర్‌లో సిలిండర్ పేలిన భవనం వద్ద సహాయక చర్యలు

**మాయు (యూపీ):** రెండంతస్తుల భవంతిలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో 12 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన సోమవారం ఉదయం ఉత్తర్‌ప్రదేశ్ మాయు జిల్లాలోని వాలిద్‌పూర్‌లో జరిగింది. సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. వంట చేస్తుండగా సిలిండర్ పేలినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. గాయపడిన వారిని జిల్లా దవాఖానకు తరలించారని, శిథిలాలను తొలగించే ప్రక్రియను పోలీసులు, అగ్నిమాపకశాఖ సిబ్బంది చేపట్టారని మాయు కలెక్టర్ జ్ఞాన్‌ప్రకాశ్ త్రిపాఠి తెలిపారు. సహాయక చర్యలు అందించేందుకు వారణాసి నుంచి ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది వచ్చిన్నట్టు ఎస్పీ అనురాగ్ ఆర్య చెప్పారు. ఘటన పట్ల ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ విచా రం వ్యక్తం చేశారు. తగిన సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా పోలీసులు, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు.

# ఒడిశాలోనూ బొగ్గు ఉత్పత్తి

### సింగరేణి డైరెక్టర్ (పీపీ) భాస్కర్‌రావు వెల్లడి

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సింగరేణి సంస్థ తన కార్యకలాపాలను విస్తరిస్తూ ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు వెలికితీత పనులను కొనసాగిస్తున్నదని సింగరేణి డైరెక్టర్(పీపీ) బీ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం ఆయన భూపాలపల్లిలోని బొగ్గు గనులను సందర్శించారు. భూపాలపల్లి ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి, తదితర అంశాలపై అధికారులతో చర్చించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సింగరేణి సంస్థ ఒడిశాలో రెండు బ్లాకుల్లో బొగ్గు ఉత్పత్తి చేయనున్నదని తెలిపారు. నైని బ్లాకుతోపాటు మరో బ్లాకులో ఏడాదికి 30 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు వెల్లడించారు. బొగ్గు ఉత్పత్తితోపాటు విద్యుత్ ఉత్పత్తి రంగంలోనూ సింగరేణి సంస్థ అడుగుపెట్టి విజయవంతమైందన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణి బొగ్గు ఉత్పత్తి పనులను ప్రారంభిస్తున్నదని తెలిపారు. సౌర విద్యుత్ ప్లాంట్లను సైతం ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయడం జరుగుతుందన్నారు. భూపాలపల్లిలో ఓసీ-3 ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్మికుల కోసం భూపాలపల్లిలో మరో వెయ్యి క్వార్టర్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. దీనికి తోడు వెంకటాపురం వద్ద మరో ఓసీ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. బొగ్గు ఉత్పత్తితోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను, పర్యావరణ పరిక్షణ కార్యక్రమాల నిర్వహణలోనూ సింగరేణి ముందుంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్లాస్టిక్ నిషేధాన్ని సింగరేణి కచ్చితంగా అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో జీఎం నిరీక్షణ్‌రాజ్, ఎస్ఓటూ జీఎం రఘుపతి పాల్గొన్నారు.

# ఎస్జీటీలుగా బీసీ స్టడీసర్కిల్ అభ్యర్థులు

### అభినందనలు తెలిపిన మంత్రి గంగుల కమలాకర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ బీసీ స్టడీసర్కిల్ నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పరీక్షలకు శిక్షణ పొందిన 808 మంది అభ్యర్థుల్లో 63 మంది ఎంపికయ్యారు. ఎస్జీటీలుగా ఎంపికైనవారికి బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రణాళికాబద్ధంగా ఇస్తున్న శిక్షణ, అభ్యర్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ప్రజాపంపిణీలో తెలంగాణ మేటి

- మెరుగైన సేవల కోసం మొబైల్ యాప్స్
- జాతీయ ఆహార కార్యదర్శుల సదస్సులో పౌరసరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సాంకేతిక పరిజ్ఞానంతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలో అద్భుత ప్రగతిని సాధించిందని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ పేర్కొన్నారు. 'ప్రజాపంపిణీలో సంస్కరణలు, వినూత్న చర్యలు' అంశంపై గుజరాత్‌లో జరుగుతున్న రెండురోజుల జాతీయస్థాయి సదస్సులో ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆహార కార్యదర్శులు పాల్గొన్నారు. సోమవారం మొదటి రోజు సదస్సులో పాల్గొన్న అకున్ సబర్వాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణ ప్రజాపంపిణీ వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు, సాధించిన విజయాలను వివరించారు. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3.51 కోట్ల మంది ఉన్నారని, 87.72 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా 2.81 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని వివరించారు. కుటుంబంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కిలో రూపాయికే ఆరు కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నట్టు తెలిపారు. లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకొనేందుకు వీలుగా 2018 మే నెలలో రేషన్ పోర్టబిలిటీని ప్రారంభించామని, ప్రతి నెల దాదాపు 13 లక్షల మంది పోర్టబిలిటీని ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. ధాన్యం సేకరణ, ప్రజాపంపిణీ వ్యవస్థను పకడ్బందీగా చేపట్టడానికి మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఓపీఎంఎస్, కొనుగోలు కేంద్రాల జియో ట్యాగింగ్, రైస్ మిల్లర్ల లావాదేవీలకు సంబంధించి యాప్, టీ రేషన్ యాప్, టీ వాలెట్ యాప్ వంటి సదుపాయాలు కల్పించామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంతో పౌరసరఫరాలశాఖలో పారదర్శకత, జవాబుదారీతనం ఏర్పడిందని వివరించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల ఆహార, పౌరసరఫరాల కార్యదర్శులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలో వినూత్న మార్పులు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నదని ప్రశంసించారు.

# ఆర్మీ ఎంపికలో సేవాసమితి అభ్యర్థుల ప్రతిభ

### 107 మంది ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరీంనగర్‌లో ఈ నెల 7 నుంచి నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో సింగరేణి సేవాసమితి ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులు ప్రతిభ చాటారు. ఆదివారం వరకు దేహదారుఢ్య పరీక్షలో 187 మంది పాల్గొనగా 107 మంది ఎంపికయ్యారు. ఈ సంస్థ మొదటిసారిగా గురుకుల విధానంలో 3 నెలలపాటు విశ్రాంత ఆర్మీ అధికారులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. దశలవారీగా నిర్వహిస్తున్న వైద్యపరీక్షలో ఇప్పటికే 30 మంది అర్హత సాధించారు. శిక్షణలో రాటుదేలిన కారణంగానే అధికసంఖ్యలో ఎంపికయ్యారని సింగరేణి సేవాసమితి ఉపాధ్యక్షుడు ఆంటోనిరాజా తెలిపారు. వైద్యపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు నవంబర్ 24న జరిగే రాతపరీక్షకు సిద్ధం చేసేందుకు రామగుండం-2 ఏరియాలో ఈ నెల 20 నుంచి గురుకుల పద్ధతిలో నిపుణులతో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు.



షాహిద్‌కపూర్

# హిందీలో 'జెర్సీ'



గౌతమ్ తిన్ననూరి

'అర్జున్‌రెడ్డి' హిందీ రీమేక్ 'కబీర్‌సింగ్'లో కథానాయకుడిగా నటించి కెరీర్‌లోనే భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు షాహిద్‌కపూర్. తాజాగా ఆయన తెలుగు 'జెర్సీ' రీమేక్‌లోను హీరోగా నటించబోతున్నారు. వివరాల్లోకి వెళితే..నాని కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన 'జెర్సీ' చిత్రం విమర్శకులు ప్రశంసల్ని సొంతం చేసుకుంది. క్రికెట్ నేపథ్యంలో కుటుంబ భావోద్వేగాలు కలబోసిన ఈ చిత్రం చక్కటి ఎమోషనల్ డ్రామాగా మెప్పించింది. ఈ సినిమాను షాహిద్‌కపూర్ కథానాయకుడిగా హిందీలో రీమేక్ చేయబోతున్నారు. అల్లు అరవింద్, దిల్ రాజు, అమన్‌గిల్ హిందీ రీమేక్‌కు నిర్మాతలుగా వ్యవహరించబోతున్నారు. తెలుగు మాతృకకు దర్శకత్వం వహించిన గౌతమ్ తిన్ననూరి హిందీ వెర్షన్‌కు కూడా నిర్దేశక బాధ్యతల్ని నిర్వహిస్తారు. వచ్చే ఏడాది ఆగస్ట్ 28న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# 'ఆటో రజని'కి జగన్ ఆశీస్సులు



జగన్మోహన్‌రెడ్డి, హరికృష్ణ

జె.ఎస్.ఆర్ మూవీస్ పతాకంపై జొన్నలగడ్డ శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'ఆటో రజని'. జొన్నలగడ్డ హరికృష్ణ కథానాయకుడిగా నటిస్తున్నారు. చిత్రబృందానికి ఇటీవల ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో కొత్తగా అడుగుపెట్టిన హరికృష్ణకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులు అందించడం ఆనందంగా ఉంది. ఆయన అభినందనల్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. పవర్‌ఫుల్‌మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. 'ప్రేమెంత పనిచేసే నారాయణ' సినిమాతో హీరోగా మంచిపేరు తెచ్చుకున్న హరికృష్ణ ఈ చిత్రంలో కొత్త పంథాలో కనిపిస్తారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని తొందరలో వెల్లడిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సమర్పకుడు: బి. లింగుస్వామి.

**'హారర్ సినిమాలు ఒంటరిగా చూడటమంటే నాకు చాలా భయం. కుటుంబసభ్యులు, స్నేహితుల తోడు లేకుండా ఈ సినిమాల్ని చూడను' అని చెప్పింది అవికాగోర్. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'రాజుగారి గది-3', ఓంకార్ దర్శకుడు. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో అవికాగోర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఆ విశేషాలివి..**

# అద్దంలో చూసుకొని రెండురోజులు నిద్రపోలేదు



అవికాగోర్

రియాలిటీ షో, టీవీ సిరీస్‌లతో పాటు హిందీ సినిమాలో నటిస్తూ బిజీగా ఉండటంతో మూడేళ్లుగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్నాను. ఈ విరామంలో తెలుగులో చాలా అవకాశాలు వచ్చాయి. కానీ ఆ కథలేవీ నాలో ఆసక్తిని రేకెత్తించలేదు. డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆ చిత్రాల్ని అంగీకరించలేదు.

'ఖత్రా ఖత్రా ఖత్రా' టీవీ సిరీస్ చేస్తున్నప్పుడు మధ్యలో విరామం దొరకడంతో ఓంకార్ చెప్పిన ఈ కథ విన్నాను. 'తమన్నాతో ఈ సినిమా చేయాలనుకున్నాను. కానీ ఆమె డేట్స్ అందుబాటులో లేకపోవడంతో కుదరలేదు. అందువల్లే మీ దగ్గరకు వచ్చాను' అని ఓంకార్ చెప్పారు. ఇతర నాయికలు చేయాల్సిన పాత్రలో నేను నటిస్తున్నాననే ఆలోచనలేవి మనసులో పెట్టుకోకుండా నా పాత్రకు పరిపూర్ణంగా న్యాయం చేయడానికి ప్రయత్నించాను.

**హారర్ సినిమాలు చూశా..**

ఓంకార్ కథ చెప్పడం మొదలుపెట్టిన నలభై నిమిషాల్లోనే సినిమాకు ఓకే చెప్పాను. ఆయన కథ చెబుతున్నప్పుడే భయపడ్డాను. హారర్ హంగులతో పాటు చక్కటి వినోదం మిళితమైన చిత్రమిది. నా పాత్ర ప్రేక్షకుల్ని భయపెడుతుంది. తొలి రోజు షూటింగ్‌లో మేకప్‌లో వేసుకున్న తర్వాత నన్ను నేను అద్దంలో చూసుకొని భయపడ్డాను. రెండు రోజులు నిద్రపోలేదు. పాత్రకు సంబంధించిన భావవ్యక్తీకరణను అర్థం చేసుకొని నటించడం కోసం చాలా హారర్ సినిమాలు చూశాను.

**సాధారణ ప్రేక్షకురాలిగా ప్రతి కథను వింటాను. ఆ సినిమాను నేను ఎంజాయ్ చేయగలనా? లేదా? ఆలోచించి అంగీకరిస్తాను.**

**కేరళ అమ్మాయిగా..**

పక్కింటి అమ్మాయి తరహాలో నా పాత్ర సాగుతుంది. కేరళకు చెందిన ఆమె జీవితంలో చోటుచేసుకున్న అనూహ్య సంఘటనలేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. అనుభవజ్ఞులైన నటీనటులు, సాంకేతిక నిపుణులతో పనిచేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. తెరపై అందంగా కనిపించడానికి లుక్ విషయంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోను. కథ, దర్శకుడితో పాటు నా పాత్రను నమ్మి సినిమాలు చేస్తాను.

**హైదరాబాద్‌లో ఉంటున్నా..**

తెలుగు సినిమాలు నటిగా నాలో పరిణితిని కనబరచడానికి దోహదం చేశాయి. తెలుగు భాషను అర్థం చేసుకుంటూ నటించడానికి చాలా హార్డ్‌వర్క్ చేస్తాను. అవన్నీ నాకో అనుభవపాఠాలుగా ఉపయోగపడ్డాయి. సినిమాలతో పాటు టీవీకి ప్రాముఖ్యతనిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తాను. ప్రస్తుతం నా దృష్టంతా టాలీవుడ్ పైనే ఉంది. అందుకే ఎనిమిది నెలలుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నాను. వెబ్‌సిరీస్‌లో అవకాశాలు వస్తున్నాయి. తెలుగులో ఓ కొత్త సినిమాను అంగీకరించాను. మరో పదిహేను రోజుల్లో ఆ వివరాల్ని వెల్లడిస్తాను.



# జీవితమే ఒక ఉత్సవం

'జీవిత చరమాంకంలో ఉన్నప్పుడు నైరాశ్యంలో కూరుకుపోకుండా మరణాన్ని కూడా ఉత్సవంలా జరుపుకోవాలనే మానవీయ ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రతి ఒక్కరి హృదయాల్ని స్పృశిస్తుంది' అంటున్నారు మారుతి. ఆయన దర్శకత్వంలో సాయితేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రతిరోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. తదుపరి షెడ్యూల్‌ను అమెరికాలో జరిపేందుకు ప్లాన్ చేశారు. నేడు హీరో సాయితేజ్ జన్మదినం సందర్భంగా కొత్త స్టిల్స్‌ను విడుదల చేశారు. 'ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. వినోదప్రధానంగా విలువలతో కూడిన చిత్రమిది. సాయితేజ్ పాత్ర చిత్రణ నవ్యంగా ఉంటుంది' అని చిత్ర బృందం తెలిపింది. సత్యరాజ్, విజయకుమార్, రావు రమేష్, మురళీశర్మ, అజయ్, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, సత్యశ్రీనివాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జయకుమార్, సంగీతం: తమన్ ఎస్, రచన-దర్శకత్వం: మారుతి.



ప్రతిభ, అడివి సాయికిరణ్, అనిల్ రావిపూడి, అడివి శేష్ తదితరులు

# కశ్మీర్ పండిట్ల వెతలకు దృశ్యరూపం

'యువ హీరోలతో పాటు సాంకేతిక నిపుణులంతా డబ్బులు పెట్టి చేసిన సినిమా ఇది. కథ నచ్చితే నేను పారితోషికం తీసుకోను. సినిమా డబ్బులు రాబడితేనే నాకు రెమ్యునరేషన్ ఇవ్వమని కొత్త దర్శకనిర్మాతలకు చెబుతుంటాను. అందరూ ఇదే పద్ధతి పాటిస్తే ఇండస్ట్రీ బాగుంటుంది' అని అన్నారు రాజశేఖర్. ఆదిసాయికుమార్, శషాచెత్రి, కార్తిక్‌రాజు, పార్వతీశం, అబ్బూరి రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్'. సాయికిరణ్ అడివి దర్శకుడు. ప్రతిభా అడివి, కట్టా ఆశిష్ రెడ్డి, కేశవ్ ఉమాస్వరూప్, పద్మనాభరెడ్డి, గ్యారీ బీ హెచ్, సతీష్ డేగలతో కలిసి ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 18న విడుదలకానుంది. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'నటుడిగా ఆది చాలా కష్టపడి చేసిన సినిమా ఇది. అతడికి పెద్ద విజయం దక్కాలి. దర్శకుడు సాయికిరణ్ కెరీర్‌లో మంచి చిత్రంగా నిలవాలి' అని పేర్కొన్నారు. సాయికిరణ్ అడివి మాట్లాడుతూ '1990లో కశ్మీర్ పండిట్లకు ఎదురైన సమస్యల నేపథ్యంలో సాగే కథ ఇది. అబ్బూరి రవి చాలా పరిశోధన చేసి కథను సిద్ధంచేశారు. ఈ సినిమా రూపకల్పనలో నా వెన్నంటి నిలవడమే కాకుండా ఘాజీ బాబాగా ప్రతినాయకుడి పాత్రలో ఆయన నటించారు. నా స్నేహితులతో పాటు నటీనటులు కథ నచ్చి నిర్మాణభాగస్వాములుగా చేరారు' అని తెలిపారు. కశ్మీర్ పండిట్లు ఎదుర్కొన్న వెతలకు దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుందని అబ్బూరి రవి చెప్పారు. కశ్మీర్‌లో ప్రతికూల పరిస్థితుల్లో సినిమాలోని కీలక సన్నివేశాల్ని చిత్రీకరించామని, ఈ మధ్యకాలంలో నా సినిమాలేవీ సరిగా ఆడలేదని, నా కెరీర్‌కు కీలకమైన సినిమా ఇదని ఆదిసాయికుమార్ పేర్కొన్నారు.



# నాగశౌర్య స్పోర్ట్స్ డ్రామా



నాగశౌర్యపై క్లాప్‌నిస్తున్న అల్లు అరవింద్

నాగశౌర్య కథానాయకుడిగా రూపొందిస్తున్న తాజా చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో నారాయణదాస్ నారంగ్, శరత్‌మరార్, రామ్మోహన్‌రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, దిల్‌రాజు కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇదొక స్పోర్ట్స్ డ్రామా. ఊహాత్మక జీవితకథలా ఉంటుంది. నాగశౌర్యని కొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమవుతుంది' అన్నారు. 'ఈ సినిమాకు అద్భుతమైన కథ కుదిరింది. భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. త్వరలోనే చిత్రీకరణ మొదలుపెడతాం' అని నిర్మాతల్లో ఒకరైన శరత్‌మరార్ తెలిపారు. నాగశౌర్య మాట్లాడుతూ 'ఆరు నెలలుగా ఈ స్క్రిప్ట్ మీద పనిచేస్తున్నాం. దర్శకుడు సంతోష్ సృజనాత్మకంగా కథను మలిచాడు. అందరికి నచ్చే చిత్రమవుతుంది' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనోజ్‌రెడ్డి, నిర్మాణ సంస్థలు: శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్.ఎల్.పి, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సంతోష్ జాగర్లపూడి.

# నయన్ పోలీస్ అవతారం

దక్షిణాది చిత్రసీమలో లేడీసూపర్‌స్టార్‌గా పేరు తెచ్చుకుంది నయనతార. ప్రస్తుతం ఆమె తమిళంలో వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'సైరా నరసింహారెడ్డి' చిత్రం ద్వారా ఇటీవలే తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది. తాజాగా నయనతార తమిళ, తెలుగు ద్విభాషా చిత్రంలో నటించనుంది. దీనికి హీరో రానా నిర్మాతగా వ్యవహరిస్తారు. నందినిరెడ్డి దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం. కొరియన్ సినిమా ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. తొలుత ఈ సినిమాలో కీర్తిసురేష్‌కు కథానాయికగా అనుకున్నారు. అనివార్య కారణాల వల్ల ఆమె ఈ సినిమాను అంగీకరించలేదు. డ్రగ్స్, మాఫియా నేపథ్యంలో సాగే పోలీస్ కథాంశమిదని సమాచారం. మహిళా పోలీస్ అధికారి సాహసాలకు అద్దంపట్టే ఈ కథకు నయనతార అయితే పరిపూర్ణంగా న్యాయం చేస్తుందని చిత్ర బృందం భావించిందట. కొరియన్ సినిమా గురించి తెలుసుకున్న నయనతార కాన్సెప్ట్ నచ్చడంతో ఈ సినిమా ఓకే చెప్పిందని తెలిసింది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ప్రస్తుతం నయనతార తమిళంలో బిగిల్, దర్బార్, నెట్రికన్ చిత్రాల్లో నటిస్తున్నది.



నవీన్‌రాజ్, శృతి

# వాస్తవ ఘటనలతో

నవీన్‌రాజ్, శశికాంత్, కరుణశ్రావ్య, శృతి నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'వనవాసం'. భరత్‌కుమార్, నరేంద్ర దర్శకులు. బి.సంజయ్‌కుమార్ నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలకానుంది. దర్శకద్వయం మాట్లాడుతూ 'యథార్థ ఘటనల ఆధారంగా రూపొందిస్తున్న చిత్రమిది. బలవంతుడైన శత్రువును ఓ యువకుడు ఎలా ఎదుర్కొన్నాడన్నది ఉత్కంఠను పంచుతుంది. రొమాన్స్, యాక్షన్, సందేశం, భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. ట్రైలర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని అన్నారు. కథను నమ్మి నిజాయితీగా ఈ సినిమా చేశామని, వాస్తవికతను ప్రతిబింబిస్తూ ఆసక్తిని పంచుతుందని నిర్మాత పేర్కొన్నారు. ప్రతి ఒక్కరం కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇదని హీరో నవీన్‌రాజ్ చెప్పారు.



# బూతు సినిమా కాదు



అయేషాసింగ్

అభిషేక్‌రెడ్డి, భానుశ్రీ, అయేషాసింగ్, మేఘనాచౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఏడు చేపల కథ'. శ్యామ్.జె.చైతన్య దర్శకుడు. శేఖర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్ 7న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదలచేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'టీజర్ చూసి చాలా మంది బూతు సినిమా చేసి డబ్బులు సంపాదించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి సినిమా చేసినా ఎవరూ చూడరు. టీజర్‌లో టెంప్ట్ రవి పాత్రలో ఉండే అమాయకత్వం, వినోదం అందరిని ఆకట్టుకున్నాయి. మేము 'శంకరాభరణం'లాంటి సినిమా చేశామని చెప్పడం లేదు. కేవలం యువతరాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన వినోదాత్మక చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులు సినిమాకు రావొద్దు' అని తెలిపారు. చక్కటి సందేశంతో యువతకు ఉపయోగపడేలా ఈ సినిమా చేశామని, విమర్శించిన వారే సినిమా చూసిన తర్వాత తమను అభినందిస్తారనే నమ్మకముందని నిర్మాత పేర్కొన్నారు. తెలుగులో ఇదే తన తొలి చిత్రమిదని, వివాదాల్ని దాటుకొని అందరిని అలరిస్తుందని అయేషాసింగ్ చెప్పింది. ఈ కార్యక్రమంలో బాపినీడు, వీరభద్రమ్‌చౌదరి, ఇషిక, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

# తొలిసారి మహిళా కథలో..

ఈషారెబ్బ కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'రాగల 24గంటల్లో'. శ్రీనివాస్ రెడ్డి దర్శకుడు. మహిళా ప్రధాన ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సత్యదేవ్, శ్రీరామ్, ముస్కాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'ఈషారెబ్బా తొలిసారి నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రమిది. సంప్రదాయక వస్త్రధారణలో ఇటీవలే విడుదల చేసిన ఆమె ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. ఈషారెబ్బా పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుంది. అభినయపరంగా ఆమె కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమాగా నిలిచిపోతుంది' అని చిత్రబృందం తెలిపింది. ఓ ఇంటిలో 24గంటల్లో ఏం జరిగిందనే కథాంశంతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఈ సినిమా రూపొందించామని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: గరుడ వేగా అంజి, నిర్మాణ సంస్థ: శ్రీనవహాస్ క్రియేషన్స్, నిర్మాత: శ్రీనివాస్ కానూరు.